ఆంధ్రపత్రిక


సచిత్ర వార పత్రి



4 అణా

9-11-

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL


తలనొప్పి?
అమృతాంజనము వాడండి
వెంటనే తగ్గిపోతుంది!!
బాధను తొలగించి
హాయిని కలిగించును
అమృతాంజనము
AMRUTAN
The Pain Ba
COL 28

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 10
9.11-55

మన్మథ ఆశ్వయుజ బహుళ దశమి బుధవారం



భగీరథకృషి

—సి. గురుమూర్తి

విషయానుక్రమణిక

పెద్దకథ

వా. సి. మూర్తి

కమల నిలబడలేకపోయింది. గోడకు నిలబెట్టిన మంచానికానుకొని గోడ ఆధారంగా పట్టుకుంది. గుండె ఆగిపోతున్నట్టుంది. మనస్సు సరిగా పనిచేయడంలేదు. విపరీతమైన బాధ లోపలనుంచి పెకలించుకురావడానికి ప్రయత్నిస్తోంది. కమల అలాగే నోరు తెరచుకొని వుండిపోయింది.

గోపాలం బుచ్చిని దింపివేసి లేచి చొక్కా తొడుక్కుంటున్నాడు. ఎక్కడికో వెళ్ళిపోతాడుకాబోలు. అదిచూసి కమల ఒక్కక్షణం మనస్సు నిల్పుకొని, గొంతుక పెకలించుకుంటూ ఆఖరిప్రయత్నం చేసింది "అన్నయ్యా, మా కాసు పిల్లలందరూకూడా చదువుతున్నారన్నయ్యా. నేనుకూడా చదువుతానన్నయ్యా. ఇంతవరకూ చదివి ఆపుచేస్తే యేం బాగుంటుందన్నయ్యా? ఇంకొక్క రెండేళ్లే –"

వెంటనే వదినగారందుకుంది. "ఊఁ చదివించండి. చెల్లెలిగారిచేత ఉద్యోగాలు చేయిస్తారో ఊళ్లేలిస్తారో" అంది వెటకారంగా.

కమల అన్నగారికేసే చూసింది. ఆతురతతో చూసింది.

గోపాలం చొక్కా తొడుక్కొని మళ్ళీ మంచంమీదకూర్చొని మెల్లగానే చెప్పాడు "అమ్మాయి, నీకు మాత్రం తెలియదూ, నాన్న వెనకాల పెద్ద ఆస్తులేమీ విడిచిపెట్టలేదని. విడిచిపెట్టిన కాస్త ఆస్తీ కూడా నాన్న చేసిన అప్పులు తీర్చడంతోనే ఇంచుమించు సరిపోయింది. ఏదో కొద్దిగా పెట్టుబడిపెట్టి వ్యాపారంచేస్తే ఆ వ్యాపారం మొదట్లో బాగానే నడిచినట్టున్నా యీ ఏడాదంతా నష్టంమీదే నడుస్తోంది. నిన్ను ఇదివరకే చదువు మానిపించివేయవలసింది. కాని ఇంతవరకూ వచ్చిన తరువాత పరీక్ష పూర్తికాకుండా మానిపించటమెందుకని ఎలాగో కొంచెం అప్పుచేసి, తంటాలుపడి నిన్ను చదివించాను. ఈ విషయాలన్నీ నీకు చెబితే నీ అనవసరంగా బాధపడతావేమోనని ఇంతవరకూ చెప్పలేదు. ఇక చదివించడం నావల్ల కాదమ్మా. వ్యాపారమే కట్టివేసే పరిస్థితి వచ్చింది." అంటూ పెద్దగా నిట్టూర్చాడు.

కమల కాళ్ళలో సత్తువ పూర్తిగా అంతరించిపోయింది. మంచంకోడు మరింత గట్టిగా పట్టుకుంది.

"నే నెంత మొత్తుకున్నా విన్నారా? అప్పుచేసి కూడా చదివించేవారెవరేనా ఉన్నారా ఎక్కడేనా? ఒకమూల వ్యాపారం పడుకొని అంతా విధినపడే గతి వస్తున్నా కూడా. సంసారం చేసేవాళ్లకు పెద్ద చదువు లేమిటి? ఏదో కాస్త ఉత్తరం ముక్క చదవగలిగి, రాయగలిగిఉంటే అం చాలు, కాని. అంత ముక్కువగా ఉంటే స్కూలుఫైనలువరకు చదివించి ఆపమంటే నామాట విన్నారా? ఇప్పుడు ఈ వ్యాపారంపోతే మనమూ మన పిల్లలూ ఏం కావాలి? నా పిల్లల కేలోటూ రాదనుకొని గర్వపడేదాన్ని. నన్ను పరీక్షించడానికే చేస్తున్నట్టున్నాడు భగవంతుడు" అంటూ సూర్యకాంతం బుచ్చిని చేరదీసి కొంగుపెట్టి వచ్చీరాని కన్నీళ్లు తుడుచుకో సాగింది.

గోపాలం అలాగే దిగులుపడి కూర్చున్నాడు. కొంతసేపుండి వినిపించీ వినిపించకుండా "మరి ముందు?—" అంది ఎందుకలా అడిగినట్లో తనే ఆశ్చర్యపోతూ.

"ఏముందమ్మా. ఇక నీ పెళ్ళిమాటేదో చూసివేయాలనుకుంటున్నాను" – అని గోపాలం అంటూండగానే

"పెళ్ళా?" అని ఉలిక్కిపడింది కమల.

"ఏం, పెళ్ళిచేసుకోవేమిటమ్మా? పెళ్ళి చేసుకోవడం, పిల్లల్ని కనడం కూడా ఘానను కాదేమో. అలాంటివన్నీ నాలాటి మోటువాళ్లకే నేమో" అంది సూర్యకాంతం బుగ్గమీద వేలు వేసుకొని కమలకేసి వింతగా చూస్తూ.

కమల ఏమీ మాట్లాడలేదు. సూర్యకాంతమే కొంతసేపూరుకొని మళ్ళీ సాగించింది ప్రసంగం: "నీ కిప్పుడేమంత చిన్న వయస్సుకాదు. ఈ పాటికి నీ వయస్సువాళ్ళు పిల్లల నెత్తుకొని ఉంచురు. ఇంకా వయస్సు ముదిరినకొద్దీ పెళ్ళి కుదురుతుందేమిటి? నేను పిల్ల అప్సరసరా, తెలివితేటలలో అఖండురాలురా అని చెప్తే ఒప్పుకున్నాడుకాని లేకపోతే ఒప్పుకుంటాడా? ఐదు వేలు, ఆరువేలు కట్నాలిస్తాము మా పిల్లను చేసుకోమంటే, మా పిల్లను చేసుకోమని ఎంతోమంది సంబంధాలవారు వాడిని కడుపూ కాలూ పట్టుకొని బ్రతిమాలుతున్నారు. ఈ సంబంధాలవాళ్లకు జవాబు చెప్పి పంపడంతోటే అయిపోతోంపటి రోజంతా మా రాజారావుకి" అంటూ సూర్యకాంతం ముఖం చేటంత చేసుకొని ఆడబిడ్డకు నచ్చజెప్పడానికి ప్రయత్నం చేస్తోంది.

"ఎవరూ రాజారావునా! – రాజారావునా!" అంది కమల గుండె పట్టుకొంటూ.

"ఏం అతనికేం" అన్నాడు గోపాలం అప్పుడే కొద్ది చిరాకుతో "అతనికేం లోటు!"

భర్తను ప్రోత్సహించేందుకు సూర్యకాంతం మళ్ళీ మొదలు పెట్టింది: "అతనికేం నిజంగా రాజాయే రెండో పెళ్లివాడైనా ముప్ఫై అయిదేళ్లు దాటి వుండవు. ముప్ఫై యేనని నాకు జ్ఞాపకం. మనిషి బాగా ఉంటాడు. పెద్ద చదువు లేకపోతే మాత్రమేం. వాడికి వచ్చే ఆదాయం ఎంత ఉద్యోగం చేసినా ఎవరు సంపాదించగలరు? అమలాపురంలో మనలాంటి కుటుంబాలు పాతిక నిరభ్యంతరంగా కాపురం చేయడానికి తగినంత పెద్ద ఇల్లుంది. ఎలా తగలేసినా తరగని ఆస్తి. మా పెద్ద తండ్రి కొడుకు కాబట్టి నీ సంబంధానికి ఇష్టం చూపుతున్నాడు కాని"—

★ అబల ★

"వదినన్నయ్యా, నాకీ పెళ్ళి వద్దన్నయ్యా" అంది కమల ఆరాటంతో.

గోపాలానికి అప్పుడే కోపం పెరిగిపోతోంది. మౌనంగా నేలకేసి చూస్తూనే ఉన్నాడు. సూర్యకాంతమే భర్త పక్షాన మాట్లాడతోంది: "ఎవళ్ళో గిట్టని వెధవలు వేయి చెప్పుకుంటారు. అవి అన్నీ నమ్మేయడమేనా? ఒకవేళ యేమైనా వున్నా అన్నీ పెళ్ళితో సర్దుకుపోతాయి. ఒంటరి మొగాడు కాబట్టి ఏదో కొంచెం మనస్సు అటూ ఇటూ పోయేపోవచ్చు. చక్కని పెళ్ళాం వస్తే అతనే రాజాలా ఉంటాడు."

"ఏమైనా నాకీసంబంధం వద్దన్నయ్యా. నాకేమీ తొందర లేదన్నయ్యా," అని మళ్ళీ చెప్పింది కమల.

గోపాలం లేచినిలబడ్డాడు. చెల్లెలికేసి తీవ్రంగా చూస్తూ "నీకు తొందర లేకపోతే మాకుండకుండా ఎలా ఉంటుంది!" అన్నాడు. "ఇంతకన్న మంచి సంబంధం ఎక్కడినుంచి వస్తుంది? నేనేమీ కట్నం ఈయలేను. ఎంత అందంవున్నా ఏమీ కట్నం లేకుండా చేసుకునే వాడెవడు? ఏ కానీకి మారనివాడో చేసుకుంటానని తయారవుతాడు - రేపు నా యింటిమీద పడి తింటూ నా ప్రాణాలతో ఉండుకు చూస్తూ చూస్తూ గతిలేనివాడి చేతిలో ఎలా పెట్టగలను నిన్ను? మనకే కాకుండా ఎవరికైనా రాజారావు సంబంధమంతటి మంచిది మరొకటి రాదు. మన అదృష్టంకొద్దీ అతను కొంచెం సుముఖంగా ఉన్నాడు మనపట్ల. అలాంటి సంబంధం చేతులారా విడిచిపెట్టగలమా? ఇది చెయిజారిపోయిందంటే మనం చేయగలిగిందేమీ లేదు. ఇంకా ఇలా నీవు పెళ్ళి చేసుకోకుండా ఉంటే నాకేమయినా మర్యాద ఉంటుందా? ఏమనుకుంటారు నలుగురూ ఉన్న ఒక్క చెల్లెలికి పెళ్ళి చేయకపోతే."

"ఇప్పటికే ఇరుగు పొరుగులంతా ఒకటే ఇదిగా అడుగుతున్నారు మీ ఆడబిడ్డ పెళ్లి ప్రయత్నం లేదేమమ్మా అని. ఇంకా ఊరుకుంటే ఏమన్నా ఉందా," అంది సూర్యకాంతం భర్తను బాగా రెచ్చగొట్టడానికి.

కమల ఇంకా ప్రయత్నం చేయకుండా ఉండలేక పోయింది. "బి. ఎ. చదువులాగో అలా పూర్తిచేయనీయి, అన్నయ్యా. ఇప్పుడు కొంచెం కష్టపడినా బి. ఎ. పాసయ్యానంటే—"

అంటూండగానే సూర్యకాంతం అందుకుంది "ఉద్యోగంచేసి అప్పులు తీరుస్తావు కదూ! అఖరికి చూశారా మీ చెల్లెలికెలాంటి బుద్ధులు పుట్టుతున్నాయో! నేనెంతచెప్పినా విన్నారా సంసారాలు చేయవలసిన వారికి చదువులు పనికిరావని."

గోపాలం "ఇంక చదివించడం నావల్లకాదని చెప్పాను. రాజారావుకు ఇదివరకే ఉత్తరం రాశాను. మరో పదిహేను రోజులలో ఇక్కడికి రాగలడు." అని చెప్పి చరచరా వెళ్లిపోయాడు వీధిలోకి.

వదినగారు బుగ్గనొక్కుకుంటూ "మేమెన్నడైనా పెద్దవాళ్లమాట కెదురుచెప్పి ఎరుగుదుమా? వాళ్లు చూసి చేసిన సంబంధం మంచిఅవనీ చెడ్డఅవనీ చేసుకొని బ్రతుకుతున్నాం. ఈనాడంతా కలికాలమహత్యం తల్లీ. అన్నగార్లమాట వినవక్కరలేదు. వదినగారిమాట అంతకన్న వినక్కరలేదు. తనకు రెక్కలు వచ్చేవరకూ పెద్దవాళ్లు పోషించాలి. ఆపైన తాను పెద్దవాళ్ళ మొగం చూడకపోయినా పెద్దవాళ్లేమీ అనుకోకూడదు. పెద్దవాళ్లెందుకూ పనికిరారన్నమాట! ఇంక అన్నా చెల్లెలేమిటి? తండ్రీ కూతుళ్ళేమిటి' అని మూతి విరుచుకొని వంటింట్లోకి వెళ్ళింది.

కమల కొంత సేపలాగే నిలుచుండిపోయింది. పిల్లలామెదగ్గరకు చేరారు. అది చూసి సూర్యకాంతం "ఇలారండర్రా" అని కేక వేసింది. వాళ్ళువతలకు వచ్చారు. సూర్యకాంతం పిల్లల బుగ్గలు నలిపివేస్తూ వెధవల్లారా బయటికి పోయి ఆడుకోండి. ఇప్పటినుంచీ ఆ తయారీలోవుంటే రేపు మిమ్మల్ని పట్టపగ్గాలుండవు" అంది గుడ్లురుముతూ. వాళ్లు హడలిపోయి వీధిలోకి పరుగెత్తారు.

కమల మెల్లగా తనగదిలోకి పోయి మంచంమీద జేరగిలబడింది. తన కాలేజీ స్నేహితురాండ్రూ, వాళ్ళతో గడిపిన రోజులూ అన్నీ జ్ఞాపకం తెచ్చుకుంది. అవి జ్ఞాపకం వస్తున్నకొలదీ ఆమె బాధ మరీ ఎక్కువకాసాగింది. కొంతసేపటికి తన్నుతాను అదుపులో పెట్టుకొని అన్నగారి పరిస్థితి అర్థంచేసుకోడానికి ప్రయత్నంచేసింది. 'అవును అన్నయ్య చాలాకష్టంలో ఉండి వుంటాడు. లేకపోతే ఇన్నాళ్లూ చదివించినవాడు ఇలా మానిపించివేయడు.' కాని ఇంతకుముందునుంచే తాను చాలా యిబ్బందులలో ఉన్నానని యెన్నడూ చెప్పలేదే. మొదట్లోనే చెప్పివుంటే యీ ఆశాభంగం వుండకపోవును. ఎప్పుడు భార్యతోనే అన్నీ మాట్లాడుతాడు. మరి తనకెలా తెలుస్తుంది. ఇప్పుడెన్నివిధాల ఆలోచించినా యెంత ధైర్యం తెచ్చుకుందా మనుకున్నా ఆశాభంగం ఆశాభంగమే! దీనికితోడు పుండుమీద కారంచల్లినట్లు పెళ్ళిప్రస్తావన! పెళ్లి అంటే ఆమెకు భయంకాదు. రాజారావుతో పెళ్లంటేనే భయం. రాజారావుమాటతలచుకుంటేనే ఆమెవొళ్లు కంపర మెత్తుతోంది. రాజారావునుగురించి యెవరెరుగరు? అతనెంతటి ధనవంతుడైనా, అతని కున్న వ్యసనాలూ, అతని సహవాసాలూ, యెవరు కాదనగలరు? అతని మొదటి భార్య పడ్డ బాధనుగురించి చుట్టాలెలా గుసగుసలాడారో ఆమెకు జ్ఞాపకంలేదూ? అటువంటిఅతనితో వివాహంచేయ తలపోస్తున్నారు అన్నా, వదినా. ఈ సమస్య మీద ఆలోచిస్తూంటే బి. ఏ. చదవలేకపోయాననే ఆశాభంగం కొంత మరచిపోసాగింది - మధ్య మధ్య మరింత తీవ్రంగా జ్ఞాపకంవస్తున్నా. పైకి చదివించకపోతే మానే (అయ్యో!) యీ సంబంధంమాట యెత్తకపోతే చాలు. కాని అన్నగారు వదినగారు అంతా ముందే ఆలోచించుకొని సన్నాహాలు చేసివేస్తున్నారు. కొద్దిరోజుల్లో రాజారావు ఇక్కడకు వచ్చివేస్తాడు. తను తప్పించుకోవడమెలా. తప్పించుకునే ఉపాయమేమీ కనిపించడంలేదు.

అప్పటినుంచి కమల స్నేహితురాండ్ర ఇళ్లకు వెళ్లడం మానివేసింది. కమల యెందుకు రాలేదో కనుక్కుందామని వాళ్లు ఒకటి రెండుమార్లు ఆమెయింటికే వచ్చారు. కమల వాళ్లకేదో కారణం చెప్పి పంపివేసింది. పుస్తకాలుకూడాముట్టలేకపోతోంది ఇంట్లో కూడా యెవరితో మాట్లాడలేక పోతోంది. వదినగారు వద్దంటున్నా అడ్డుపడి అన్ని పనులూ తనే చేస్తోంది. గదిలో కూర్చొని ఆలోచనలతో మనస్సునింపుకొని బాధపడేకన్నా యీ పనులు చేయడమే మంచిదనిపించింది. అయినా బాధ తప్పడంలేదు. మనస్సు వేధించడం మానడంలేదు. కర్మ అనుకొని ఫలంఅనుభవించడమూ, లేక? లేక? లేక నాశనం చేయగలదు. ఒకటి రెండుసార్లామెమనస్సు ఆత్మహత్యమీదకు పోయింది. తన ఆశయాలు నెరవేరకపోవడమే గాక, తన యిష్టానికి వ్యతిరేకంగా, తన సుఖానికి వ్యతిరేకంగా నిర్ణయాలు జరగబోతున్నపుడు తను బ్రతికిమాత్రం ప్రయోజనమేమిటి? ఒకరాత్రి బాగా ప్రొద్దుపోయిన తరువాత

ఏదీ చప్పుడు కాకుండా మెల్లగా దొడ్డితలుపు తీసి నూతిదగ్గరకు వెళ్ళింది. నూతిలోని గాఢాంధకారంలోకి తొంగి చూసింది. రక్తం గడ్డకట్టిపోయినట్లయింది. నూతిలో నుంచి ఏవో భూతాలు రారమ్మంటూ వికటాట్టహాసం చేస్తూ పైశాచికనృత్యం చేస్తున్నట్లనిపించింది. గడగడ వణికిపోతూ వెనక్కి తిరిగివచ్చింది. దుప్పటి కప్పుకున్నా చలి ఆగలేదు. మర్నాటినుంచి నూతిదగ్గరికి వెళ్ళడానికే భయంవేయసాగింది ఆమెకు.

కాలం గడచిపోతోంది. వారం పదిరోజులలో వస్తున్నానని రాజారావుదగ్గర నుంచి జవాబుకూడా వచ్చింది. కమలకూడా అతని ఉత్తరం చదివింది. ఆశలు వదలుకొంది. మనస్సు క్రమంగా జడప్రాయమైపోతోంది. ఇలా ఉండగా ఆమెదృష్టి పేపరులో ఒక ప్రకటనమీద పడింది. ప్రకటన పూర్తిగా చదవకుండానే పేజీతిరగవేసింది. కాని మళ్ళీ వెనక్కి తిప్పి చదివింది. బెజవాడలో నేషనల్ ట్రేడింగు కంపెనీలో డిస్పాచ్ క్లర్కు పోస్టుకోసం దరఖాస్తులు పంపించుకోవచ్చని ఉంది. కొంతసేపలాగే ప్రకటన పరికిస్తూ కూర్చుంది. మనస్సులో మళ్ళీ సంచలనం ప్రారంభించింది. తానూ ఒక దరఖాస్తు రాస్తే! తనకు ఉద్యోగమా?— అవును తన కుద్యోగం లభిస్తే ఇప్పుడు తన కెదుర్కొంటున్న విషమపరిస్థితినుంచి తప్పించుకోవచ్చు. ఉత్సాహంతో అడ్వర్టయిజ్‌మెంట్ జాగ్రత్తగా చదివింది. కాని అన్నయ్యతో చెప్పడమెలా?— చెప్పినా ఒప్పుకుంటాడా? ఒకవేళ ఒప్పుకున్నా తన కుద్యోగం తప్పక దొరుకుతుందని నమ్మకమేమిటి? — అయినా ప్రయత్నించిచూస్తే తప్పేమిటని రహస్యంగా ఎదురింటివాళ్ల కుర్రవాడిచేత కవరు కొని తెప్పించి, అప్లికేషన్ రాసి పోస్టుచేయించింది. మిగిలిన పత్రికలుకూడా చూసి మరికొన్ని అడ్వర్టయిజ్‌మెంట్లకు కూడా జవాబులిచ్చింది. ఆశతో టపాకోసం చూడసాగింది. రోజులు లెక్కపెట్టసాగింది. ఆఖరికి ఉత్తరం వచ్చింది. పోస్టుమాన్‌దగ్గర నుంచి తీసుకొని రొమ్ములో దాచుకొని గదిలోకి పరుగెత్తి తలుపువేసి ఉత్తరం పైకి తీసి కవరుచింపి లోపలిలేఖ చదివింది. జూన్ ఇరవైతొమ్మిదో తారీఖున మధ్యాహ్నం మూడున్నరకు 'ఇంటర్వ్యూ'కు రమ్మని ఉంది. కమల ఆ ఉత్తరం గుండెల కొత్తుకుంది. ఎగిరి గంతులు వేయాలనిపించింది. ఉత్తరం పదేపదే చదువుకుంది—మరి అన్నయ్యతో చెప్పడమెలా? - వెంటనే గుండె చల్లబడింది. ఉత్సాహం ఇగిరిపోయింది. కాని ఏమైనాసరే రాజారావు సంబంధానికి ఒప్పుకోకూడ దనుకుంది. అన్నగారితో ఉద్యోగం విషయం చెప్పి తీరాలనుకుంది. లేచి వెళ్ళి చూసింది అన్నగారున్నాడేమో నని. అతను లేడు. మర్నాడు ప్రొద్దున్న చెప్పుదామనుకుంది. మర్నాడు ప్రొద్దున్న సమయం వచ్చేసరికి మధ్యాహ్నం అన్నయ్య ఖులాసాగా ఉంటాడు, అప్పుడు చెపితే బాగుంటుందనుకుంది. మధ్యాహ్నం రాత్రి భోజనం చేసినతర్వాత చెపుదామనుకుంది. ఇలా ప్రొద్దున్న వేళ మధ్యాహ్నమనీ, మధ్యాహ్నంవేళ రాత్రి అనీ కాలక్షేపం చేస్తోంది. రాజారావు వచ్చేరోజు దగ్గరపడు

★ అబల ★

కోంది. తా నూరుకుంటే తన అవకాశం చేయిజారిపోయినట్లే! కాని అన్నగారితో చెప్పడానికిమాత్రం ధైర్యం చాలడంలేదు. ఆఖరికి వదినగారు ఒంటరిగా కూర్చున్న సమయంలో వెనకగా వెళ్లి కూర్చుని "వదినా" అంది మెల్లగా. సూర్యకాంతం "ఏవమ్మా?" అంది ఎంతో సౌమ్యంగా. సూర్యకాంతం ఈమధ్య చాలా జాగ్రత్తగా ఉంటోంది. కమలను ఒక్కసారీ కసరడంలేదు. ఏ పనీ చేయమనడంలేదు– రాజారావు వస్తున్నాడు కాబట్టి! కమల ఒక నిమిషమాగి మెల్లగా అంది "ఒక కంపెనీలో ఉద్యోగం ఖాళీ అయిందట. దానికి రమ్మని ఉత్తరం వచ్చింది వదినా." సూర్యకాంతం ఉలిక్కిపడి నోరు తెరచుకొని, పెద్ద కళ్లతో ఆమెకేసి చూసింది అర్థంకానట్లు. కమల మళ్లీ చెప్పింది. దానితో సూర్యకాంతం చటుక్కున లేచి దొడ్లోకి వెళ్లి దొడ్డిగోడలమీదనుంచి ఇరుగు పొరుగు అమ్మలక్కలను కేక వేసింది. కమల తెల్లబోతూ అక్కడే కూర్చొనిఉంది. ఇరుగు పొరుగులంతా వచ్చిపడ్డారు "ఏమిటమ్మా ఏమిటం'టూ ఆర్భాటంచేస్తూ. వారి ఆర్భాటానికి మించిన విధంగా సూర్యకాంతం పెద్ద గొంతుకచేసుకొని "ఏముందమ్మా, మా మర్యాద మంటగలిసిపోతోంది. మా ఆడబిడ్డ ఉద్యోగం చేస్తుందట. పెళ్ళి చేసుకోదట. ఇక రెండు రోజుల్లో మా రాజారావు వస్తున్నాడు. మీరే చెప్పండమ్మా ఇంక నేనే గంగలో దూకాలో చెప్పండమ్మా" అని అడిగింది. దానితో వారు ఏదో మహాదుర్వార్తవిన్నట్లే, బుగ్గలు పొడిచి వేసుకుంటూ, కళ్లు పెద్దవిచేసి "అయ్యో అయ్యో, యేంకాలం వచ్చి పడిందమ్మా! శుభ్రంగా పెళ్ళిచేసే అన్నగారూ వదినగారూ వుండగా రాజాలాంటి సంబంధం వస్తుంటే చేసుకోక ఏమిటమ్మా ఈ బుద్ధులు? ఏ కురూపో, మొగుడుచచ్చిందో వుద్యోగం చేసినా తగుతుందికాని బాధ్యత వహించే అన్నగారుండగా ఉద్యోగం చేస్తానని బయలుదేరుతావటమ్మా!" అంటూ నలుగురూ

కాపుల్లా పడ్డారు కమలమీద. కమల వాళ్ళ మాటలు విన్నతరువాతకూడా అక్కడనుంచి కదలలేకపోయింది. అన్ని మాటలూ మౌనంగా తలవంచుకొని సహిస్తూ రాయిలా అలాగే కూర్చుండిపోయింది. ఇరుగుపొరుగు లమ్మలక్కలూ, వదినగారు కొంతసేపు వాగివాగి వెళ్ళిపోయిన తరువాత లేచివెళ్ళి తలపట్టుకొని మంచంమీద కూలబడింది.

మధ్యాహ్నం బుచ్చివచ్చి "అత్తా, నాన్న లమ్మంటున్నా" డంది. కమలగుండె అదిరిపడింది. వదిన చెప్పివేసివుంటుంది. అందుకే పిలిచివుంటాడు. వెళదామా వద్దా అని కొంతసేపు తటపటాయించి చివరికి లేచివెళ్ళింది. గోపాలం తలెత్తి "ఉద్యోగానికి వెళుతున్నావా?" అని అడిగాడు. కమల కొక నిమిషం ఏంజవాబు చెప్పాలో తోచలేదు బహుశా అన్నయ్య అంగీకరిస్తాడేమోనన్న ప్రత్యాశతో అంది: "అప్పుడే ఉద్యోగం వస్తుందో రాదో తెలియదన్నయ్యా రేపు మధ్యాహ్నం బెజవాడకి ఇంటర్వ్యూకోసం రమ్మన్నారు." గోపాలం కొన్ని నిమిషాలు మాట్లాడకుండావుండి మళ్లీ ఇంకో ప్రశ్న వేశాడు: "రాజారావును పెళ్ళిచేసుకోవా?" కమలకు మరికాస్త ధైర్యంవచ్చింది. "చేసుకోను" అంది గోపాలం ఇంక యేమీ మాటలాడలేదు కమల అన్నగారింకా యేవో ప్రశ్నలు వేస్తాడని అక్కడే నిలబడింది. కాని గోపాలం కొంతసేపటికి లేచి వీధిలోకి వెళ్ళిపోయాడు.

ఆ వేళ మళ్ళీ కనిపించలేదు అతను కమలకి. కమలకి ఆదుర్దా బయలుదేరింది. వెళ్లేమరునాడు పొద్దున్న బండే ఆఖరుబండి. వెళ్ళడానికి కావలసిన డబ్బేది? అన్నయ్య ఏమీ మాట్లాడకపోతే ఎలా? మర్నాడు తెల్లవారుజామునే లేచింది వెళ్తే యీ వేళే! ఈ అవకాశం దాటిపోతే ఇక తనకు రాజారావుతో పెళ్ళి ఖాయమే. ఏమైనాసరే వెళ్ళిపోవాలి తనదగ్గర వున్న డబ్బు కాస్తా వాడేసైనా వెళ్ళిపోవాలి! తీరా ఉద్యోగం దొరుకుతుందని నమ్మకమేమిటి? వెళ్ళేది ఇంటర్వ్యూకేగా! అయినాసరే వెళ్ళి చూడవలసిందే ననుకుంది. వేగంగా స్నానం చేసి, పెట్టె సర్దుకుంది. బెడ్డింగుకూడా చుట్టి 'రడీ' చేసింది. గోపాలం ప్రొద్దున్నే లేచిఎక్కడికో వెళ్లాడు. కమల అన్నయ్య ఇక తనకు కనపడడనుకుంది. కాని గోపాలం మరికొంత సేపటికే వచ్చాడు. సూర్యకాంతమే వచ్చింది కమలగదికి. "ఇదుగోనమ్మా యీ ఏభైరూపాయలూ ఇమ్మన్నారు మీ అన్నయ్యగారు" అని ఏభైరూపాయలు కమల ముందు పెట్టి వెళ్లిపోయింది. కమల రూపాయలు చూసుకుంది. అన్నయ్యను తను అపార్థం చేసుకున్నాననుకుంది. అన్నయ్య నిజంగా తనఇష్టం ప్రకారమే చేస్తాడు. అందుకే యీ డబ్బిచ్చాడనుకుంది. అన్నగారితో మాట్లాడుదామని లోపలికి వెళ్లింది. కమల మాట్లాడకుండానే గోపాలం మాట్లాడాడు. "ఇక నీకన్నగారు లేడనుకో. మళ్ళీ నీమొగం నాకు చూపించకు" అని కండువా భుజంమీద వేసుకొని వీధిలోకి వెళ్ళిపోయాడు.

కమల స్తంభించిపోయింది. ఇక మళ్ళీ తిరిగిరావద్దనే అన్నయ్య అభిప్రాయం. ఈ ఏభై రూపాయలు ఎంతకాలం వస్తాయి? ఉద్యోగం దొరుకుతుందని నిశ్చయమెక్కడ? దొరకకపోయినా రావద్దనే. 'నీ కన్నగారు లేడనుకో' ఆమాట తలుచుకునే సరికి కమలకు కన్నీరు ఆగలేదు. కొంగు అడ్డు పెట్టుకొని వెక్కి వెక్కి యేడ్చింది. తనంటే అన్నయ్యకింత బాధగావుంది. తను దూరంగా పోయి అన్నగారికి బాధ తగ్గించాలి. మెల్లగా కన్నీరు తుడుచుకొని తన గదిలోకి వెళ్ళి పెట్టె, బెడ్డింగూ తుదిసారి సరిచేసుకుంటోంది అన్నగారి పిల్లలు నలుగురూ ఆమె పెట్టె సర్దుకుంటూండడం చూసి ఆమె చుట్టూ చేరారు. "ఎక్కడికత్తయ్యా" అని అడిగారు. "ఊరు వెళ్తున్నాను మీకు బొమ్మలూ అవీ తెచ్చిపెట్తాను" అని కమల వాళ్లను చేరదీసి ముద్దుపెట్టుకొని తలకొక అర్థరూపాయీ చేతిలో పెట్టింది. వాళ్లు "నాకు రైలుబండి తెచ్చిపెట్టత్తా", "నాకు పరికిణీ చొక్కా తొడుగుకున్న రబ్బరుబొమ్మ తెచ్చిపెట్టత్తా" అంటూ ఆమెకు సర్దుకోవడంలో సాయపడుతున్నారు ఇంతలో సూర్యకాంతం కుమ్మంలోనుంచి వెళ్తూ పిల్లలు ఆడబిడ్డ చుట్టూ గుమిగూడడం చూసి "ఇటు రండిరా" అని కేక వేసింది. వాళ్లు భయంతో తల్లిదగ్గరకు వెళ్ళారు. మరి కొన్ని నిమిషాలలో వాళ్లందరూ లోపలికి వచ్చి తమకిచ్చిన డబ్బులు కమల పెట్టెమీద పెట్టి పరుగెత్తుకు పోయారు. చిన్నపిల్ల బుచ్చిమాత్రం చెంప రుద్దుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ "అమ్మ ఇచ్చేమందత్తా" అని అర్థరూపాయి కమల చేతిలో పెట్టింది. బుచ్చి ఏడుపు చూసి కమల గుండె కరగిపోయింది. ఎత్తుకొని ముద్దాడి ఓదార్దామనుకుంది. కాని మళ్లీ బుచ్చిని ఎత్తుకుంటే వదినగారు పిల్ల నేం

చేస్తుందో నన్న భయంతో ఏమీ చేయలేక ఊరుకుంది. బుచ్చి కళ్లు తుడుచుకుంటూ మెల్లగా వెళ్లిపోయింది. కమల తనే పోయి వీధి మొగలో ఉన్న ఒక జట్కా కేక వేసింది. లోపలకు పోయి వదినగారితో "వెళ్ళొస్తాను వదినా, అన్నయ్యతో చెప్పు" అంది. కాని సూర్యకాంతం తన పనిలో మునిగి ఏమీ మాట్లాడలేదు. కమల "వదినా, వదినా వెళ్లి వస్తాను వదినా" అని రెండు మూడుసార్లు అంది. కాని సూర్యకాంతం ఆమె వైపున చూడకుండానే చివరికి విసుగ్గా "ఊఁ" అని మాత్రం మూల్గింది. కమల అలాగే పోయి బండిలోకి ఎక్కి కూర్చుంది. పిల్లలెవరూ ఆమెకేసి చూడలేదు. బుచ్చి మాత్రం భయంతో వెనక్కి తిరిగి ఆమెకేసి తొంగి తొంగి చూస్తోంది. ఇరుగు పొరుగు లెవరూ కూడా ఆమెను పలకరించలేదు. ఎదురింటి వాళ్ల కుర్రవాడు కూడా ఇంటిదగ్గర లేనట్లున్నాడు. కమలకు ఒక్కసారిగా తానొక్కర్తీ అయిపోయినట్లు తెలిసింది. బండివాడు కొరడా విదిలించాడు. గుర్రం పరుగెత్త సాగింది.

రెండో అధ్యాయం

గుర్రం హుషారుగా పరుగెత్తుతోంది. కాని బండిలోవున్న కమల హృదయం విచారంతో వెనుకకు లాగుతోంది. ఇంతకాలం పెంచిన అన్నయ్య మళ్ళీ తనను కనిపించవద్దన్నాడు. అన్నయ్య పిల్లలను చూడడానికి వీలుండదు. ఈ ఊరి మేడలూ, చెట్లూ, వీధులూ, బజారులూ, గోదావరి వీటన్నిటికీ తాను దూరమై పోతోంది. వీటిని మళ్ళీ ఎప్పుడు చూడగలనో అని దీక్షగా వాటికేసి చూస్తోంది. ఇంతలో దూరంనుంచి అరుస్తున్న కారును చూసి ఉలిక్కిపడింది కమల. ఎవరిది కారు? కారు దగ్గరకు వస్తోంది. జానకీవాళ్ల కారే! అనుమానం లేదు. అయ్యో, జానకికి కనిపించకుండా ఉండటం యెలా? బండిని ప్రక్క సందులోకి పట్టించమందామన్నా వ్యవధి లేదు. జానకి కారు బాగా దగ్గరకు వచ్చివేస్తోంది. కమల మొగం వెనుకకు కనిపించకుండా బండి కొరుగ్గా తిరిగి కూర్చుంది. జానకి తనను చూడకుండా వెళ్లిపోతే చాలు. కారు దగ్గరకు వచ్చింది బాగా దగ్గరకు వచ్చింది. బండి ప్రక్క నుంచి తప్పుకోడానికి వీలు లేక బండి వెనకాలే మెల్లగా వస్తోంది. కమలగుండె దడ దడ కొట్టుకుంటోంది. అయినా అలాగే మొగం తిప్పకుండా కూర్చుంది. మరి కొంత సేపటికి కారు బండి ప్రక్కనుంచి ముందుకు వెళ్లిపోయింది. ప్రమాదం తప్పిపోయింది! బండి స్టేషనుదగ్గర ఆగింది. కమల బండిలో నుంచి దిగింది. ఎదరే జానకీవాళ్ల కారుంది. జానకీవాళ్లు మాత్రం కారులో లేరు. స్టేషను లోపలికి వెళ్లినట్లున్నారు. కమల మళ్ళీ సందిగ్ధావస్థలో పడింది. జానకి వాళ్లను తప్పించుకొని రైలెక్కడం యెలా? ఇంతలో జానకీవాళ్ల కారు డ్రైవరు ఇవతలకు వచ్చి కారు నడుపుకు పోయాడు.

కమల టికెట్టు తీసుకొని ప్లాట్ ఫారమ్ మీదకు పోకుండా కూలీ చేత సామానులు బయట హాలులోనే ఒక ప్రక్క పెట్టించుకొని నిలబడి చూస్తూవుంది. ఇప్పుడే ప్లాట్ ఫారంమీదకు పోతే జానకి కలుసుకోవచ్చు. ఆ సంశయంతో అక్కడే వుంది. ప్లాట్ ఫారం మీద తిరుగుతున్న జనాన్ని పరిశీలిస్తూ నిలుచుంది. స్టేషనులో గంట మ్రోగింది. జనం అంతా లేచి నిలబడ్డారు. ప్లాట్ ఫారం ముందు వైపున నడిచారు. గేటుదగ్గర కూడా రద్దీగా ఉంది. కమలకు కంగారుగా వుంది. ఇంకా తాను తన సామానులతో ప్లాట్ ఫారంమీదకు పోవలసివుంది. కాని ముందుగా మాట్లాడుకున్న కూలీ ఎక్కడా కనబడటంలేదు. సమయానికి వస్తాడో లేదో. బండి వచ్చివేసింది. ఎక్కే జనం, దిగే జనం ఎవరెవరో కనిపించటంలేదు. కూలీలు సామానులు కంగారుగా మోసుకుపోతున్నారు. తన కూలీ మాత్రం కనిపించటంలేదు. గేటులో చాలా రద్దీగా వుంది. తీరా బండి వెళ్లిపోతుందేమో. కమల తన సామాన్లు తనే రెండు చేతులతో పట్టుకు పోదామని ఎత్తింది. కాని అవి చాలా బరువున్నాయి. ఇంతలో కూలీ వచ్చాడు. సామాను ఎత్తుకున్నాడు. ఆలస్యం చేసినా వాడితో అప్పుడు వాదిస్తే లాభం లేదని మాట్లాడకుండా వాడి వెనకాలే నడిచింది కమల. ప్లాట్ ఫారం మీదకు వెళ్లే సమయానికి మళ్లీ గంట మ్రోగింది. రైలు కూత వేసింది. రైలు కదిలిపోతుంది! "ముందు మీ రెక్కండమ్మా. నేను సామాను ఎలాగో లోపల పడేస్తా"నన్నాడు కూలి. కమల నిశ్చేష్టగా ఎదురు పరుగెత్తింది. రైలు కదులుతోంది. ఆడవాళ్ల పెట్టెలో ఎక్కాలనుకుంది కాని బండి కదలటం ప్రారంభించింది. కంగారుగా ఎదురుగా ఉన్న పెట్టెలో ఎక్కివేసింది. కూలీవాడు పెట్టె, బెడ్డింగూ బండిలోకి త్రోసివేశాడు. బండి కదలింది. ఇంకా కొందరు జనం అదే పెట్టెలో ఎక్కేశారు. కొందరు ఫుట్ బోర్డుమీద కూడా నిలబడి ఉన్నారు. కూలీవాడు 'కూలి అమ్మా' అని కేక వేశాడు. కమల పర్సు తీసింది. జనం క్రిక్కిరిసి ఉన్నారు. స్వేచ్ఛగా కదలడానికి వీలు లేకపోతోంది. కమలకు పర్సులో కావలసిన చిల్లర దొరకటంలేదు. చేతికి రూపాయి వచ్చింది. బండి వెళ్లిపోతోంది. కూలివాడు 'కూలి అమ్మా, కూలి అమ్మా' అంటూ బండితో బాటు పరుగెత్తుతున్నాడు. కమల కేమీ తోచక రూపాయే క్రిందకు గిరవాటు వేసింది.

రైలు బ్రిడ్జిమీద పోతోంది. కాని కమల కా సంగతి తెలియనే తెలియటంలేదు. పెట్టె తలుపుదగ్గరనే చాలామంది జనం క్రిక్కిరిసి ఉన్నారు. కమల తన పెట్టె, బెడ్డింగూ వాళ్ల కాళ్ళసందున ఉండటం చూసింది. ఎవళ్ళో బెడ్డింగు త్రొక్కివేస్తున్నారు. బెడ్డింగు లాక్కుందామంటే ముందుకు వంగడానికే వీలు లేకపోయింది. కమల కూర్చోడానికి చోటు లేదు. ప్రక్కనే నిలబడ్డా డొక తాత. ఎన్నాళ్లనుంచి ఆకలితో కుళ్లుతున్నాడో ఏమో కంపు భరించరాకుండా ఉంది. ఆ సందడిలోనే కమలకేసి పిచ్చిగా చూస్తూ చిరతలు వాయిస్తూ, 'హరిగోవింద గోవిందా' అంటూ బిగ్గరగా పాడటం మొదలు పెట్టాడు. తలుపుదగ్గర ఏదో అలజడి జరుగుతోంది. ఫుట్ బోర్డుమీద ఉన్నవాడూ, గుమ్మంలో ఉన్నవాడూ పోట్లాడుతున్నారు. ఒకరినొకరు త్రోసుకుంటున్నారు. 'నేనూ టికెట్టు కొన్నాను' అంటున్నాడు ఫుట్ బోర్డుమీద మనిషి. ఈ పోట్లాటలో తను పడిపోతానేమోనని కమలకు భయం వేసింది. ఈ కంపులోనుంచి బయటపడదామంటే పడనీయటంలేదు. లోపలమాత్రం జనం తీరికగానే కూర్చున్నారు. ఒక ప్రక్క ఇద్దరు పరుపులు పరచుకొని పెట్టెలో చాలచోటు ఆక్రమించుకొని తీరికగా ఒకరితో ఒకరు ఏదో ముచ్చటించుకుంటూ నవ్వుకుంటున్నారు. వాళ్లకెదురుగా ఇద్దరు వకీళ్లు హైకోర్టు జడ్జీ లెవరెవరు కానున్నారని చర్చించుకుంటున్నారు. ఇంకా ఇవతల ఇద్దరు పెద్దమనుష్యులు సంబంధాల గురించి మాట్లాడుకుంటున్నారు. ఒక ముసలమ్మ కూర్చునే కునికిపాట్లు పడుతోంది. తల బాగా ముందుకు వంగి వంగి పడిపోయేటంతగా పడుతున్న తల వెనక్కి తీసుకొని మళ్ళీ ముందుకు వాలుతోంది. ఆమె ప్రక్కనే కూర్చున్న చిన్నమనుమడు 'బామ్మ కునికిపాట్లు' అని పకపకా నవ్వుతున్నాడు. ఒక ముసలాయన అధ్యాత్మ రామాయణ కీర్తనలు కూనిరాగాలుగా తీస్తున్నాడు. ఆయన ప్రక్కనాయన పుస్తకాలమ్మే మనిషి దగ్గర పుస్తకాలు 'కొనకపోతే కొనకపో

యాం కాసేపు చూడడానికేం' అని చూస్తున్నాడు. ఒకడు కాళ్ళు చాపుకొని గుర్రు పట్టుతున్నాడు. ఒక పొడుగుపాటిమనిషి ఒక చిన్న పెట్టె బెంచిమీద పెట్టి, పెట్టె తెరచి, ఒక సీసాతీసి అజీర్తిమాత్రలుఅంటూ పల్లెవేసిన మహోపన్యాసం దంచివేస్తున్నాడు. పల్లెటూరి వాడొకడు ఆ సీసావెల అడుగుతున్నాడు. ఒకరిద్దరు కిటికీలోనుంచి తలలు బయటకుపెట్టి ఏవేవో ఆలోచనలలో మునిగిపోయి ఉన్నారు. ఇవతల బెంచిచివర ఏదో పెద్దకుటుంబమే ఉంది. భర్త నల్లగా లావుగా ఉన్నాడు. బెంచీమీద బుద్ధవిగ్రహంలా కూర్చొని ఉన్నాడు. ప్రక్కన భార్యారత్నం, అద్దుకోలతలో భర్తను మించినది, కూర్చుంది. పిల్లలెంతమందో కాని భార్యాభర్తలమధ్యా, ప్రక్కనా, కాళ్లదగ్గరావాళ్ళే. కమలకు ఎక్కడా చోటు కనబడడంలేదు. తీరికగా పడుకున్నవాడి మీద ఆమెకు కోపం పొంగివచ్చింది. రైలు తన ముత్తాతకట్టించిన ఇల్లన్నట్లు పడుకొని ఉన్నాడు. ఇంతలో గుంపులోనుంచి ఒకడువెళ్లి పడుకున్నవాడిని లేవగొట్టబోయాడు. "పగలేమిటయ్యా నిద్రే, లేలే" అంటూ. పడుకున్నవాడు ఉలకలేదు పలకలేదు. ప్రక్కకు కదలలేదు. లేపబోయిన మనిషిగట్టిగాపట్టుకు గుంజాడుపడుకున్నవాడిని. దానితో వాడు ఒక్కసారిగా లేపినవాడిమీద కెగిరిపడ్డాడు. ఇద్దరూ మాటలు పెరగనిస్తున్నారు. ఈ సందడిలో మరో యిద్దరు గప్‌చుప్‌గా పడుకున్నవాడు లేచిన ఖాళీలోకి సర్దుకున్నారు. దానితో లేపినవాడూ లేచినవాడూ మాటాడక ఊరుకొని సర్దుకున్నారు. తలుపుదగ్గర గొడవకూడా ఆగిపోయింది. కమలదగ్గర గుంపు కాస్త పలుచబడింది. కాస్త గాలివేస్తోంది. కాని ఇంకా పెట్టెలోపలివైపుకు పోవడానికి వీలులేకపోతోంది. కమల వెనకాలవున్న బిచ్చగాడు "కాస్త తొలగండమ్మా" అంటూ ఆమెను ప్రక్కకుత్రోసి ముందుకు సాగాడు.

ఐదు నిమిషాలలో కొవ్వూరు వచ్చింది. జనం కొంతమంది దిగారు. కమల గుంపునుంచి బయటపడింది. తన పెట్టె బెడ్డింగూ లోపలికి లాగుకుంది. మళ్లీ కొంతమందిజనం ఎక్కారు. బండి కదిలింది. అంతవరకూ కనిపించని కమల బయటకు రాగానే పెట్టెలో వాళ్లందరి దృష్టీ ఆమెమీద పడింది. పడుచు దంపతులుకూడా ఆమెకేసే చూస్తున్నారు పడుచు పెళ్లాము పడుచు మొగుడి మొగంకేసీ, కమలకేసీ చూస్తోంది. ఎవరూ పోనీ అని స్థలంలో సర్దుకోమనడం లేదు కమలను. అలాగే నిలబడివుంది కమల. ఆమె అలా నిలబడి ఉండడం చూసి పెద్ద కుటుంబ యజమాని, బుద్ధవిగ్రహం మనిషి, బట్టతల గోక్కుంటూ భార్యతో ఏమో అన్నాడు. ఆవిడ ఒక్కసారి ఖయ్యిమంది. "బాగానే ఉంది. ఇక్కడ చోటెక్కడ ఉంది. పిల్లలకే చోటులేందే" అంది గట్టిగానే. ఆవిడకు భయమేమిటి? కమల తానున్నచోట నిలబడేకన్న పెట్టెచివర నిలబడితే జనం తోపిడి ఉండదని చివరకు జరిగి పెద్ద కుటుంబం ప్రక్కన నిలబడింది. ఆ లావుపాటి గృహిణి కమల స్థలంకోసం వచ్చి ఉంటుందనే దృష్టితో చురచురా చూడసాగింది కమలకేసి. ఆమె చేతిలో చంటిపిల్లవాడు పెద్దగా ఏడుస్తున్నాడు. ఆమె వాడిని సముదాయించలేక విసుగుకుంటోంది. పడుచు దంపతులలో పడుచు మొగుడు కమలకేసి చూస్తున్నాడు. పడుచుపెండ్లాం "ఈ నారింజకాయలకు పావలా ఇవ్వండి" అంది. కాని పడుచు మొగుడు వినిపించుకోలేదు. అంతవరకూ తేనె లొలుకుతున్నట్లుగా మాట్లాడుతున్నదల్లా పచ్చిమిరపకాయ కారం కలిపినట్లు "ఏం, డబ్బులివ్వరేం. ఏముందని అటు చూస్తారు" అంది పడుచు పెళ్లాము. పడుచు మొగుడు ఉలిక్కిపడి పర్సుబదులు కలంతీసి ఏమిటన్నాడు. "డబ్బు" అంది పడుచు పెళ్లాము. పర్సుతీసి అర్ధరూపాయ భార్యచేతిలో పెట్టాడు అతను. మళ్లీ ఆపడుచు దంపతులు నవ్వుతూ మాట్లాడుకోలేదు.

లావుపాటి గృహిణిచేతిలో పిల్లాడు ఏడుపుతో కందగడ్డలా అయిపోతున్నాడు. తల్లి విసుగుతో వాడిని ఓదార్చలేక అంత చంటిపిల్లవాడినీ రెండు వాయించింది. దాంతో వాడు మరింత కక్కటిల్లిపోతున్నాడు. కమల ఊరుకోలేకపోయింది. "అయ్యో పాపం, చంటిపిల్లవాడిని కొడ్తారెందుకండీ" అంది. ఆవిడ కమలకేసి కోపంగా చూస్తూ "ఏం చెప్పనమ్మా, ఈ గంగాళం పొట్టవెధవ కస్తమానూ పాలు కావాలి. నాదగ్గర పాలులేవు. పాలున్న మరచెంబు కాస్తా మా నాలుగోది రాజమండ్రి సేషనులో క్రింద పడవేసింది. దానితో పాలు అన్నీ నేలపాలై పోయాయి. పోనీ మళ్లీ తెండి పాలంటే ఈఘటం కదిలితేగా (అంటూ తనభర్తకేసి చూసింది.) బండి కదిలిపోతుందేమో నేను పరుగెత్తి ఎక్కలేనంటారు. మళ్లీ నిడదవోలువరకూ పాలు దొరకవు. అంతవరకూ ఈ వెధవని పట్టుకోవడమెలా," అంది ఆవిడ మొగుడికేసి చూసి మూతివిరుచుకొని. "ఇటు తెండి పాపాయిని నే నెత్తుకుంటా"నంది కమల. ఆ తల్లి వెంటనే పిల్లాడి నిచ్చివేసింది. కమల పిల్లవాడి నెత్తుకుంది. మెత్తగా బూరుగుదిండులా ఉన్నాడు. ముద్దువస్తున్నాడు. కమల వాడిని యెత్తుకోగానే వాడు ఆమె రొమ్ముమీద తడుముకోవడం మొదలెట్టాడు. కమలకు కితకిత పెట్టినట్లయింది. నవ్వూ సిగ్గూవచ్చాయి. బొటనవ్రేలు పిల్లవాడి నోటిలో పెట్టింది. వాడు దానినే చప్పరించివేయడం మొదలుపెట్టాడు. కమల పిల్లవాడిని ముద్దుపెట్టుకోకుండా ఉండలేకపోయింది. పిల్లవాడు వేలుచప్పరిస్తూ ఏడుపు మానివేసి ఆమెకేసి పాలగుడ్లతో చూస్తూ అర్థంలేని నవ్వు నవ్వుతున్నాడు. కమల మరింత ముద్దాడింది. వాడు ఊఁ ఆ అంటూ పళ్లులేని చిగుళ్లు బయటపరుస్తూ పలుకుతున్నాడు. కొంతసేపటికి అలాగే నిద్రపోయాడు. కమల వాడిని భుజంమీద వేసుకుంది. తల్లి మళ్ళీ పిల్లవాడిని తీసుకునే ప్రయత్నంలోనే లేనట్లుంది. భర్తవైపుకు తిరిగి ఏదో సాధిస్తోంది. కాని భర్త వింతగా చూస్తూ 'అవునే, అవునే నేనేమన్నాను' అంటున్నాడు పెదవులమీద చిరునవ్వుతో. కమల భుజంమీద పిల్లవాడు ఆమెచీరతడపసాగాడు. కమల కంగారుగా వాడిని దూరంగా పట్టుకుంది. తల్లి తిరిగిచూసి "అన్నంతపనీ చేశాడూ, వెధవ" అంటూ పిల్లవాడిని తీసుకుంది. కమల చీర ఆరబెట్టుకుంటోంది. పిల్లవాడితల్లి కమలనడిగింది. "ఎక్కడికి వెళుతున్నావమ్మా?" అని. బెజవాడ అని చెప్పింది కమల. "మేమూ బెజవాడే. అయితే పాపం ఎంతసేపని అలా నిలబడతావులే. మా అయిదోదాన్ని ఒళ్లోకూర్చోబెట్టుకుని ఇలాకూర్చో అమ్మా" అంది ఆవిడ. కమల "పరవాలేదులెండి నేను నిలబడివుండగలను" అందికాని ఆవిడ ఒత్తిడివల్ల ఐదోనంబరు పిల్లను వొళ్లో బెట్టుకొని కూర్చుంది. పిల్లలందరూ నల్లగా వున్నా, పెద్దఅందం లేకపోయినా, పుష్టిగా బంతుల్లావుండి ముద్దుగానే వున్నారు. అందువల్ల ఆ పిల్లలమధ్య ఐదోనంబరు పిల్లని ఎత్తుకొని కూర్చోవడంలో కమలకు విసుగు తోచలేదు. ఐదోనంబరుపిల్ల నాడిస్తూ పేరు అవీ అడిగి వచ్చీరానిమాటలు వింటుండగా తల్లి అడిగింది: "బెజవాడలో యెవరింటికి వెళుతున్నావమ్మా" అని. కమలకు బెజవా

...లో తనచుట్టా లున్నట్లు జ్ఞాపకం లేదు. ఎవరో దూరపు చుట్టా లున్నారని మాత్రం ఎరుగును. ఏడుగురు పిల్లల తల్లికి జవాబు చెప్పడానికని ఆ దూరపు చుట్టాల పేరు చెప్పింది. ఆవిడ అడిగిన దానినిబట్టి కమలకు ప్రశ్న బయలు దేరింది తను బెజవాడలో ఎక్కడ బస చేయాలని. యింతవరకూ ఆ సంగతి ఆలోచించడమే మరచిపోయింది. ఇప్పుడు పోతున్నది బెజవాడ. ఎక్కడ బసచేయవలసినది తేల్చుకోకుండా వెళ్లి ఏం చేసేటట్లు. ఆ దూరపు చుట్టాలింటికి పోవడం అసంభవం. మరి తనకు స్నేహితు లెవరూ లేరే! అయ్యో ఎలా! కమలని ఆలోచనలు కలవర పెడుతుండగా ఏడుగురు పిల్లల తల్లి మళ్ళీ ప్రశ్నలు వేయసాగింది: "మీ నాన్నగారు ఏం చేస్తున్నారమ్మా?"

"మా నాన్నగారూ, అమ్మగారూ కూడా చనిపోయి ఆరేళ్లయిందండి. మా అన్నయ్య ఒక్కడే వున్నాడు. రాజమండ్రీలో వ్యాపారం చేస్తున్నా"డని చెప్పింది కమల.

"అంగుకా, పాపం, నీవు ఒకతెవే ప్రయాణం చేస్తున్నావు. ఇందాకటి నుంచీ ఈ వయస్సులో పిల్ల ఇలా ఒంటరిగా ప్రయాణం చేయడమేమిటి అనుకున్నాను. మీ అన్నగారి కెంతమంది పిల్లలమ్మా?"

"నలుగురండి" అని చెప్పింది కమల. ఇంతలో నిడదవోలు వచ్చింది.

జనం చాలామంది దిగిపోయారు. పెట్టె బాగా ఖాళీ అయిపోయింది. కమల తన పెట్టె, బెడ్డింగూ దగ్గరకు తెచ్చుకుని విశాలంగా కూర్చుంది. బుద్ధవిగ్రహం క్రిందకు దిగింది చేతిలో మరచెంబు తీసుకొని. వడుచు మొగుడుకూడా దిగివెళ్లాడు. మరి కొంతసేపటికి తిరిగివచ్చాడు. చేతిలో ఏదో టిఫిన్. భార్యకీయబోయాడు. ఆమె త్రోసి వేసింది. నాకక్కరలేదని మూతి ముడుచుకొని కూర్చుంది. వడుచు మొగుడి కేమీ పాలు పోలేదు. అలాగే భార్యప్రక్కన కూలబడి ప్రాధేయ పడుతున్నాడు. బుద్ధవిగ్రహం మరచెంబు తీసుకొని వచ్చింది. గృహిణి పిల్లవాడికి పాలుపోయడానికి కాళ్లు రెండు బెంచిమీదకు జాపి పిల్లవాడిని పడుకోబెట్టబోయింది. కమల సరదాకు తను పాలుపట్టానంది. తల్లి పిల్లవాడినిచ్చింది కమల కాళ్లు జాపి పిల్లవాడికి పాలుపోసింది. వాడు అల్లరి చేస్తూ, సగంపాలు వదిలివేస్తూ, సగం త్రాగుతూ త్రాగాడు. త్రాగిన తరువాత ఒళ్లుతుడిచి ఎత్తుకుంది కమల. వాడికి కడుపు నిండడంవల్ల అర్థంలేని కబుర్లు చెబుతూ, బోసినవ్వు నవ్వుతూ ఆమె మెడలో గొలుసు లాగడం మొదలుపెట్టాడు. మిగతా పిల్లలు తండ్రిని మంచినీళ్లకూ, ఫలహారాలకూ తిప్పుతున్నారు. ఆయన పాపం వగరుస్తూ మాటలాడకుండా తిరిగి వస్తూనే వున్నాడు. మళ్ళీ జనం బండిలోకి ఎక్కారు. బండి కూతకూసింది. పాపం బుద్ధవిగ్రహం దూరంగా ఉండిపోయింది. "రండి, త్వరగా రండీ" అని కేక వేసింది భార్య. "నాన్నా, నాన్నా, బండి వెళ్ళిపోతోంది" అంటూ పిల్లలు గోలచేయడం మొదలు పెట్టారు. కాని తండ్రి తీరికగానే మరచెంబు మర బిగించి నడవడం మొదలు పెట్టాడు. బండి కదలింది. "అయ్యో, అయ్యో త్వరగా పరుగెత్తండీ" అని భార్యా పిల్లలు కేకలు వేస్తున్నా ఆయన ఏ మాత్రమూ కంగారుపడలేదు. అక్కడ దగ్గరలోనున్న పెట్టెలోకి ఎక్కివేశాడు. "ఇలా ఉంటుందమ్మా ఈయన సంగతి" అంది గృహిణి కమలవైపు తిరిగి.

కాని కమల తన ఆలోచనలలో తాను మునిగిపోయింది. బెజవాడలో ఎక్కడ మకాము చేయాలీ అని. ఏ హోటలులోనైనా బసచేదామంటే హోటళ్లలో సామాన్యంగా మగవారి దృష్టితోనే సౌకర్యాలుంటాయి అక్కడ చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది పైగా మగవాళ్లందరి మధ్యా తానొక్కతే బసచేస్తే అందరికళ్ళూ తన మీదే ఉంటాయి తానేదో వింతమృగమైనట్లు. హోటళ్లకు పోకూడదు. మరెక్కడకు పోవాలి? పిల్లలతల్లి మళ్లీ అడిగింది: "ఏమమ్మా నీకు పెళ్లయిందా?" అని కమల ఉలిక్కిపడి ప్రశ్న జ్ఞాపకంచేసుకొని మెల్లగా చెప్పింది కాలేదని. "మీ అన్నగారికి ఆస్తి ఏమాత్రముంది?" మళ్లీ ప్రశ్న. "ఆస్తేమీ లేదండీ వ్యాపారంమీద కాలక్షేపం చేస్తున్నాడు. అదికూడా ఈ మధ్య సరిగా లేదండి" అని చెప్పింది కమల. "అందుకే మీ అన్నగారు కట్నా లీయలేక నీ కిన్నాళ్లూ పెళ్లి చేయలేక పోయాడన్నమాట. పాపం! చూస్తూ చూస్తూ దిక్కులేని వాడికీయలేడుకదా. అందులోనూ నీలాంటి రత్నంలాంటి పిల్లను ఇవ్వడానికి అసలు మనసొప్పదు" అని సానుభూతి వ్యక్తపరచిందా విశాల శరీర. కమల ఏమీ మాట్లాడలేదు పిల్లవాడి బుగ్గలు నొక్కుతూ నవ్విస్తూ ఉంది. పిల్లలతల్లే అంది: "అవునమ్మా ఈ రోజులలో కట్నాలబాధ మరీ పెరిగిపోయిందమ్మా కాసుకు మారనివాడుకూడా కట్నమిస్తేగాని చేసుకోవడంలేదు. కట్నాలు తేలేక ఆడపిల్లల తల్లిదండ్రులు ఏంబాధపడుతున్నారో దైవానికెరుక! ఇలాగే మా నాన్న కూడా కట్నమీయలేకనే ఈ కదలలేని ఘటానికి ముడివేశాడు. (తను మహా కదలగలిగే ఘటం అయినట్లు!) నా పిల్లల సంగతి ఎలా ఉంటుందో ముందు అని నా కిప్పటి నుంచీ బెంగగా ఉంది. పెద్దవాళ్లయితే మరీ ఇబ్బంది అని, చిన్నతనంలోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేస్తే మంచిదని మా ఘటంతో ఎన్నిసార్లు చెప్పినా, ఎంత మొత్తుకున్నా అది చెవికెక్కితేగదా. బుద్ధవిగ్రహంలా నవ్వుతూ కూర్చుంటారు. ఊళ్లో అందరికీ మంచివారులాగానే కనిపిస్తారు. ఏం మంచి? ఇంట్లో దానిమాట విడవబోయిన తరువాత. అదేకాక ఆడపిల్లలు పెద్దవాళ్లయితే కట్నాల మాట అటుంచి, వాళ్లకు నచ్చే సంబంధాలు వెతకడంలో మూడు చెరువులనీళ్లు త్రాగవలసి వస్తుంది—అన్నట్లు నీ పేరేమిటో అడగలేదమ్మా" అంది ఆవిడ ఒకే గుక్కలో తన తండ్రి తనకు నచ్చని సంబంధం చేశాడనీ, తన పిల్లలకుమాత్రం వాళ్లకు నచ్చిన సంబంధాలు చేయనక్కరలేదనీ పరస్పర విరుద్ధ అభిప్రాయాలు వెల్లడిస్తూ—అవి పరస్పర విరుద్ధాభిప్రాయాలని తెలుసుకోకుండానే. కమల తన పేరు చెప్పింది.

"నీవు చాలా సత్యకాలపు అమ్మాయిలా ఉన్నావు తల్లీ. ఈ కాలపుపిల్లలు ఎవరూ నీలాగ ఉండరు. ఊరికే మిడిసి పడిపోతారు. నీ అందమే వాళ్లకుంటేటట్లయితే ఇక వాళ్ల కళ్లు భూమి మీద ఆనుతాయా. సిగ్గూ శరమూ విడిచి తిరుగుతారు. ఎక్కడపడితే అక్కడ తిరుగుతారు. మగాళ్లతో మాట్లాడుతారు. ఇంట్లో పనులు ముట్టమంటే మాత్రం ఒళ్లువంగదు పిల్లల నెత్తుకోవడమంటే తప్పు. అస్తమానూ ముగ్గు పూసుకున్నట్లు ఫేస్ పౌడ రద్దుకోవడమూ, కళ్లు తిప్పుకోవడమూను. నీవే విచిత్రంగా కనిపిస్తున్నావు తల్లీ. నిన్ను చూస్తే నా కెంతో ముచ్చటగా ఉంది ఇంత అందముండీ ఈనాటివాళ్ల వేషాలేమీ నీ దగ్గర లేవు. ఇప్పటివాళ్లు ఉద్యోగాలు చేస్తామంటూకూడా బయలుదేరుతున్నారు మగాళ్లలా. మా పెద్దబావగారి కూతురొకతె—చిన్నప్పుడే మొగుడు చచ్చినది-ఉద్యోగం వెలగబెడ్తోంది. అది నేలమీదను చూస్తుందా అసలు. దాని పోకుళ్లో మిడిసిపాటులో ఏ ముండా చాలదు. మొగుడు చచ్చినదానికి ఈ పోసులూ వేషాలూ ఏమిటమ్మా. ఏదో ఇంత తిండి గడవడమేగదా కావలసినది. దానికోసం ఈ ఉద్యోగం చేసి వీధిన బడాలా? మామగారింట్లో చాకిరీచేస్తే ఆ మాత్రం గడవక పోతుందా. దాని అసలు

★ అబల ★

బుద్ధి అదికాదు కనుకనే ఈ ఉద్యోగాలూ వేసాలూను. దానిని గురించి ఊళ్లో ఇన్ని పుకార్లున్నాయి. (తన తలవెంట్రుకలు చూపిస్తూ) ఆపిదానికి ఉద్యోగ మేమిటమ్మా లేకపోతే. ఏదిక్కూ లేనిది తిండి గడవక చేసుకున్నా అర్థముందికాని ఎవరో ఇంత పెట్టేవారుండగా ఈకర్మ కేమిటి?" అందా గృహిణి.

ఇతరుల అభిప్రాయాలను తెలుసుకో జాలని అసంఖ్యాకులలో ఆగృహిణి ఒకతె. ఇతరులకూ అభిప్రాయా లుంటాయనీ, అవి బహుశా తమవాటికి పూర్తిగా భిన్నంగా ఉండవచ్చునేమో అన్నదే వారూహించలేరు. తమ అభిప్రాయాలే సరియైనవనీ, ఎదుటివారుకూడా తప్పనిసరిగా అవే అభిప్రాయాలు కలిగివుంటారనే ధీమాతో తమ అభిప్రాయాలు గట్టిగా ప్రకటిస్తారు. దానితో ఎదుటివాళ్లపని ఇరకాటాన పడుతుంది. భయస్తులూ వాదానికి సిద్ధపడని వారూ ఒకటి రెండుసార్లు మెల్లగా తమ అభి

ప్రాయాలు వెల్లడించబోతారు కాని నిశ్చితాభిప్రాయాలు కలవారు వారిని పూర్తిగా మాట్లాడనీయకుండా, వారు మాట్లాడేదికూడ తమ అభిప్రాయాలను సమర్థించడానికేనని భావించి ఇంకా గట్టిగా మాట్లాడుతారు. దానితో భయస్థులూ, వాదానికి సిద్ధపడని వారూ మనస్సులోనే బాధపడి మౌనంగా ఊరుకుంటారు. ఎదుటివాళ్లుకూడా పట్టుదల గలవాళ్లయితే తమ వ్యతిరేకాభిప్రాయం స్పష్టంగా ప్రకటిస్తారు. దానితో బయలుదేరుతుంది ఘర్షణ. మొదటి అభిప్రాయం ప్రకటించినవారు రెండోవారు కావాలనే తమను వ్యతిరేకిస్తున్నారనుకుంటారు కాని వారికికూడా తమలాగే తమ అభిప్రాయాల పట్ల అంత విశ్వాసముంటుందనేది గ్రహించలేరు. తనకు కాకరకాయి ఇష్టమని ఎదుటివాడికికూడా కాకరకాయే ఇష్టమై వుంటుందని అనుకోడం ఎలా? ఎదుటివాడికి పొట్లకాయో, బీరకాయో ఎక్కువ యిష్టమయి ఉండవచ్చు కాకరకాయ అంటే అసహ్యమై వుండవచ్చు. అంతమాత్రంచేత వాడికి రుచి సరిగా తెలియదని, వాడుకూడ కాకరకాయనే ఇష్టపడాలని కోరితే ఎలా? 'లోకోభిన్నరుచిః' అన్న సామెత అందరికీ తెలిసిందే. కాని అంత ఎక్కువగా మరచిపోబడే సామెతకూడా అదే. ఈ సామెతే తరచు జ్ఞాపకం చేసుకుంటే లోకంలో సగం పేచీలు తగ్గిపోవునేమో. భార్యాభర్తల మధ్య పొరపులు పుట్టకపోవునేమో. సంసారాలు సుఖతరం కాగలవేమో. స్నేహితులు విడిపోవడం జరగదేమో. కాని ఈసామెతను జ్ఞప్తికి వుంచుకునేవారు తక్కువ కాబట్టి ఆత్మాభిమానం గలవారితో సరిగా వాదించడానికిమార్గం వారన్నది సరిగా కాదనడమే. దానితో వారికి కొంత తెలిసివస్తుంది. కాని కమలకి అంత ఎదిరించిమాట్లాడే స్వభావం కాదు. చర్చకూ, వాదనకూ త్వరగా సిద్ధపడలేదు. స్నేహితురాంద్రమన్య దనువు చేత వాదించగలదుగాని ఎవరితో పడితే వాళ్లతో వాదనకు దిగేస్వభావంకాదామెది. అందుకే అన్నగారిముందు తన అభిప్రాయం ప్రకటించడానికి అంత సంజాటన పడింది. ఆమె స్వభావం ఇలాంటిది కావడంవల్లనే ఆ గృహిణి ఇలా ఆధునికయువతుల నాడిపోసుకుంటున్నా గట్టిగా ఆక్షేపణ తెలుపలేకపోయింది. ఆవిడ అంటున్న మాటలన్నీ తనకే చెందుతాయి. ఆవిడ అభిప్రాయాలన్నీ తనకు కంటకంగా తోచేవే. తాను ఏమాత్రం ఒప్పుకోలేనివే, కాని ఆగృహిణి

(47 వ-పేజీ చూడండి)

పులి

"చలి నిన్ను పులి మింగిపోనూ—
ఎండయ్యతో చెప్పి
నిను పట్టి కట్టించునా నే—"

అని శపించాడు—గజగజ వణికించే చలిని ఒక కవి. 'మింగడం' అనేది పులి ప్రత్యేకత. అందుకే గాబోలు డబ్బు గుటకాయి స్వాహా చేసేవాణ్ణి 'బోసిపులి' అంటారు. చాలామంది భార్యల్ని దిగమింగినవాణ్ణి 'పెళ్లాలపులి' అనటం పరిపాటి అయింది.

పులికి పౌరాణికంగా గూడా ప్రఖ్యాతి వుంది. దుర్గాదేవి వాహనం పెద్దపులి. శంకరుడు కప్పుకునేది పులిచర్మం. చాలా పవిత్రమైంది అందుకనే మహాత్ములంతా గూడా పులిచర్మాన్ని ఆసనంగా వుపయోగించుకున్నారు.

పులి కార్జం తింటే పులి అంతటి పౌరుషం పుట్టుకొస్తుందని చైనా వారి నమ్మకం. పులిమాంసం అనేక వైద్యగుణాలు కలిగి వుంటుందని శాస్త్రజ్ఞుల వూహ. పులికి విషమంతా దాని మీసాల్లోనే వుందట. అందుకనే పులిని చంపిన వెంటనే దాని మీసాలు రద్దుచేస్తారు కాబోలు. బహుశః దీన్ని బట్టే వచ్చివుంటుంది—అపాయాన్ని సూచించే "పులి మీసాలు పట్టుకొని ఉయ్యాలూగినట్టు" అనే సామెత.

మనసాహిత్యంలో పులికి సంబంధించిన సామెతలు కొల్లలు. సాధారణంగా భయం కలిగించేమనుష్యులను 'అదుగో పులి' అంటుంటారు. అయితే ఆఫీసుల్లో స్ట్రిక్టుగా వుండి యింట్లో పిల్లిలాగా వుండేవాళ్ళను 'బయట పులి' 'ఇంట్లో పిల్లి' అని వ్యాఖ్యానిస్తూ వుంటారు. ఇలాంటిదే మరో సామెత— "ఇంట్లో ఈగపులి,, బైట పెద్దపులి."

"ఇదిగో పులి అంటె అదిగో తోక" అన్నట్టు (గోరంతని కొండంత చేయడం.)

"పులి ఎదటైనా పడవచ్చుగాని నగిరివారి ఎదట పడరాదు." అంటే ప్రభుత్వోద్యోగుల ఎదట పట్టం పులి ఎదట పట్టం కన్న గూడ కష్టం అన్నమాట. ఇదే రకంది మరొకటి-"పెద్ద పులి తరుముకు వచ్చినా బాజారం ముందుకు పోరాదు."

"పులినిచూచి నక్క వాతపెట్టుకున్నట్టు" ఇదొక సామెత,

పులికి సంబంధించి జాతి లక్షణాల్ని సూచించేవి కొన్ని మన సాహిత్యంలో వున్నాయి.

"పులికి ఆకలయితే గడ్డి తింటుందా ?"
"పులి కడుపున పిల్లిపిల్ల పుడుతుందా"
"పులిపిల్ల పులిపుల్లే, మేకపిల్ల మేకపిల్లే"
"కూనపులికి లేడిదీటా"

ఇత్యాదులు కొల్లలు.

"నవాబంత దరిద్రుడు; పులి అంత సాధువు (అవహేళన)

వి. కే. దాసరి

"పులిమీద పుట్ర" (అపాయం వెంబడి అపాయం.)

ఈనిన పులికి చెప్పలేనంత ఆకలి. అందువల్ల అది తనపిల్లల్నే తను మింగివేస్తుంది. ఈలా మింగివేయటమే సృష్టి చిత్రమూ, దేవుని వుద్దేశ్యమూ. ఎందుకంటే పెద్దపులికి పుట్టిన పిల్లలన్నీ బతకడం సంభవిస్తే అసలు ఈ ప్రపంచమే వుండదేమో.

"పులి పక్కన వున్న జోరీగ"—ఇంక జోరీగకి భయమేమిటి ?

"పులినాకి విడిచినట్టు" (గొప్ప ఆపద నుండి బతికి రావటం.)

"పులినాకనూ, అయ్య బతకనూనా" (అసంభవం) ఇట్లాంటి భయంకరమైన పెద్దపులి బాలసాహిత్యంలో స్థానం సంపాదించగలిగింది.

"ఇద్దరు ముగ్గురు ఒకచోట
ఒంటిపులి రాకా సోకచోట..."

అనేపాటతో పిల్లల్ని ఎగతాళి చేస్తుంటారు.

బాలసాహిత్యంలోనే ఆనంద పరచే సుప్రసిద్ధ 'పులి' గాథలు.

'తోక పీకుడుగాడు' కథ—

'పులిగాడికి గిలిగాడు'—

'పులికి చారలెటావచ్చాయి?'—

సాధారణంగా మనం జానపదకథల్లో ఒక కష్టమైనపని చేసుకు రమ్మనటం పరిపాటి. అదే 'పులిపాలు' పితికి తెమ్మనటం.

భోజరాజీయంలో 'గోవ్యాఘ్ర సంవాదం' అందరికీ తెలిసిందే అతిజాలి గొలిపేదీ నీతి దాయకమైనదీనూ. ఇది విని కన్నీరు కార్చనివా రుండరు.

'పెద్దపులిగోరు' పిల్లల మెళ్ళో గోరుని బంగారంతో పొదిగించి వేయడం కద్దు. దానివల్ల దృష్టిదోషం తొలగి పోతుందని నమ్మకం. ఇదే 'పులిగోరు పతకం'—

పులిని గూర్చి కొన్ని జాతీయాలు కూడా వున్నాయి.

'మెత్తని పులి' పైకి మెత్తగా కన్పించి లోలోపల కొంప లార్పేవాడు. ఇలాంటిదే 'మేకవన్నె పులి'

పీర్లపండగల్లోనూ, గ్రామదేవత జాతర్లలోనూ పులివేషాలేయడం ఒక వేడుక.

చారిత్రక విషయాల్లోకి పోతే 'బొబ్బిలి బెబ్బులి' తాండ్ర పాపారాయుడు తటాలున జ్ఞాపకం వస్తాడు.

సంస్కృతంలో గూడా 'పులి'కి సంబంధించిన లోకోక్తులు వున్నవి.

'ఉపోషితస్య వ్యాఘ్రస్య పారణం పశుమారణం' అంటే ఉపవాసంతో వున్న పులికి పశువులను చంపడమే పారణం— అని అర్థం.

'వనవ్యాఘ్ర న్యాయ' మని వుంది ఒక న్యాయం. అడవికీ, పులికీ అవినాభావ సంబంధముంది. అంటే అడివిని విడిచి పులీ, పులిని విడిచి ఆడివీ వుండలేవు పులి లేకపోతే అడవులకు రక్షణావుండదు. అడివి లేకపోతే పులులకు రక్షణాలేదు. ఇదీ వనవ్యాఘ్ర న్యాయం.

'తరక్షు డాకినీ న్యాయ' మని మరొక న్యాయముంది. దీని అర్థం — 'పెద్దపులి వాహనం మీద కూర్చొని బయలుదేరిన మహాకాళిలాగ' అని. పెద్దపులి భయంకరమైంది. దానికితోడు మహాభయంకరమైనది మహాకాళి. ఎక్కువ భయం పుట్టించే సందర్భంలో ఈ న్యాయాన్ని వాడుతారు.

'వ్యాఘ్రచోర ధనుర్న్యాయం' అని మరొకటి—ఈ లోకోక్తి చాలా చిత్రమైన పోలికల్ని సూచిస్తుంది. పెద్దపులి పొదలో పొంచి మృగాలమీదికి దూకుతుంది. దొంగ ఒకచోట దాక్కొని వుండి కన్నం తవ్వుతాడు. విల్లు మొదట వంగి బాణాన్ని విడుస్తుంది అదేవిధంగా దుర్మార్గుడుకూడా వినయం నటిస్తూ కొంప లార్పుతాడని ఈ న్యాయం భావం.

ఇక 'గోముఖ వ్యాఘ్రం' సంగతి చెప్పేదేముంది? ఈ విధంగా మనసారస్వతంలో పులిని గూర్చిన ప్రశంస కన్పిస్తూంటుంది. ★

చిత్రమాలిక

పంతులు-శాస్త్రి

గులాబి

తెల్లవారితే ఆదివారం. ఆఫీసుకి వెళ్ళవలసిన అవసరంలేదు. ఈ స్ఫురణ తొలినాటి సాయంకాలంనుండి కృష్ణశర్మ మనసులో మెదులుతూనే ఉంది.

రాత్రి పడుకోబోయేముందు మళ్లీ జ్ఞాపకం చేసుకొన్నాడు, రేపు ఆఫీసుకి వెళ్ళనక్కరలేదు; మధ్యాహ్నం భోజనం చేసిన తరవాత కొంతసేపు నిద్రపోవచ్చును— ఇప్పుడు కొంచెం ఆలస్యంగా నిద్రపోయినా బాధలేదు మ్యునిసిపల్ లైబ్రరీనుండి తెచ్చి, వారం రోజులాయి చదవకుండా ఉండిపోయిన జాన్‌స్టీన్‌బెక్ నవల గ్రేప్స్ ఆఫ్ రాత్ చదవసాగాడు. అధమం పన్నెండు గంటలవరకయినా చదివి, మర్నాడు ఆదివారం గనక రోజంతా పూనికగా చదివితే చాలావరకు చదవవచ్చు ననుకొన్నాడు. కాని, పుస్తకం చదువుతూ ఉంటే, అలవాటు ప్రకారం పదిగంటల వేళకల్లా నిద్ర ముంచుకొని వచ్చింది. సరే కానీ, తెల్లవారుజామున చదవవచ్చుననుకొని, ఎలాగో దీపం తగ్గించి పడుకొన్నాడు. తెల్లవారుజామున మెలకువరాలేదు. పనిమనిషివచ్చి తలుపు పిలవడంతో యంత్రవతుగా లేచి వెళ్ళి తలుపు తీసి వచ్చి మళ్లీ పడుకొన్నాడు.

పనిమనిషి తన పని పూర్తిచేసుకొని, బొగ్గులకుంపటి అంటించి, నీళ్లుపడేసి, పాలవాడు తెచ్చిఇచ్చిన పాలు తీసుకొని, తనకు వెళ్ళిపోవలసిన వేళయింది, బాబుగారిని లేపడమా మానడమా అనుకొంటూ ఉండగా లేచి పెరట్లోకి వచ్చాడు కృష్ణశర్మ.

బల్లమీద కూర్చొని కొగుపుల్లతో పళ్లు తోముకోడం ఆరంభించాడు శర్మ.

పనిమనిషి తాను అంతసేపూ చేసిన పనులు ఏకరువుపెట్టి, తనకు అప్పటికే ఆలస్యం అయిందనీ, రామంబాబుగారి ఇంటికి వెళ్లిపోవాలనీ అంటూ వెళ్లిపోయింది.

కృష్ణశర్మ పనిమనిషిమాటలు విన్నాడే గాని సరిగా బోధపరచుకోలేదు.

అతని దృష్టి అంతా ఎదురుగా ఉన్న గులాబీ మొక్కమీదనే ఉంది.

అది ఇన్నాళ్ళూ ఊరుకొని ఊరుకొని ఇవాళ ఒక్కటంటేఒక్క పువ్వు పూసింది; అంటే ఏ రెండు మూడు రోజులక్రితమో మొగ్గపెట్టి ఉండాలి. తాను చూడనేలేదు. అయితే ఇదేబాగుంది, మొగ్గనూ చూసి, ఇవాళ పూస్తుంది, రేపుపూస్తుంది అనుకోడంకంటే గులాబీపువ్వు, ఎంత అందంగా ఉంది!

గులాబీపువ్వు-తనకేం కొత్తకాదు. ఇది మరీ పెద్దపువ్వు కాదుగాని, ఒక మాదిరిగా పెద్దదే.

ఏమిటీ రేకులపేర్పు! ఎంత మృదువుగా, తీయనైన వాసన కలిగిఉంది. ఎక్కడనుండి ఉద్భవించింది? ఈ మట్టిలో నుండేనా? ఈ మట్టిలో ఇంతటి రమణీయమయిన రంగులకి ఆధారభూతమయిన ఏదో సూక్ష్మకణ సముదాయం గర్భితమై ఉందన్నమాట? ఈ సువాసన ఎక్కడనుండి వచ్చింది? ఈసువాసన ఎంతోసేపు ఉండదు కొంచెం వేడిగా ఎండ సోకడంతో అంతరించిపోతుంది. అయితేనేం తన పెరటిలో, తన ప్రయత్నం ఎంతమాత్రంలేకుండా ఒక గులాబీ పూసింది.

బల్లమీద కూర్చున్నవాడల్లాలేచి మొక్కచుట్టూ ప్రదక్షిణం చెయ్యసాగాడు.

మొగం కడుక్కొన్న తరవాత కాఫీ సంగతికూడా ఆలోచించకుండా మొక్కకి సంరక్షణచెయ్యడం ప్రారంభించాడు.

పాపం, సరోజ, ఈ మొక్కగురించి ఎంత తాపత్రయపడ్డాది - వీళ్ళింటినుండి వాళ్ళింటినుండి కత్తిరించిన కొమ్మలు తెచ్చి పాటుతూ ఉండేది. చిన్న పిల్లలకు చేసినట్టుగా వాటికి సంరక్షణ చేస్తూఉండేది. అవి బతికినట్టే కనిపించేవి. ఒకటి రెండు చిగుళ్లు కూడా పెట్టి, క్రమంగా వాడిపోయేవి—ఎండిపోయి, పుల్లల్లాగ అయిపోయినా తీసిపారెయ్యడానికి తనకి మనస్సొప్పేదికాదు.

"ఎందుకంత శ్రమపడతావు, అవి వేళ్లు తన్ని మొక్కలయి, పూలు పూయడం ఎప్పుడు? నువ్వు పెట్టుకోడం ఎప్పుడు? ఒక రెండణాలు పెట్టి పువ్వులు కొనుక్కొంటే సరిపోలేదా?" అనేవాడు తాను.

ఆమె మాత్రం తన పట్టుదలను విడిచిపెట్టేదికాదు. సన్నగా ఎనిమిదడుగులు వెడల్పులోని ఆ పెరటిలోఉన్న కొద్దిపాటిస్థలంలో ఒక నందనవనం విలసిల్లచెయ్యాలని ఆమె తాపత్రయం. మల్లెమొక్కలు పెంచింది; మల్లెమొగ్గలు కొనుక్కొనవసరం లేకుండా నిత్యకృత్యం గడిచిపోయేలా చేసింది.

తాగడానికే మంచినీళ్ళు దొరకడం కష్టమయినస్థలంలో పువ్వుల మొక్కలకికూడా నీళ్ళు తెచ్చి పోసేది. వెళ్ళిపోయేటప్పుడు పనిమనిషితో మరీమరీ చెప్పి వెళ్ళింది, మొక్కలకి నీళ్ళు పొయ్యడం మరిచిపోవద్దని.

ఇవాళ సరోజకి ఉత్తరం రాయాలి. అందులో తప్పకుండా గులాబీపూసిందని రాయాలి. ఎంత సంతోషిస్తుందో!

ఎండ బాగా చురుకుమనేవరకూ మొక్కల సంరక్షణలోనే నిమగ్నుడయి ఉన్నాడు.

కాఫీ చేసుకొని తాగి, వెళ్లి గదిలో పుస్త

★ చిత్రమాలిక ★

కం పట్టుకొని కూర్చున్నాడు. కాని, గదిలో కూర్చోడం బాగా అనిపించలేదు -

పడకకుర్చీ తెచ్చుకొని, పెరటి వరాండాలో వేసుకొని కూర్చున్నాడు. పుస్తకం పట్టుకొన్నాడేగాని, చదవడం సాగలేదు. ఎంతసేపూ ఎట్టకేలకు పూసిన ఇంటి గులాబీ మీదనే దృష్టి—

చిన్నతనంలో వర్డ్స్‌వర్త్ వ్రాసిన డేఫొడిల్స్ పద్యం పాఠం చెప్పేవారు. అప్పట్లో ఆ పద్యమూ బోధపడేదికాదు. అందులో ముఖ్యమయిన భాగాలకని మాష్టర్లు చెప్పిన వ్యాఖ్యలూ అలాగే అర్థమయేవి; ఏదో వల్లెవేయడం, పరీక్షలో కొంత రాయడం, ఆవెంటనే పూర్తిగా మరిచిపోవడమూ— ఇంతే, స్కూలుచదువు.

నిజంగానే, అనుకోని స్థలంలో ఒక్కమారుగా ఎన్నో పువ్వులు కనిపించినప్పుడు కలిగే ఆనందం ఎంత గొప్పది! ఎప్పుడో ఒక్కమారు తాను చూసిన ఆ పువ్వులను

తలచుకొన్నంతలో, తరవాత ఎంతకాలం వరకో, ఎటువంటి పరిస్థితిలో ఉన్నా సరే, మనస్సు ఆనందతరంగితమయి, ఆ పువ్వులతో పాటు నృత్యంచేస్తున్నట్టే ఉంటుందన్న మాట—చిన్నతనంలో పచ్చికోతగా కనిపించడంలో వింతలేదు—కాని, నిజమే ఒక వయసులో, ఒక మానసిక పరిస్థితిలో పొందిన అనుభవాలు వయోభేదంవల్ల, పరిసరాల్లోను మానసిక స్థితిలోని భేదాలవల్ల, నమ్మదగినవిగా కనబడక పోవచ్చును. ఈనాడు తాను ఒంటరిగా ఉండడంవల్ల ఈ గులాబీ పువ్వును, ఇంత ఆదరపూర్వకంగా చూడగలుగుతున్నాడు - ఇదే మామూలుగా సరోజ ఉండి, "ఏమండీ, చూసేరా! ఇది ఇలా ముళ్లు పెంచుకుంటూ పెరగడమేతప్ప ఎన్నటికీ పుయ్యదన్నారు; మన గులాబీ మొక్క పూసింది చూడండి" అనిగాని పువ్వును తెచ్చే మాటయితే, తాను, "ఆ. పోస్లెద్దూ. ఇన్నాళ్లూ నువ్వు దానికింద పడిన శ్రమకి ఈ ఒక్క పువ్వేనా పూసింది ఇంతకంటె హాయిగా నాలుగు పువ్వులు కొనుక్కో కూడదూ" అనిఉండే వాడేమో.

ఇరుకు గోడల మధ్యను, రోజుకీ రోజుకీ భేదం తెలియని బ్రతుకుల్లో రోజాపువ్వు మాధుర్యం ఏమిఅనుభవించ బడుతుంది? ఎప్పుడూ ఒకటే దినచర్య—ఒకటే ఆఫీసు ఒకేరకం ఫైళ్లు—ఆఫీసర్లు మారుతూ ఉంటారు. వాళ్ళలోని భేదమల్లా సంతకం పెట్టే తీరులోనూ, ఏదైనా పనిలో పొరపాట్లు వస్తే కేకలువేసే ధోరణిలోనూ మాత్రమే.

తనకు అనుభవంలోవున్న ప్రకృతిదృశ్య శోభంతా పబ్లిక్ పార్కుకు సంబంధించినదే. అక్కడి చెట్లూ పూలూ మాత్రమే కాదు, గడ్డిపోచా ఎంతో డబ్బుఖర్చుతో కృతకంగా సృష్టించబడినదే—

నిత్యకృత్య గమనంలో పడిన తనకు కాలభ్రమణమూ, ఋతుపరివర్తనమూ కూడా సరిగా అవగతం కాదు—చెట్లూ, పువ్వులూ, వెన్నెలలూ, మేఘాలూ, కోకిలలూ ఇవన్నీ పుస్తకలబ్ధ సామగ్రి అయి ఊరుకొంది—

తాను గుర్తించే కాలగమన వైఖరి అంతా ఇంతే. వర్షాలు ఎక్కువగా పడుతున్నాయంటే, పాతగొడుగు మరామత్తు చేయించుకోవడం, రెండేళ్ళ క్రితం కొన్న రబ్బరు జోడు మరి వాడబడదని ఎలాగో ఒకవాటర్ ప్రూఫ్ జోడు కొనుక్కోడం—చలిఎక్కువయిందంటే, వైటికి తొడుక్కోడానికి బాగులేని స్వెటర్‌ను లోపల బనీనులాగా తొడుక్కుని, పైనాటిదో బాగా పాతి

అయిపోయిన క్లోజుకోటును విడవకుండా ఫిబ్రవరి ఆఖరువరకు తొడుక్కోడం, వేసవికాలం ఉదయం ఆఫీసులన్న పేరుతో, ఉదయం ఏడుగంటల నుండి మధ్యాహ్నం రెండుగంటల వరకూ మాడడం ఇంతే...

ఇటువంటి నీరస దైనికచర్య నిర్వహించుకొనివచ్చే తాను, తాతలనాడు నేతులు తాగిన కబుర్లలాగ, ఎప్పుడో కాలేజీజీవితం రోజుల్లో రాసిన కవిత్వస్ఫురణని కాదనలేడు. ఇప్పటికీ పద్యం రాయాలంటే, పద్మాలు, కలువలూ, జ్యోత్స్నలూ, కోకిలలూ ప్రత్యక్షం కాక మానవు—నిజానికి తాను అందమైన తామరపువ్వులూ కలువపువ్వులూ నిండిన కొలను చూసి ఎన్నాళ్లయిందో?

తానేకాదు, నేటి జీవితవిధానమే అలా ఉంది. సంగీతం, కవిత్వం, చిత్రలేఖనం— ఆ యా కళలను ఉపాసించాలనే వాళ్ళకి పరిసరాలు ప్రోత్సాహం కలిగించడంలేదు.

నిత్యకృత్యంలో సౌందర్య స్ఫురణకి పాటకాశంలేదు; ఆనంద రసానుభూతి అనేది తమతమ జీవితాల్లో ప్రత్యక్షంగా వాంఛించడం అనేది అందని పళ్లకి అర్రులు చాచడంగా జనసామాన్య భావన అయిపోయింది; చదువుకొన్న వాళ్లకి పుస్తకాలలోనూ, అజ్ఞానులకి సినిమాల్లోనూ మాత్రమే పరోక్షంగా ఆనందలబ్ధి కలగవలసిన పరిస్థితులలో యంత్రవతుగా జీవితాలు సాగిపోతున్నాయి—రేడియో వినడమో, సినిమా చూడడమో, ఏకొద్దిమందో ఆడే ఫుట్‌బాల్ క్రికెట్ మొదలయిన క్రీడలను చూడడమో- తమకు సంబంధించిన చలనమూ, వ్యక్తిగతమయిన అనుభవమూ లేకుండా పరోక్షానుభూతినే స్వీయం చేసుకోవలసి వస్తుంది. ఇది ఎంతవరకూ వెళ్లిందంటే, ఎన్నడూ క్రికెట్ బేట్ పట్టుకోకుండా, అసలు ప్రత్యక్షంగా మంచి ఆటైనా చూడకుండా ఎక్కడో జరుగుతున్న ఆటను గురించి రేడియోలో ప్రసారితమయే వార్తలను తన్మయత్వంతో విని, తమలోతాము బ్రహ్మానందంగా చర్చించుకోవడమే కాదు, ఆ రకం ఉత్సాహం లేనివారిని అనాగరికులుగా జమకట్టడం కూడా ఒకవిధమైన సభ్యతా లక్షణమయి ఊరుకొంది—

తన గులాబీమాత్రం అటువంటిదికాదు; చాలా యథార్థమైనది - ఎన్నిముళ్లుంటేనేం, ఎన్నాళ్లయితేనేం, ఓపువ్వు పూసింది సరోజకి ఉత్తరం రాయాలి - అటునుంచి శుభలేఖవచ్చేక రాస్తే సొగసులేదు; ఇవాళే ఇప్పుడే రాయాలి; గులాబీ పూసింది- అమ్మాయిపుడితే "రోజా" అని పేరుపెట్టాలి సరోజ కూతురు రోజా.

★

కుక్కుటచోరులు

పూసపాటి కృష్ణంరాజు

పైడమ్మ గుడిశెముందు తల్లి కోడిపెట్ట కొ-క్కొ-క్కొ; కొ-క్కొ-క్కొ: అని గోలచేస్తూంది. పైడమ్మ ఎవర్నో తిట్లతో ఎత్తిపోస్తున్నది. ఆ తిట్లతోనే తెల్లవారింది. శ్రీ రాజావత్సవాయివారి ప్రహరీగోడ చివరను పచ్చగన్నేరు పొదల్లో సూర్యుడు నవ్వుతూ కిరణాలు విరజిమ్ముకుని చకిలిగా ఉదయిస్తున్నాడు.

పైడమ్మ కూతురు నూకాలేడుస్తూంది. ఏడుస్తూ గడపలో కొళ్ళారజాపు కూర్చుంది. దానిముఖంలో ఏడుపు వీధి చివార పెదరాజుగారి సావిడీఅరుగుమీద కూర్చున్న నలుగురికీ తృప్తినిస్తున్నది.

పల్లెజనంఅంతా పనల్లో నిమగ్నమౌతున్నారు. గొల్లభామలు పలకమీద పోసిన ఆవాల్లా దొర్లిపోతూ నీలాటి రేవుకి సాగిపోతున్నారు.

పైడమ్మ వీధిలో నిలుచుంది. కాదు ధర్మపథంలో నిలుచుంది. నిలుచుని నోరుపారేసుకుంది. పిచ్చెక్కినట్టు శాపనాకారాలు పెడుతూంది.

ఆ దారిని పోతూ, ఆగొడవ ఎవరికి పట్టినా ఎంతసేపని? ఒక్కక్షణం నిలుచుని "అయ్యో పాపం! ఆళ్ళచేతులు మట్టిగలా, ఆళ్ళకేం రోగం వొచ్చిందమ్మా. యింతసేటన్నాయవా! యిదేం చిత్రమమ్మా!" అని నాలుగు సానుభూతివాక్యాలు చెప్పి ఎవరిపనుల్లో వాళ్లు వెళ్లిపోతున్నారు.

పైడమ్మ తిట్లూ, దీవెనలూ అందరికీ అలవాటేగాని, పైడమ్మ కూతురేడుస్తూంది. నూకాలు ఏడవడం వీధిలో అందరికీ వింతగానేవుంది. అసలు నూకాలెప్పుడూ యీమధ్య ఏడవలేదు. కిలకిలా నవ్వుకుంటూ, కబుర్లుచెబుతూ అందర్నీ నవ్వించి తను నవ్వుతూ చలాకీగా నిశ్చింతగా అమాయకంగా రోజులు గడుపుకొస్తూంది.

నూకాలు పద్దెనిమిదేళ్ళ నిండు యౌవనంతో మిసమిసలాడుతూంది. ఎవరయినా మాటంటే అట్టే విరుచుకుపడేది. ఒల్లమాలిన సిగ్గుతో బుగ్గలు రెండూ గంట్లుపడి లోతుకి నొక్కుకుపోయేవి. మూతివిరిగించి ఎంతవాడినైనా "చాలెల్రా వచ్చినోడా" అని మాట విసిరేసి వొయ్యారంగా టర్కీకోడిలా నడుచుకుంటూ వెళ్లిపోయేది.

గంపెన్నులూ, చదపురుగులూ తెచ్చి కోడిపిల్లలను మేపేది. గరువు మీద గరికిపరక ఏరి తెచ్చి గొర్రెపిల్లలను ఆదుకునేది. రావి ఆకులు కోసుకొచ్చి ఒకొక్క రెమ్మనీ మడతలుచుట్టి అందించి మేకపిల్లను దువ్వుకుంటూ మురిసిపోయేది. అప్పుడప్పుడు శ్రావ్యంగా కంఠం ఎత్తి గైరమ్మ పదం, చందమావపాట, పాడుకునేది. గొల్లవీధి భామలంతా చుట్టూ చేరి "నూకాలూ, నూకాలూ, పదం పదువ్వే" అని అడిగేవారు. ఓ ఘడియ మురిపించుకుని మురిపించుకొని పుచ్చపువ్వులా పూసిన వెన్నెట్లో కూర్చుని కంఠం విప్పేది. పదం అందుకుంటే ఎదురుగా వున్న రాజుగారి ప్రహరీగోడ ప్రతిధ్వనించేది.

"నూకాలి మొఖంలో మచ్చలేదు అందుకనే చందమావనీ నూకాలు ముఖాన్నీ గుర్తించగలుగుతున్నాం" అని విశ్వన్న భావయుక్తంగా అనేవాడు. బిల్హణీయం చదువుకున్నాడో; శివశంకర శాస్త్రిగారి మహోదయం చదివేడోగాని అతని సామీప్యం రమ్యంగా వుందనడానికి నూకాలే నిదర్శనం.

"సౌందర్యం అనేది యిక మిగలకుండా అంతా విధాత నూకాలు అనే యౌవనవతిలో కుదించేశు" అని సన్యాసి విశ్వన్నకి వంత పాడేవాడు. అదీ నిజమే. అంత అందం వుండనే వుంది.

అయినా నూకాలిప్పుడేడుస్తున్నది.

పెళ్ళి కూడా కాలేదు. నలుగురైదుగురు చూపులకొస్తే ఏవేవో వంకలు చెప్పి "అడి జిమ్మడ; అడి కింద నాను మనువుతానా!" అని తిరస్కరించింది. పైడమ్మ కూతురంతంటే అంతే. కాదని ఎప్పుడూ అనలేకపోయేది.

"ఎప్పుడో దానికి నచ్చినోడొచ్చినప్పుడే ముడెడతాను" అనేది. పైడమ్మకూ, నూకాలుకూ ఏం తక్కువని. పైడమ్మ మెడలో మెరసిపోయే నానూ, తీగ, నూకాలి కంఠాన శ్రోత్రండాన్ని పుణికిపుచ్చుకున్నాయి. రత్తయ్యను పిలచి యీ మధ్యనే చెవులకు నాగుజోడు చెయ్యించింది. మాటట్టుకుని వచ్చిన శానాపతిదగ్గర బొద్దంచుకోకలు నాలుగన్ని — గొర్రెపిల్లనమ్మి కొనిపెట్టింది. నూకాలెప్పుడూ పువ్వుల్లాంటి కోకలు కట్టుకుని తిరిగేది.

పైడమ్మ కూలీ చెయ్యని రోజంటూలేనే లేదు. తల్లీ కూతుళ్లిద్దరూ పొలంలో పాటున్నప్పుడు; పొలాల్లో వ్యవసాయం పనీ, పొలంపాటు లేనప్పుడు; ధాన్యాల దంపుళ్లూ, ఊరగాయ సామాన్ల దంపులకనీ, ఇళ్ళకు శావాకులనీ, ఎల్లలు వెయ్యడం అనీ, ఒక పనేమిటి తల్లీ కూతుళ్ళిద్దరకూ రాని పనేలేదు.

ఇరుగమ్మకూ పొరుగమ్మకూ పైడమ్మలాంటి పనికత్తెను చూస్తే అసూయగా వుండేది. కాని పైడమ్మను చూస్తే అందరికీ

★ కుక్కుటచోరులు ★

కూడలే పైడమ్మను కాదని నిలబడితే ఒక్క రోజయినా బ్రతకగలరా! కూలి దొరుకుతుందా? పైడమ్మ ఆ వీధి కూలీలకు మేస్త్రీ.

మేస్త్రీ కూతురేడుస్తుంది, మేస్త్రీ దీర్ఘాలు తీసి తిడుతుంది. "నా గొంతు కోసేసి పోనారా! నా ఇంటికి నిప్పెట్టేసే పోనారా! నాను బుగ్గయిపోతే సూద్దామనుందట్రా; మీ జిమ్మడి రోగాలు గొట్టుకపోనూ, నీ మాఁద్దిరప్పన్న మిమ్మల్నెట్టుకుపోనూ! మీ సేతులు బుగ్గిలో గలా, వన్నేడిపిస్తారా! వన్నేడిపించి మీకేం వొట్టుకుపోతాఁరా! గండల్లారా!" అని దీర్ఘాలు తీస్తుంది. పైడమ్మ తిట్లస్థాయి హెచ్చింది.

పెదరాజుగారి సావిడి అరుగు దిగి విశ్శన్న, అప్పన్న, సన్యాశి, చిట్టిబాబు చల్లగా జారుకున్నారు. చెరువుగట్టువైపు వెళిపోయేరు. చెరువుగట్టు దిగి తుమ్మచెట్లలో లీనం అయిపోయేరు. వాళ్ళపనే అది! పైడమ్మ ప్రాణంతో సమానంగా పెంచుకుంటున్న కన్నె కోడిపెట్టను వాళ్లు నలుగురూ పొట్టను పెట్టుకుంటారా!

పైడమ్మ గుడిశనిండా మేకపిల్లలకూ, కోళ్లకూ, గొఱ్ఱెలకూ కొదువలేదు. అక్కడే గడపముందు అరుస్తున్న కగరుపెట్టంటే పైడికి ఎక్కడలేని ముక్కువాను. రోజూ ఉదయాన్నే మేదరజాపూ ఎత్తగానే గూట్లోనుండి పైకొచ్చి రెండు రెక్కలూ టపటపలాడించి పరుగు పరుగున వెళ్ళి తన్నాయి వారి ప్రహరీగోడమీదకు ఒక్క ఎగురు ఎగిరి క్రిందకు దూకేది.

ఆ దొడ్లో తిరిగి అక్కడ దివాణం డింకీ పుంజుకి పరువై మూడు పుంజీల గుడ్లు పెట్టింది. అన్నిటినీ అదే పొదిగి పిల్లల్ని చేసింది. కాకికీ గ్రద్దకూ పోనుపోను ఒక్క పెట్టపిల్లమాత్రం మిగిలింది. పుంజు వరిగైతే మంచి పొడుగాటి సోగలతో రంగు రంగుల ఈకలతో చూడ ముచ్చటగా వుండవలసింది. యీ పెట్టపిల్లమాత్రం ఎంత యింపుగా వుండేదనీ. దానికీ చిన్నసోగలొచ్చి చక్కని ఈన్నా, ముక్కుతీరూ వుండి, నిగనిగలాడిపోయేది.

పైడమ్మ పొద్దెళగట్ల చేలోనుండి వస్తూ గంపెన్నులు తురుముకొచ్చేది. గడపలో మేదరజాపూలో కంకి నలుపుతూ దులిపేది. దీపంబుడ్డీ తెచ్చి దగ్గర పెడితే, తల్లిపెట్ట ఆ గుడ్డివెలుగ్లో లుకుక్క, లుకుక్క-లుకుక్క-లుకుక్క మని పిల్లను పిలిచేది. క్కి-క్కి-క్కి-క్కి మని పిల్ల తల్లికాళ్ళక్రింద దూరేది. అప్పుడప్పుడో గింజ పొడవడానికి ప్రయత్నించేది. తల్లిమాత్రం ముక్కుతో టక్-టక్-మని గింజల్ని పొడుచుకుతినేది.

"మేత పిల్లకెట్టక పోతు నాగ నువ్వు మెక్కడానికే వొట్టుకొచ్చినాను!" అని దీపం తీసి ద్వారబంధాన్ని అమర్చిన చెక్కమీద పెట్టి నిశ్చింతగా కూతురు నూకాల్ని చూస్తూ మురిసిపోతూ నిద్రపోయేది.

ఆ పిల్లపెట్ట చక్కగా పెరిగి పెద్దదయింది. ఇంకా గుడ్లు పెట్టడానికి రాలేదుగాని గుండులా వుండేది. కన్నెపెట్ట సోగల డింకీ పుంజుకి పుట్టింది. నడకలోనూ తీరులోనూ పుంజులాగే. ఎప్పుడూ తల్లిపెట్ట నంటిపెట్టుకుని తిరిగేది. ఆ కన్నెకోడిపెట్ట రాత్రి గూటికి రాలేదు. ఏమయిపోయింది! పైడమ్మ దానికోసం ఊరంతా వాడంతా గాలించింది. ఎక్కడా కనుపించలేదు. హఠాత్తుగా మాయం అయిపోయింది. అంగుళే తల్లిపెట్ట అరుస్తూంది పైడమ్మ తిడుతూనే వుంది. తిట్టదూమరి? తిట్టకా, ఏడుచుకోకా ఏంచేస్తుంది; ఆడముండ!

నిన్న అసురసంధ్యవేళ సావిడి అరుగుమీద విశ్శన్న, అప్పన్న, చిట్టిబాబు, సన్యాశి, నలుగురూ కలసి ప్లాను వేసుకున్నారు. గుసగుసలాడుకున్నారు. అప్పన్న దగ్గర గేలాపు రువ్వలున్నాయి గబగబా వెళ్లి తెచ్చేడు. విశ్శన్న స్వయంగా గేలాపు రువ్వకు ఎండు పరిగను తెచ్చి తాడును వ్రేళ్లాడుతున్న ముల్లుకు గుచ్చేడు. ప్రహరీగోడ ప్రక్కను ఎరవేసేడు వరిగపెట్ట గేలాపు ముల్లుతో సహా పరిగను మ్రింగింది. మింగి గిలగిలా తన్నుకుంది. రెక్కలు కొట్టుకుంది. తక్కిన కోళ్ళన్నీ బెదరి గంతులేసేయి.

విశ్శన్న చిటికలో గోడగెంతి వరిగపెట్టను పట్టుకున్నాడు. తూరీగలా పరువెత్తి దూరంగావున్న అంటుమావిడితోటలో సువర్ణరేఖ చెట్టు పలవల్లో ఎవ్వరూ చూడకుండా కట్టిపెట్టేడు.

ఎక్కడ దాచిందీ, తను ఎంత ఘనకార్యం చేసిందీ చెప్పి మిత్రుల్ని మెప్పించేడు.

విశ్శన్న, సన్యాసీ, అప్పన్న, చిట్టిబాబూ కలసి వెన్నెల ముదరగానే తోట చేరుకున్నారు. అప్పుడప్పుడు చిన్న చిన్న మబ్బుతునకలు ఆకాశంలో చంద్రబింబాని కడ్డొస్తున్నా వెన్నెల బాగానేవుంద. దూరంగా గుంటనక్కల అరుపులు తప్ప ఆ రాత్రి అంత బీభత్సంగా లేదు.

కావాల్సిన సామగ్రి యావత్తూ ఇళ్ళదగ్గరనుండి రహస్యంగా ఎవరికీ తెలియకుండా తలా ఒకటి, దొంగతనంగా అక్కడకు చేరవేసేరు. పది గంటలరాత్రి అవనేలేదు. అయినా అంతటా నిర్మానుష్యంగా వుంది.

కన్నెపెట్టను విశ్శన్న విప్పుకొచ్చేడు. నలుగురి చేతుల్లోనూ ఆ కోడిపెట్ట నలిగిపోయింది. కన్నెపెట్ట రూపు కోల్పోయింది. గుండులా తయారయింది గుడ్లు పెట్టవలసినపెట్ట, వరిగపెట్ట, ముచ్చటగా తల్లిచాటున పెరుగుతున్న సోగల కోడిపెట్ట.

నలుగురూ గ్రుడ్డివెన్నెట్లో గుసగుసలాడుకున్నారు ఏకీలు కాకీలు వూడదీసేరు. తెచ్చిన మసాలాసామాను పట్టించేరు. రాళ్ళేరి తెచ్చి పొయ్యిపెట్టేరు. వెన్నెట్లో తళతళా మెరసిపోయే యిత్తడిపాత్రను పొయ్యెక్కించేరు. అగ్గిపెట్టు వూది గోరిడంత అగ్గిని బహ్మాండంగా రాజేసేరు. ఏరి తెచ్చిన ఎండు చితుకులతో పొయ్యి మంటపెట్టేరు. పొయ్యిలో పుల్లలు అంటుకుని సన్నని కొనల్ని విరజిమ్మేయి. విరజిమ్మి కొనల్ని బాగా సాచుకున్నాయి. ఆవెలుగులో వాళ్ళ నలుగురి ముఖాలూ ప్రకాశవంతంగానే వున్నాయి.

పొయ్యిమీద పాత్ర కుతకుతా వుడుకు పట్టింది. పైడమ్మ ఆప్యాయంగా పెంచిన బంగారంలాంటి వరిగపెట్ట ఆ నలుగురి నోళ్ళలోనూ పడిపోయింది. పిప్పి పిప్పిక్రింద నమిలి మ్రింగేరు.

"కారం లావయిందోయ్" అని మనూచికం గంట్లముఖంతో అప్పన్న వొగర్చేడు. నలుగురూ తృప్తిగా చెరువుకి పోయి కాశే కడుపుని నీళ్ళతో నింపుకున్నారు.

పైడమ్మ తిటదూ! నూకా లేవదూ! ఆ కన్నెకోడి నెంతో దోస్తీగా పెంచింది. తన ప్రాణంతో సరిగా చూసుకుంది.

నూకాలు దాఁ! దాఁ! దాఁ! అని పిలుస్తే రెక్కలు టప; టపా మని కొట్టుకుని ఎగిరి గంతేసి వచ్చి తన బుజాలమీద కూర్చునేది. నూకాలదే ఏడవడం. అంతకు ముందెప్పుడూ నవ్వేగాని ఏడ్చి ఎరుగదు. నూకాల్ని చూస్తే ఏడుపుకునే "దొంగలు" నలుగురూ చెరువుగర్భంలోవున్న తుమ్మచెట్ల మరుగున ఇవ్వాళ ముసి ముసినవ్వులు నవ్వుకుంటున్నారు. ఆ నవ్వులో యీ రహస్యం దాగుతుందా? అన్న బితుకు మాత్రం ధ్వనిస్తోంది.

పైడమ్మ తిడుతూనేవుంది.

నూకా లేడుస్తూంది. ★

ఆరిన కుంపటి

పురాణం సూర్యప్రకాశరావు

భళ్లున తెల్లవారింది. అప్పుడే రైలువచ్చి స్టేషన్‌లో ఆగింది బండి దిగిన ప్రయాణీకులతోనూ, వాళ్లకోసం ఒకళ్లని వొకళ్లు తోసుకుంటూ ముందుకువచ్చే బళ్లవాళ్లతోనూ నిండిపోయింది కూడలి.

బైట వీధిలో సందడికి మెలుకువ వచ్చిన గడ్డంతాత లేచి కళ్ళు నులుపుకుంటూ వీధిలోకొచ్చి పంపుదగ్గర ముఖం కడుక్కుని మళ్లీ స్తంభంచాటుకెళ్లి చతికిలబడి ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. అదో చిన్న సత్రవు లాంటిది. గడ్డంతాత నాలుగు రోజుల్నుంచీ అందులోనే పడుకుంటున్నాడు. అంతకు ముందు అయిదురోజులు ఆ పంచనీ ఈ పంచనీ కాలక్షేపం చేశాడు. రోజూ ఎవరో కొత్త వాళ్లు వస్తుంటారు పోతుంటారు. ఈ నాలుగు రోజుల్లోనూ అనేకతరహాల వ్యక్తులు తారసిల్లి వింతవింత విషయాలెన్నో స్ఫురింపచేసి మెరుపులా మాయమయారు. చిలిపికళ్ల పొట్టిపిల్ల రాత్రికిరాత్రి నిద్రలో జేబులో వున్న నాలుగణాలూ కాజేసి తెల్లారేసరికి మాయమయి ఊరుకుంది. మోసగించిందను కోవటానికి అతని మనసు వొప్పుకోవటం లేదు. ఆమనిషి తనకి కలిగించినతృప్తి అటువంటిది. కేవలం కొన్ని గంటలూ, నిముషాల్లో ఆ మనిషిరూపం తన మనోనేత్రంలో ముద్రవేసుకుని శాశ్వతంగా తిష్ఠవేసుకుని కూర్చుంది. ఆ రోజుల్లో తన కర్తవ్యాన్నే మరిపింపచేసిన ఆ చిలిపికళ్లు తన్ని మోసం చేశాయని తెలిసినప్పుడు కోపంకంటె జాలే ఎక్కువగా బాధపెట్టింది. "నాలుగణాలకోసం ఎంతనాటకం ఆడింది! నిజాయితీగా అడిగితే ఇస్తానని—అంత భారీగా, నా దృష్టితో చూడగలగటం అనుకున్నంత సులువు కాదు.. హుఁ! అయినా ఇప్పుడా గొడవెందుకు?"-గడ్డంమనిషి ముఖంలో హాసరేఖలు వికృతంగా మెలికలు తిరిగాయి. లోతుకుపోయిన కళ్లు, నలుపెక్కిన కంటిగూళ్లు, అట్టలుకట్టినజుట్టూ అన్నీ అతని సహజమైన అందాన్ని నాశనంచేశాయి. ఇటీవల మరీ ఇలా మారిపోయాడు కడుపులో ప్రేగులు అరుస్తున్నాయి. వెన్నుపూస తన వ్యక్తిత్వంలాగానే వంగిపోయి పాతికేళ్ళ వయస్సుకు మరో పాతిక సంవత్సరాలుకలిపి పెద్దవాడ్ని చేసింది అందుకనే పిల్లలు కొంతమంది అప్పుడే అతడ్ని "తాతా! తాతా!" అని పిలుస్తూంటారు. కొత్తలో చుర్రుమని అరికాలు మంట నెత్తికెక్కేది.

గడ్డంతాత నెత్తి బరుక్కుంటూ స్తంభానికి చారబడి ఆలోచిస్తున్నాడు. దూరంగా పిల్లలు ఆడుకుంటున్నారు. కంటిముందు కనిపించే ప్రతిప్రాణినీ తనతో పోల్చుకోవటం అతనికి ఇటీవల బాగా అలవాటయిపోయింది. ఆ అలవాటుప్రకారమే ఇప్పుడూ ఆ పిల్లలతో తన్ని పోల్చుకుంటున్నాడు: "వాళ్లకీతనకీమల్లేనే ఆకలి ఉంటుంది. వాళ్ళకీ సమస్యలుంటాయి. అయితే ఏ సమస్యకీ ఎక్కువసేపు వాళ్ళని బాధపెట్టగల శక్తిలేదు. చంచలమైన మనస్సులు. తను?..." అతను నవ్వుకున్నాడు. ఆ నవ్వు నవ్వులామటుకు లేదు.

సాయంత్రం పార్కులో కూర్చున్నప్పుడు కూడా నెత్తిమీంచి అరుచుకుంటూ ఎగిరిపోయే రకరకాల పక్షుల్ని ఇలాగే తనతో పోల్చుకుంటూంటాడు. ఈ సృష్టిలో తనుతప్ప అంతా సుఖపడుతున్నట్టే భావిస్తూంటాడు. ఇలా భావిస్తున్నప్పుడు మనసులో ఏదోకసిగా, క్రోధంగా ఉన్నట్టు ఫీలవుతూంటాడు. ఎవరిమీద? ఏమో? అతనికే స్పష్టంగా తెలియదు. వీధినపడితే ఎక్కేగుమ్మం, దిగేగుమ్మం, విసుగూ విరామంలేకుండా రాత్రి పదింటిదాకా తిరిగి తిరిగి ఆ సత్రవుకు చేరుకుంటాడు. కడుపునిండా మంచినీళ్లు తాగి నిద్రకి జారుకుంటే రాత్రి అడపా దడపా క్షుద్బాధకి మెలుకువ వచ్చేస్తూంటుంది. అలాగే మూలుగుతూ ముక్కుతూ ఈ పదిరోజులూ ఎలాగో గడిపేశాడు. ఇన్నాళ్ళూ బొత్తిగా నిరాహారంగా గడపకపోయినా మొత్తానికి ఈ పద్ధతిని ఇంకో నాలుగురోజులు సాగితే ఈ ప్రమిదలో చమురు హరించుకుపోయి దీపం ఆరిపోతుం దనటానికి ఏమీ సందేహం లేదు. బ్రతుకుమీద మమత, కోరికలు సిద్ధించాలనే అభిలాష అతనిలో ఏమాత్రం చావలేదు.

"నాయనా నువ్వెవరవు?" అని అతన్ని ఎవరూ పలకరించరు. ఎవరికీ పలకరించ బుద్ధిపుట్టదు. "తనతో వాళ్ళకి ఏం పనుంటుంది గనక పలకరించటానికి?" అనుకుని మొదట మొదట సర్దుకోబోయినా ఇటీవల అందరూ తనవైపు అదోమాదిరిగా పిచ్చివాడి వైపు చూస్తున్నట్టుగా చూస్తూండటంబట్టి వీళ్లందరికీ తనంటే ఓవిధమైన సానుభూతి (ఆ సానుభూతి తన కేవిధంగానూ ఉపయోగించక పోయినా) తప్పించి ఒక మామూలు మనిషి కిచ్చే గౌరవం తన కివ్వటం లేదని అతను గ్రహించాడు. అతని మనస్సు చివుక్కుమన్నా ఆ తలంపు అతని హృదయాన్ని శాశ్వతంగా అంటిపెట్టుకొని బాధించలేదు. ఉన్నట్టుండి అతడి దృష్టి తన తల్లి దండ్రులవైపుకు మళ్లింది. అతని కళ్లు చెమ్మగిల్లాయి. పాతికేళ్లు నెత్తిమీదికొచ్చి ఇన్నాళ్ళూ వాళ్ళరెక్కల కష్టం తింటూకూర్చుంటే తన కర్తవ్యం, తన బాధ్యత తను నెరవేర్చుకోవాలనే పట్టుదల రేకెత్తించాడు తండ్రి. తండ్రి ఎగిరిపడి ఇంట్లోంచి పొమ్మంటే తల్లి అడ్డుపడినా (తన కింకా ఆత్మాభిమానం చావని రోజులు) చరచరా వీధిలోకి నడిచాడు. దగ్గిర కొంతపైకం ఉన్నా టిక్కెట్ లేకుండా రైలెక్కి వాళ్లెక్కడ దింపితే అక్కడ దిగి మళ్లీ మరోబండి ఎక్కి అలా వందమైళ్ళు ప్రయాణంచేసి ఈ ఊరులో అడుగుపెట్టాడు. ఈ ఊరు తనకి ఆశ్రయమిస్తుందనే నమ్మకం కలిగింది. వచ్చి పదిరోజు లయింది. అనుకున్నట్టుగా యేదీ జరుగలేదు. అయినా ఇంకో నాలుగురోజులు ఓపికపడదామని మనసులో ఉంది. కాని... ఆకలి...ప్రేగులు తెగిపోయే బాధ!... మొదట్లో కేవలం తండ్రిమాటలకు కోపం వచ్చి, పౌరుషం వచ్చి పారిపోయినా చివరికది పట్టుదలగా పరిణమించి ఉద్యోగం చెయ్యటం తనధర్మం, కర్తవ్యం అనేభావనలోకి వచ్చాడు. అందుకనే తండ్రంటే ఇప్పుడంత కోపంలేదు కాని పట్టుదల! తల్లి ముఖం మనస్సులో మెదిలితే హృదయం కరిగిపోతుంది. కాని పట్టుదల!

ఇలా పారిపోయి రావటానికి మరో దిలాసా అతన్ని ఇలా ప్రోత్సహించింది. ఇన్నాళ్ళూ తిని తిరిగి వేళకి గూటికి

★ ఆరిన కుంపటి ★

చేరుకునే పద్ధతి అతని మెదడున్ని బాగా తుప్పుపట్టించేసింది. ఈ ప్రపంచంలో ఏమూల ఏమిజరుగుతూందో ఈ ప్రజలమధ్య సమస్యలేమిటో, బ్రతకటమంటే ఏమిటో, అతని కంతవరకూ ఏమీపట్టలేదు. "హు! ఇంత విశాలమైన ప్రపంచంలో నాఒక్క పొట్టకి ఇంత అన్నం దొరకదా?" అనే బిలాసా అతన్ని వెనకచూపూ, ముందు చూపూలేకుండా ఆ అర్ధరాత్రి ముసురులో ఈదురుగాలిలో బండెక్కించింది. తను వెళ్లటంయేవిటి పట్నంలో ఏదోపనిలో ప్రవేశించి హాయిగా కాలుమీద కాలు వేసుకుని గడిచిపోయిన రోజులకంటె హాయిగా గడపవచ్చని అతను ఊహించాడు. "మొదటి నెలజీతం రాగానే కొంత తండ్రిపేర మనియార్డర్ చేస్తాను. క్రింద రాస్తాను. "నేనంత అసమర్థుణ్ని కానని ఋజువు చేసుకున్నాను" అని. తండ్రి నివ్వెరబోతాడు. క్షమాపణ చెప్పుకుంటూ జాబురాస్తాడు. అప్పుడు తను కనికరించి వాళ్లనికూడా తీసుకొచ్చి తన దగ్గరే పెట్టుకుంటాడు..." ఇలా సాగిపోయాయి అతని ఆలోచనలు రైల్లో కూర్చున్నంతసేపూను. ఈ ప్రపంచంలో బ్రతకగలగటం అన్నది కేవలం తన అసమర్థత, సమర్థతలకి సంబంధించినదే అనుకున్న అతను యీ అభిప్రాయం తప్పని తెలుసుకోవటానికి యెక్కువకాలం పట్టలేదు. ఉదాహరణకు తను చదవగలడు రాయగలడు. అయినా తనకి ఏ ఆఫీసులోనూ ఉద్యోగం దొరకలేదు. శారీరకంగా యెంతటి కష్టమైనా సునాయాసంగా నిర్వహించగలడు. ఐనా ఏ ఫ్యాక్టరీలోనూ తనకు పని దొరకలేదు. ఇవన్నీ తనఅభిప్రాయాన్ని నిర్దాక్షిణ్యంగా ఖండిస్తున్నాయి. మొదట్లో అంటే వచ్చిన కొత్తలో నోరుతెరచి "ఏదైనా ఉద్యోగం ఉంటే యిప్పిస్తారా" అని అడగటానికి కూడా అభిమానపడ్డాడు. "ఏమైనా ఖాళీ లున్నాయా?" అని ఘరానాగా అడిగాడు. అధికారి కస్సుమనిలేచి బయటికి పొమ్మన్నాడు. అతనిమనసులో తండ్రి బింబం చెరిగిపోయి ఆ స్థానాన్ని యీ అధికారి ఆక్రమించాడు. "తను యెప్పుడో వొకప్పుడు బుద్ధిచెప్పాల్సిన మనుష్యుల్లో ఇతను రెండవవాడు" అని కసిగా అనుకున్నాడు మనసులో. ఓరగా అతని వైపుచూస్తూ ఇవతలికి వచ్చాడు. ఇది అతని ఉద్యోగాన్వేషణలో మొదటిఘట్టం. ఈ అనుభవాన్ని ఆధారంచేసుకుని అతను ముందు జరగబోయేదాన్ని అంచనా వెయ్యలేకపోయాడు. ఆ తర్వాత నాలుగయిదు రోజుల్లో ఇటువంటి అనుభవాలు ఎన్నో జరిగాయి. జేబులో పైకంకూడా ఖాళీ అయిపోగానే ప్రపంచంగురించి రెండోవైపునించి ఆలోచించటం మొదలుపెట్టాడు. తండ్రిమాటల్ని మనసుకు పట్టించుకోక ఆ యింట్లోనే, వాళ్ళమధ్యనే ఉండిఉంటే తెలుసుకోలేనంతటి బ్రహ్మాండమైన ప్రపంచజ్ఞానాన్ని ఈ వారం రోజుల్లోనూ అతను సేకరించుకున్నాడు. ఇప్పుడతని మనసులో తండ్రిగాని, కస్సుమని ఎగిరిపడిన అధికారిగాని ఎవరూ లేరు. వారిద్దరిస్థానే ఇప్పుడు భయం ఆక్రమించింది. గుండెల్ని నమిలి మింగే భయం! తర్వాత తర్వాతబాధ ఆక్రమించింది. బాధ! క్షుద్బాధ! కండలుతిరిగిన దండలతో, కోరమీసంతో, నునుపుతేరిన శరీరాన్ని పీల్చి పిప్పిచేసి ఎండబెట్టిన ఒరుగులా చేసిన క్షుద్బాధ! ఆ తర్వాత ఆత్మాభిమానమే ఆహారంగా ఎంతకాలమో గడపలేకపోయాడు. కొద్దిరోజుల్లో అది కాస్తా ఖర్చయిపోయింది. చివరికి ఆత్మాభిమానం చంపుకోవటంవల్లకూడా ఏమంత ప్రయోజనం కనిపించలేదు. నోరుతెరిచి చెయ్యి చాపితే పెట్టేదాత కనిపించలా! ఏధి అరుగుమీద కూర్చుని అడుక్కునే కుంటి తాతయ్యని కసిరికొట్టినఘట్టాలు జ్ఞప్తికొచ్చాయి. ఏడవలేక నవ్వుకున్నాడతను. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లోనే "పోనీ ఇంటికి పోతేనో" అని మనస్సు వెక్కిరించింది. కాని ఎవరో వెన్ను తట్టి చెప్పినట్టుగా తనకుటుంబ తనకే ఆ పని సబబుగా తోచలేదు. "అక్కడకుటుంబ యేముంది తినటానికి? తను బాగుపడాలి. అంటే సంపాదించాలి. అదీ తన ధర్మం! తల్లిదండ్రుల్ని పోషించేశక్తిగలవాడుగా కాకపోయినా తన పొట్ట తను పోషించుకోగలిగి వుండాలి.

"గడ్డంతాత" అని అతనికి వోచిన్న పిల్లవాడు పేరుపెట్టాడు. వాడల్లాగే తన్ని పిలుస్తుంటాడు. వాడ్ని బట్టి అందరూను. మిగతాపిల్లలు వాడల్లా పిలుస్తుంటే కిలకిలా నవ్వుతూంటారు. అతనూ నవ్వుతూంటాడు గడ్డం సవరించుకుంటూను. వాళ్లతో గడిపే ఆకాసేపూ ఏ చీకూ చింతా లేకుండా వుంటుంది. తలుపులన్నీ బంధించబడి చీకటిగుయ్యారంగా వున్న అతని హృదయ మందిరంలోకి యీ పిల్లలు కిటికీ రెక్కలు కొద్దిగా తెరిచి సన్నని వెలుగు జీర ప్రసరింపచేశారు. మళ్లీ టప్పున ఆ కిటికీరెక్కలు మూసి మెరుపులా పిల్లలు మాయమైపోతుంటారు. చీకటి ఆకాస్త వెలుతురునూ కబళించి యెప్పటిమాదిరిగా రాజ్యంచేస్తుంది. సముద్రానికికూడా అవతలిగట్టు అంటూ ఉండకుండావుంటుందా? కాకపోతే మనకంటికి కనిపించనంతటి దూరంలో వుంటుంది. అలాగే యీ అన్వేషణ అనంతమైనదికాదేమో. అని ఆశగా అనుకుంటాడు అతను. నిజానికి ఆశ లేకపోతే జీవితం ఏముంది? కష్టపడ్డా సుఖపడ్డా దానికి కారణభూతం ఆశ.

ఆ ఉదయమే గడ్డాలతాత మరో కొత్త సహచరుని సంపాదించాడు. అతనొక్కడే తన్ని ఇన్నాళ్లకి "నువ్వెవరవు?" అని అడిగినవాడు. ప్రాణం లేచివొచ్చినట్టయింది తనకి.

"నీ పేరు?"-ఇది ఆ కొత్తవ్యక్తి వేసిన రెండో ప్రశ్న.

గడ్డాలతాత తన చరిత్రనంతా పూసగుచ్చినట్టుగా అతని చెవినివేశాడు. విని అతను జాలిపడ్డట్టుగా కనిపించలేదు. "ఒకే తరగతికి చెందినవాళ్ళం తమాషాగా కలిశాం" అన్నాడతను.

"అంటే?" అయోమయంగా ప్రశ్నించాడు గడ్డాలతాత.

"నా ధ్యేయంకూడా అదే."

అమాంతం రెండుచేతులూ అతని చుట్టూ వేసి కౌగలించుకున్నాడు గడ్డాలతాత. తన్ని నోరువిప్పి ఆప్యాయంగా పలకరించే మనిషికోసం ముఖం వాచిపోయిన గడ్డాలతాత ఆ కాసేపూ అన్ని సమస్యలూ మర్చిపోగలిగాడు. చిన్నపిల్లల సమక్షంలో తను పొందగలిగిన సంతృప్తి, విశ్రాంతి ఇప్పుడు మళ్లీ పొందగలిగాడు. ఆత్మీయుడు ముందు కూర్చున్నట్టుగా అనిపించింది. "నువ్వెవరవు? నీ పేరేమిటి?" అని అడిగాడు గడ్డంతాత.

ఈ ఇద్దర్నీ వింతగా చూస్తూ నిలబడ్డ చిన్న కుర్రాడొకడు వెకిలిగా నవ్వుతూ "పిల్లికళ్ల బూచి" అంటూ పారిపోయాడు.

ఆ కొత్తమనిషికి కోపంవచ్చి చర్రుమని లేచాడు. గడ్డాలతాత అతన్ని వారించి "వాళ్ళే నాకు గడ్డాలతాత అని పేరు పెట్టారు. మొదట్లో నీకుమల్లేనే నాకూ కోపంవచ్చింది. కాని రానురాను వాళ్ళే నాకు ఆప్తులయారు. పసిపిల్లలు" అన్నాడు.

అలాగా అన్నట్టుగా పిల్లికళ్ళబూచి గడ్డంతాత ముఖంలోకి చూసి అంతకోపం దిగమింగుకుని నవ్వేశాడు. "నా పేరు...ఏదైతేనేం లే! వాళ్లు పెట్టారుగా. 'పిల్లికళ్లబూచి' అని. అలాగే పిలు" అంటూ ఆ నవ్వు పాకి

గించాడు. గడ్డాల తాత ఆ నవ్వుతో శృతి కలిపాడు.

ఆ రెండు కంఠాలూ నవ్వుకు మోహం వాచిపోయినట్టుగా నాలుగు గోడలూ ప్రతి ధ్వనించేలా పగలబడ్డాయి.

"నీ దే వూరు?" గడ్డంతాత ప్రశ్నించాడు.

"అబ్బో చాలాదూరం."

"ఇంతదూరం దేనికొచ్చినట్టు?"

బూచి నవ్వుతూ పొట్టకొట్టుకున్నాడు.

అర్థం అయిందన్నట్టుగా తలూగించాడు గడ్డం తాత.

"అయితే ఎక్కడన్నా దొరికిందా ఉద్యోగం?" గడ్డంతాత ప్రశ్నించాడు.

"లేదు"- ఆ కంఠస్వరంలో ఏదో కసీ, కోపం ధ్వనించాయి.

"ఏం చేద్దాం అనుకుంటున్నావు?"

"నువ్వేం చేద్దాం అనుకుంటున్నావు?"

గడ్డాలతాత కన్నీరు ఆపుకుందామని చేసిన ప్రయత్నాలు వ్యర్థమైపోయాయి. భావురుమని రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడ్చాడు. అంతలో నవ్వు! అంతలో ఏడ్పు! బూచీ కొంత కంగారుపడ్డాడు. "ఏడవకు! ప్రయత్నిద్దాం. దొరక్కపోతుందా" అంటూ ఓదార్చాడు.

"మా అమ్మా నాన్నా అందర్నీ వదిలేసి వచ్చాను. ముందూ వెనకా దారి కొనరావటం లేదు" అంటూ మళ్లీ రాగాలుతీశాడు గడ్డాల తాత.

"నేనూ అంతే."

"ఆ! నువ్వూ మీ అమ్మా నాన్నా వాళ్లని వదిలేసి వచ్చావా?" అని ఆశ్చర్యముగా అడిగాడు గడ్డాలతాత.

"తల్లీ తండ్రీ లేరుగాని భార్యా పిల్లలూ ఉన్నారు."

"ఎలాగైతే నేం. అయితే వాళ్లనెందుకు వదిలేసి వచ్చావు?"

"నేను వట్టి అసమర్థుణ్నని నా భార్య అభిప్రాయపడింది. ఓ రాత్రిపూట పిల్లల్ని తీసుకుని పారిపోయింది. చుట్టుపక్కల ఊళ్లన్నీ గాలించాను. ప్రయోజనం లేకపోయింది. ఇలా వచ్చేశాను."

గడ్డాల తాత నవ్వాడు. "నువ్వు జరిగిందంతా పూర్తిగా చెప్పటంలేదు. కొంత దాస్తున్నావు కదూ?" అన్నాడు.

బూచి ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూశాడు.

"నీ సమర్థతని ఋజువు చేసుకుందుకోసమని ఆమెని చిత్తుగా తన్నివుంటావు. అందుకే ఆమె పారిపోయి ఉంటుంది. అంతేనా?"- గడ్డాల తాత ప్రశ్నార్థకంగా అతని ముఖంలోకి చూశాడు.

బూచీముఖం ఎఱ్ఱబడింది. తర్వాత తెప్పరిల్లి "నీ కెలా తెలుసు?" అని అడిగాడు.

గడ్డాలతాత భయంకరంగా నవ్వాడు. ఆ నవ్వు పాడిగిస్తూనే "అమాత్రం ఊహించలేనూ. నీ చెప్పే తీరే చెబుతోంది" అన్నాడు.

"నువ్వు చాలా తెలివైనవాడివిలా గున్నావు. ఇట్టే గ్రహించేశావు. నువ్వు చెప్పింది నిజమే. కొట్టాను. అందుకే పారిపోయింది. ఎలాగున్నారో? ఎక్కడున్నారో?"

"పోనీలే బూచీ బాధపడకు. ఎప్పుడో ఒకప్పుడు మీరంతా కలుసుకుంటారు. నాకా నమ్మకం ఉంది" అంటూ ఓదార్చాడు గడ్డాలతాత.

"హు! ఒకచోట కలవటం" అంటూ నిరాశగా మూలిగాడు బూచీ.

అప్పటికే ఎంత బాగా వడిలిపోయింది కొచ్చింది ఇద్దరికడుపులో ప్రేగులూ అరుపులు మొదలు పెట్టాయి ఒకళ్లని వొకళ్లు వోదార్చుకుంటూ ఒకళ్ల భవిష్యత్తు గురించి వొకళ్లు హామీలు యిచ్చుకుంటూ, జోస్యాలు చెప్పుకుంటూ గతంగురించి మర్చిపోవటానికి ప్రయత్నిస్తూ మధ్యాహ్నం మూడింటివరకు గడిపేశారు. "నేనలా వెళ్లొస్తాను" అంటూ బూచీ లేచాడు. గడ్డాలతాతకి సందేహం పట్టుకుంది. కొద్దిక్షణాల్లో అది ఆశగా మారింది. 'నేనూ రానా నీతో' అందాం అనుకున్నాడు. కానీ అనలేకపోయాడు. బూచీ భోజనానికి వెళుతున్నాడనీ, అతనికెక్కడో ఆ అధారం దొరికివుంటుందనీ,

గడ్డాలతాత ఊహ. అతనితో వెళ్లితే తనకి కూడా యింత అన్నం దొరుకుతుందేమోనని ఆశ. అయినా యింత ఆప్యాయంగా మాటలాడినవాడు తన్నికూడా రమ్మనమని పిలవకూడదూ?" అని కోపంకూడా వచ్చిందతనికి. గుమ్మందాకా వెళ్లిన బూచీ తిరిగి వెనక్కి వచ్చి "ఇంకో గంటలో వస్తాను. ఇక్కడే ఉంటావా?" అని ప్రశ్నించాడు.

మనస్సులో ఎటూ తెగని ఆలోచనలని పుటుక్కున తెంచేసి "నేనూ నీతో వస్తాను పద" అన్నాడు గడ్డాలతాత. అందుకు సమ్మతి అంతసులువుగా వస్తుందని అనుకోని గడ్డాలతాత ఆనందాతిశయంతో అతన్ని అనుసరించాడు. నిన్న వుదయం అనగా తిన్న తిండి. కడుపు రాసుకుంటూ ఇటూ అటూ వెర్రిగా చూస్తూ బూచీవెంట నడవసాగాడు. బూచీమటుకు నిశ్చలమైన దృక్కులతో ఎదురుచూపుతోనే నడుస్తున్నాడు.

"అబ్బ పాదాలు కాల్తున్నాయి బూచీ" అన్నాడు గడ్డాలతాత.

"ఇంకా అలవాటు పడలా?" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

"నిన్ననే జోడు పూర్తిగా తుక్కు తుక్కయిపోయింది. కాలవలో పారేశాను. అరికాళ్లు బొబ్బలెక్కుతున్నాయి."

"నాకా బాధలేదు. నా అరికాళ్లు కాయలు కాచిపోయాయి. ఎంత ఎండలో అయినా నడవగల్ను. నాలుగు రోజులుపోతే నీకూ అంతేలే అలవాటయి పోతుంది" అన్నాడు బూచీ ఓదారుస్తున్నట్టుగా.

ఇద్దరూకలిసి చాలాదూరం నడిచారు. మెయిన్‌రోడ్డుమీద జనసందడి అంతగా లేదు. ఎండ నడినెత్తిమీద సుత్తిపెట్టి కొట్టినట్టుగా బాధ పెడుతోంది. ఆశాపాశం ఆ యిద్దర్నీ బంధించి తీసుకుపోతోంది. "కడుపు కింత తిండిపడితే చాలు" అనుకుంటున్నాడు గడ్డంతాత. పైకి తెగించి అడగలేకపోతున్నాడు. అందులో సందేహం లేదు. అతను వెళ్ళేది అందుకోసమేనని తనకి గట్టినమ్మకం 'అయినా కదిపిచూద్దాం' అనుకుని "అయితే బూచీ నువ్వు అన్నం తిన్నావా?" అని లౌక్యంగా అడిగాడు.

"ఇంతవరకూ తినలేదు" అని సమాధానం వచ్చింది.

"ఇకముందు తింటాడన్నమాట" అనుకున్నాడు గడ్డంతాత అతనన్నమాటని తనకు అనుకూలంగా అన్వయించుకుని. తనూ వెళ్లటంవల్ల అతని వాటా తగ్గిపోతుందేమో అనైనా లేకుండా బూచీ తన్ని వెంటబెట్టుకుని వెళుతున్నాడంటే ఈ ఒక్క నిదర్శనాన్నిబట్టి అతని స్వభావాన్ని అర్థంచేసుకోవచ్చు అనుకున్నాడు గడ్డంతాత. "బూచీ స్వార్థపరుడు కాడు. మహా త్యాగగుణం కలవాడు." ఇలా అతనిగురించి కొన్ని అభిప్రాయాలు స్థిరపడిపోయాయి అతనిమీద అనిర్వచనీయమైన అభిమానం అల్లుకుంటోంది మనసులో. "బూచీ నీ స్నేహం నాకు లభించటం నా అదృష్టంసుమా" అన్నాడు గడ్డాలతాత.

"ఏం? ఏమిటా అదృష్టం?"


"నువ్వు చాలా మంచివాడివి కనుక."

"నా మంచితనం ఏంచూశావు?"

"నువ్విలా ప్రశ్నిస్తే కచ్చితంగా జవాబు చెప్పలేను. నిన్ను చూసిన మొదటిక్షణంలో అలా అనుకున్నాను. ఎందుకూ అంటే సమాధానం స్పష్టంగా చెప్పలేను" అన్నాడు సాగుతున్నట్టు కనిపించకుండా.

ఇద్దరూ మెయిన్ రోడ్డులోంచి సందులోకి మళ్ళారు. ఆ సందులోంచి మరో సందులోకి మళ్లారు. ఇరుకుసందు. గాలీ వెలుతురూ చొరని ఆ ప్రదేశం అంతా నోమలమయం. పాడు దుర్వాసన ప్రక్కనే ఉన్న మురుగుకాలవ పొంగి రోడ్డుమీదికి పొర్లుతోంది. చెత్తబుట్టలోంచి చెత్తంతా కెలికి నానా చీదరగానూ వీధంతా చిమ్మేస్తున్నాయి కుక్కలు. ఇద్దరు ముసలమ్మలు జుట్టు బరుక్కుంటూ గుమ్మంలో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు బూచీ వాళ్లని తప్పుకుని లోపలికి నడిచాడు. గడ్డంతాత అతన్ని అనుసరించాడు. "నువ్విక్కడ కూర్చో. ఇప్పుడే వచ్చేస్తా" అంటూ బూచీ లోపలికి వెళ్లాడు.

గడ్డంతాతకి మరో గట్టిచిక్కు వచ్చిపడింది. "తన్నిక్కడ కూచోమని వీడు లోపలికెళ్లి మెక్కుతాడు కాబోలు" అనే అనుమానం పట్టుకుంది. ఎలా తను అతన్ని అనుసరించటం? అరె! అతను వెళ్ళిపోయాడే లోపలికి! మంచివాడు మంచివాడనుకుంటే ఇదన్నమాట వాడు చేసేపని. ఇంత స్నేహముగావుండి తోడిమిత్రుడికి తను తినే అన్న



శృంగేరి విద్యాశంకర మందిరం

ములో యింతపడేస్తే ఏం పోయింది. ఆమాత్రం ఔదార్యం చూపించటం అతని ధర్మం కాదూ?" – గడ్డంతాత నేలమీద చతికిలపడి నాలిక చప్పరించుకుంటూ బూచీ వెళ్ళినవైపు చూస్తూ కూర్చుండిపోయాడు. "లోపల కడుపునిండా తింటూంటాడు! హు! తను కడుపులో మాడుతూంటే బాగా యిక్కడ కూర్చున్నాడు. ఇక సహించలేకపోయాడు గడ్డంతాత. ఒక్క ఊపున లేచి ఇంట్లోకి చొరబడి గదిలోకి చూచాడు గుమ్మంలో నిలబడి. కంటిముందు కనిపిస్తున్న దృశ్యం అతన్ని నిలువునా కృంగదీసి ఆశాభంగం చేసింది. సిగ్గుతో తలవంచుకుని అలాగే నిలబడిపోయాడు. బూచీ విస్తరాకు ముందు కూచుని చేతిలో అన్నం ముద్దతో ఉంటాడని ఊహించిన గడ్డంతాత ఆ చేతుల్లో ఒక లావుపాటివ్యక్తి పాదాల్ని మటుకు చూడగలిగాడు. బూచీ ఏదో ప్రాధేయపడుతున్నాడు. ఆ లావుపాటి వ్యక్తి ముఖం చిట్లించుకుని "లాభం లేదు! వెళ్లు వెళ్లు!" అంటున్నాడు.

క్షణం అలా నిశ్చేష్టుడై నిలబడి తర్వాత వెనక్కి తిరిగి వచ్చేశాడు గడ్డంతాత. నేరుగా రోడ్డుమీదికి వచ్చి నిలబడ్డాడు. పశ్చాత్తాపంతో అతను కృంగిపోతున్నాడు. మరో నిముషంలో తలవంచుకుని దిగులుగా బయటికి వచ్చాడు బూచీ. అతన్ని పలకరించటానికి కూడా ఏదో తప్పు చేసినవాడిలా గడ్డం తాత మనసు ఒప్పటం లేదు.

"వారం రోజుల్నుంచి తిరుగుతున్నాను. కొట్లో పనిప్పిస్తానని ఆశపెట్టి ఆశపెట్టి ఇప్పుడు ఎవరికో ఇప్పించేశాట్ట. చూడు ఎంత అన్యాయంగా ఉందో. నాకడుపు తరుక్కుపోతోంది" అన్నాడు బూచీ కళ్లు తుడుచుకుంటూ. గడ్డంతాత మనసులో బాధ రెట్టింపయింది. ఓపక్క కడుపులో ఆకలిబాధ! మరో చెంప నిష్కృతి మనిషిని రెండువైపుల్నుంచీ అంటిస్తున్నాయి.

"అయితే ఉద్యోగంకోసమా ఇక్కడికి వచ్చింది?" అడిగాడు గడ్డం తాత.

అవునన్నట్టుగా తలూపాడు బూచీ.

గడ్డంతాత ఇంకేదో అడగాలనుకుంటూంటే బూచీ పక్కకి తప్పుకుని దూరంగా గోడవారనున్న పంపువైపుకి చరచరా నడిచాడు. వెనక్కి తిరిగి "దా. కాసిని మంచినీళ్లు తాగుదాం" అని గడ్డం తాతని కూడా పిలిచాడు. గడ్డం తాత అతని వెనకాలే నడిచాడు. ఏవేవో ఊహిస్తాం! ఏవో జరుగుతూంటాయి. ఈ భంగపాటు ఒక్కొక్కప్పుడు మనిషిని అంటిపెట్టుకుని దహించివేస్తుంది. మరొకప్పుడు వాటిని లక్ష్యపెట్టకుండా అంటీ అంటనట్టుగా నిబ్బరంగా మసులుకుంటాం.

ఆ ఇద్దరూ ఆరోజల్లా కలిసి మెలిసి గడిపేశారు. సాయంత్రం చీకటిపడే వేళకి బూచీ లేచి "వెళ్తున్నాను. మళ్ళీ రెండు రోజులుపోయింతర్వాత కన్పిస్తాను. ఇక్కడే ఉంటావుగా" అంటూ చేత్తో నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు.

గడ్డం తాతకి గుండెల్లో రాయిపడినట్టయింది. "వెళ్లిపోతావా?" అన్నాడు దిగులుగా. అతను ఏ కారణంవల్లనైనా యీ ప్రయాణం ఆపుకున్నట్లయితే అతను తనకి చేయగలిగినంత ఉపకారం చేసినట్టుగా భావించి, తృప్తిపడి, అందుకు తను కృతజ్ఞుడై ఉండగలడు. కాని బూచీ అగేట్టుగా లేడు. ప్రవాహవేగంలో దారీతెన్నూ లేకుండా కొట్టుకుపోతున్న తనకి తినేకాకుండా ఆ ప్రవాహ వేగంలో కొట్టుకుపోతున్న మరో మనిషిని నేనున్నానంటూ బూచీ తనలో కొంత ధైర్యాన్ని చొప్పించి మరుక్షణంలో అంతూ పంతూ లేకుండా తన్ని ఒంటరిగా వదిలేసి మాయమైపోతున్నాడు. "అయినా మళ్లీ వస్తానంటున్నాడుగా" అనుకుని సర్దుకున్నాడు.

బూచీని వీధివరకూ సాగనంపి రెండు రోజులు పోయింతర్వాత మళ్లీ కనిపించటానికి హామీ తీసుకుని వదలలేక వదలలేక వెనక్కి తిరిగి వచ్చాడు గడ్డం తాత.

కనుచూపుమేరవరకూ పరిసరాలన్నీ అందమైన దృశ్యాన్ని చూసి ఆనందించగలిగే మనసులకి ఉల్లాసం కలిగిస్తున్నాయి. గడ్డం తాత మటుకు వెనక్కి తిరిగి సంధ్యాఛాయల్ని చీల్చుకుంటూ వెళ్ళిపోయే బూచీ వైపే చూస్తూండిపోయాడు. బూచీ మసక చీకటిలో కలిసిపోగానే లోపలికి వచ్చి స్తంభానికి చారబడి కడుపు రాసుకుంటూ కూర్చుండిపోయాడు. అప్పుడిక కడుపులో కావన్న గంతులు యెక్కువయాయి అంతవరకూ బూచీ సమక్షంలో ఎక్కడో దాక్కున్న ఆకలి ఇప్పుడు దాని శక్తినంతా కూడగట్టుకుని విజృంభించింది. అలా యెంతసేపో కూచోలేకపోయాడు. లేచి మళ్లీ వీధిలో పడ్డాడు. సందులూ గొందులూ తిరిగి తిరిగి చివరికి కాళ్లల్లో సత్తువ తగ్గి నేలకూలే పరిస్థితిలో ఓ అమ్మ దయతలచి ఇంత అన్నం పడేసి ప్రాణదానం చేసి తలుపేసుకుని లోపలికి పోయింది. అలా నిలబడే ఆత్రంగా కుక్కుకుని కడుపులో మిగత ఖాళీని మంచినీళ్లతో నింపి తీరిగా నవ్వుకుంటూ, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ తన స్థావరానికి తిరిగివచ్చాడు గడ్డంతాత. మళ్లీ మొర్నాడు సాయంత్రంవరకూ ఆ బాధ ఉండదు. సాయంత్రం ఏడు గంటల్నుంచి రాత్రి ఎనిమిదింటివరకూ ఆకలిగురించి ఆలోచించిన మనిషి ఇప్పుడు మళ్లీ ప్రపంచంగురించిన ఆలోచనల్లో పడ్డాడు. బూచీ గురించి కొంతసేపు ఆలోచించాడు.

రాత్రి బాగా పొద్దుపోయింది. మోచేయి మీద తలఆన్చి పడుకున్న గడ్డంతాత నిద్రకి జారుకున్నాడు. మూతి నాక్కుంటూ, ఒళ్లు గోరుక్కుంటూ లోపలికివచ్చిన ఊరకుక్క అతనిపక్కనే వచ్చి పడుకుని దాని పనిలో అది మగ్నురాలైపోయింది. దూరంగా వినిపించే కుక్క మొరుగుల్నీ, ఉండి వుండి వినిపించే చిన్న చిన్న ధ్వనుల్నీ మధ్య మధ్య చెవులు రిక్కించి ఆలకిస్తోంది. పాఠాలురాని ముద్దబ్బాయిలా నోటికి తాళం వేసుకుని నిశ్శబ్దత వహించింది రాత్రి.

మర్నాడు ఉదయం ఎనిమిదింటికి గడ్డం తాత ఉద్యోగాన్వేషణలో ఊరిలో చాలా భాగం చుట్టేశాడు. తిరిగి తిరిగి ఒంటెన దగ్గర కొచ్చేసరికి అక్కడికి కొద్దిదూరంలో పెద్ద పెద్ద గొట్టాలూ, వాటిల్లోంచి సుళ్లు తిరుగుతూ మేఘాలు మేఘాలుగా ఆకాశంలోకి

కలిసిపోతున్న పొగ కనిపించి ముందుకు వేసిన అడుగు వెనక్కి తీసి అటువైపుగా నడిచాడు.

అది పెద్ద ఫ్యాక్టరీ! ఆ నీ ఊరువచ్చి పది రోజులైనా ఈ ప్రాంతానికి రావటం ఇదె మొదటిసారి. గొప్పుకుంటూ సైకిల్ రిక్షా తొక్కుతున్న వాడ్ని ఆపి అదేమిటని అడిగాడు.

"సిమెంటు ఫ్యాక్టరీ. సిమెంటు తయారు చేస్తారక్కడ" అంటూ వాడు మళ్ళీ తన పాదాలను వలయాకారంలో తిప్పుతూ

లేస్తూ కూచుంటూ తన శక్తినంతా కాళ్లలో కేంద్రీకరించి ఎగువకి పోయాడు.

గడ్డంతాత "ఓ రాయి అటూ వేసి చూద్దాం" అనుకుని ఆ ఫ్యాక్టరీవైపుగా నడిచాడు. సమీపిస్తున్నకొద్దీ ఆ కర్మాగారంలోని భాగాలన్నీ కళ్లకి మరింత స్ఫుటంగా పెద్దవిగా కనిపించి గుండెలు గుబులు గుబులు మన్నాయి. ఒక్కొక్క యంత్రంముందు ఒక్కొక్క మనిషి ఎంత అల్పంగా, ఎంత సూక్ష్మంగా కనిపిస్తున్నారు! ఎంత విచిత్రం! మనిషి సృష్టించిన యంత్రాలు మనిషినే మింగేస్తున్నాయా అన్నట్టుగా అక్కడి వాళ్లంతా ఒంటికి సిమెంటు కొట్టుకుపోయి ఆకారాలు మారిపోయి వికారంగా కనిపిస్తున్నారు. బీభత్సంగా అవుపిస్తున్నారు "ఇలా అయితే ఈ మనుష్యులు ఎంతకాలం బ్రతుకుతారు?" అనుకుంటూ ముందుకు నడిచాడు గడ్డంతాత. నేలంతా సిమెంటు మయం.

వెనకనించి "ఎవరది?" అంటూ అధికార పూర్వకంగా అరిచింది ఓగొంతు. గడ్డంతాత ఆగిపోయి వెనక్కి తిరిగి దండం పెట్టి "ఏదైనా పనుంటే యిప్పించండిదొరా" అన్నాడు అధికారికి కొద్దిదూరంలో నిలబడి.

"ఏంపని చేస్తావు?"

"ఏదైనా సరే..." అతనికళ్లు మిల మిలా మెరిసిపోయాయి. వంచిన తల నిలబెట్టి ఉత్సాహంగా కొద్దిముందుకు జరిగాడు. ఆశారేఖలు అతని ముఖాన్ని ఉద్దీపనం చేస్తున్నాయి.

"రాయగలవా?"

"ఊఁ!"

"కూలిపని చెయ్యగలవా?"

"ఊఁ!"

"అయితే ఎల్లుండి పొద్దయం ఇక్కడికొచ్చి నాకు కనిపించు. ఫ్యాక్టరీసైరన్ కూస్తుంది. ఆ వేళకల్లా వచ్చెయ్యాలి." ఆనందాతిశయంతో పెదవులు వణికాయి గడ్డంతాతకి. కల్లో యేదో జరుగుతున్నట్టుగా వుంది. కాళ్లు తేలిపోతున్నాయి మళ్లీ తండ్రి మనసులో మెదిలాడు కాని పశ్చాత్తాపపడలేదు. ఇంట్లోంచి పారిపోయి వచ్చినప్పటి అతని ఊహలు యెలాసాగాయో ఇప్పుడూ అలాగే సాగిపోయాయి. గతం మర్చిపోయి వంగిననడుం గర్వంగా నిలబెట్టి "చిత్తం! అలాగే వస్తానుదొరా" అంటూ దగ్గరగా వచ్చి నాలుగు స్తోత్రపాఠాలు చెప్పి దండం

పెట్టి వెనక్కి తిరగ్గానే "అప్పుడే వెళ్ళి పోతున్నావే నీ పేరేమిటో చెప్పావు కావు?" అంటూ ప్రశ్నించాడు అధికారి.

తండ్రి పెట్టిన పేరు 'కామేశ్వర రావు' అని చెప్పటానికి సంకోచించి "కావన్న అంటారు" అని నసిగాడు. అధికారి ఈ పేరు నోటుబుక్కులో రాసుకుని "రోజూ రూపాయిస్తాం" అన్నాడు.

"తను చిత్తం!"

"సరే వెళ్ళు" అని అధికారి ఎవరితోనో నోరు పారేసుకుంటూ అక్కడ్నించి నిష్క్రమించాడు. గడ్డంతాత కుంభకర్ణుడిలా అంగలేసుకుంటూ మధ్యమధ్య గంతులు వేస్తూ సన్న సన్నగా ఈలపాట పాడుకుంటూ సత్రం చేరుకుని స్తంభం చాటున కూర్చుని గొంతువిప్పి తృప్తితీరేలా పాడుకున్నాడు.

పిల్లలంతా అతనిచుట్టూ మూగి వింతగా వంకర్లుతిరిగే అతని నోటినెప్పూ, ఆ పాటకి అనుగుణంగా గాలిలో తాళం వేసే అతని వేళ్లని, అతని ముఖంలోని హావభావాలనీ, చిరుగాలికి చూరుమీద తాటాకుల్లా అటూ ఇటూ కదిలే అతని అట్టలుకట్టిన జుట్టునీ చూస్తూ మధ్యమధ్య ఒకళ్లముఖంలోకి ఒకళ్లు చూసి నవ్వుకుంటూ నిలబడ్డారు.

"ఏమిటిగడ్డంతాతా అలా పాడుతున్నావు ఇవ్వాళ? నీకు పాటంకూడా వచ్చా?" అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ఒక కుర్రాడు.

గడ్డంతాత కళ్లు తెరచి "పాటేకాదు ఇంకా చాలా విద్యలు వచ్చు" అన్నాడు.

"గోలీకాయలు ఆట్టంవచ్చా?" అని అడిగాడు కుర్రాడు.

"ఓ! మీరెవరన్నా పందెం వెయ్యండి చూద్దాం" అంటూ గడ్డం తాత లేచి గొంతు కూర్చుని చిటిక వేశాడు.

కుర్రాళ్లలో ఒకడికి పౌరుషంవచ్చి "రా చూదాం" అన్నాడు.

గడ్డంతాత లేచి వీధిలో చాలాసేపు వాళ్లతో గోలీలాట ఆడి, గెలవగల సామర్థ్యం ఉన్నా కావాలని ఓడిపోయి వాళ్ళచేత గేలిచేయించుకుని సిగ్గుపడుతున్నట్టుగా నటించి వాళ్ళ అమాయకత్వాన్ని చూచి ఆనందిస్తూ మధ్యాహ్నం చాలా సేపటివరకు గడిపేశాడు. ఆరోజల్లా అతను అలాఆడుతూ పాడుతూనే గడిపేశాడు. అర్ధరాత్రి ఒంటిగంట వరకూ ఆకలిగురించి ఆలోచించాల్సిన అవసరం రాలేదతనికి. అసలా సంగతే మర్చిపోయాడు. అప్పటికి పేగులు అరవటం ప్రారంభించాయి కడుపులో పోట్లు ప్రారంభించాయి ఊరంతా గాఢ సుషుప్తిలో ఉంది. భిక్షాటనకి అనువైన వేళ కాదది. అలా వళ్లమాలిన బాధ రాత్రల్లా అనుభవించాడు. తెల్లవారేసరికి ఆపోట్లు తగ్గాయి. కాని నిన్న రోజల్లా గర్వంతో నిలబెట్ట గలిగిన నడుము ఈ ఉదయం మళ్లీ వంగిపోయింది. కడుపు వెన్నునంటుకుపోయింది. కడుపునిండా మంచినీళ్లు తాగాడు. మళ్ళీ కడుపులో పోట్లు ప్రారంభం అయే సూచనలు కనిపించగానే గబగబా ఊళ్ళోకి నడిచి ఇంటింటికీ తిరిగాడు. ఎక్కడా ప్రయో

★ అరిసకుంపటి ★

జనం లేకపోయింది. మొన్న రాత్రి అన్నం పెట్టిన ఆవిడ యింటికికూడా నడిచాడు. ఎంతపిలిచినా తలుపే తెరుచుకోలేదు. హోటళ్లన్నీ తిరిగాడు లాభం లేకపోయింది. నడవగలిగే శక్తిగూడా క్రమంగా క్షీణిస్తోంది. ఓపిక చేసుకుని ఒకసత్రం చేరుకున్నాడు. స్తంభంచాటున కడుపులో కాళ్లు పెట్టుకుని పడుకున్నాడు.

మధ్యాహ్నం మూడుగంటలయింది. గడ్డంతాత లేవాలని ప్రయత్నించాడు. కాని లేవలేకపోయాడు. కళ్లు మంటలు ప్రారంభించాయి. కీళ్లు నొప్పులు పుడుతున్నాయి. అటూ ఇటూ కదలనివ్వటం లేదు. గోలీలాడిన కుర్రాడు పరుగెత్తుకొచ్చి "కళ్లెంత ఎఱ్ఱగా వున్నాయేం తాతా?" అంటూ ప్రశ్నించాడు.

నవ్వటానికి ప్రయత్నిస్తూ "ఏవీ లేదు" అంటూ గొణిగాడు. మారు మాట్లాడకుండా వెనక్కి వెనక్కి చూస్తూ ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు.

సాయంత్రం చీకటిపడుతోంది. మూలుగుతున్న గడ్డంతాత భుజంమీద ఎవరో చేయి వేసి తట్టి లేపినట్టు అయి కళ్లు తెరచి చూచాడు. బూచీ! బూచీ అంటూ శక్తికొద్దీ అతన్ని బాహువుల్లో బంధించుకుని "బూచీ నాకు ఉద్యోగందొరికింది రోజుకు రూపాయి ఇస్తారుట. సిమ్మెంటుఫ్యాక్టరీలో పని దొరికింది." అంటూ ఉప్పెనగా ముంచుకొస్తున్న ఆవేశంలో యేవేవిటో గొణికేవాడు.

బూచీ ముఖం అసూయతో ఎఱ్ఱబడిపోయింది. "నాకు దొరకలేదు గడ్డంతాతా!" అన్నాడు నిస్పృహగా.

"నువ్వూ ఉద్యోగంకోసమే వెళ్ళావా?"

"అవును తాతా. అందుకే వెళ్ళాను."

"భార్యా పిల్లల్ని వెతుక్కుందుకు పోతూవేమో అనుకున్నాను. మళ్ళీ వచ్చావు అదే చాలు. నువ్వంతగా విచారించకు. నాకు ఉద్యోగం దొరికిందిగా. మనిద్దరం కలసి ఎలాగో కాలక్షేపం చేద్దాం. రోజుకు రూపాయి ఇస్తుంటే ఇద్దరికి చాలకపోతుందా?"

బూచీ క్షణం నివ్వెరబోయి మరుక్షణం పశ్చాత్తాపంతో క్రుంగిపోయాడు. మరింత గాఢంగా గడ్డంతాతని కౌగలించుకొని "నువ్వు చాలామంచివాడివి తాతా. నాకొద్దు. నీ రూపాయి నువ్వే ఖర్చు చేసుకో." అన్నాడు.

"మరి నువ్వో?"

"ఉద్యోగం దొరికేదాకా ఇలాగే గడుపుతాను." - బూచీ తలవంచుకుని కన్నీరు దాచుకున్నాడు.

"అలా వీల్లేదు. మనిద్దరం కలిసి నాసంపాదన అనుభవిద్దాం. నువ్వు కాదనటానికి వీల్లేదు" అంటూ బూచీ 'ఊఁ!' అనేదాకా బలవంతం చేసి, ఒప్పించాడు గడ్డంతాత.

"అన్నట్టు అడగటం మరిచాను. ఒళ్లంతా వేడిగా ఉందేం? కళ్లు కూడా ఎఱ్ఱగా వున్నాయి?"

"జ్వరంవచ్చింది బూచీ. మధ్యాహ్నం నుంచీ బాధపడుతున్నాను" అని నీరసంగా సమాధానం చెప్పాడు గడ్డంతాత.

ఆరాత్రి చాలాసేపు ఇద్దరూ చాలా విషయాలు మాట్లాడుకున్నారు. ఎవరివాళ్ళని వాళ్లు తల్చుకుని కన్నీరు పెట్టుకుని ఒకళ్లని ఒకళ్ళు ఓదార్చుకున్నారు. తను ముందు ముందు వేసుకున్న పథకాలు బూచీ చెవిని వేశాడు గడ్డంతాత. బూచీ వాటిని బలపరిచాడు. "తెల్లవారితే తను మనిషి అనిపించుకోగల అర్హత సంపాదించుకుంటాడు. మరో వ్యక్తినికూడా పోషించగల సమర్థుడౌతున్నాడు!" ఉద్యోగం చేసుకుంటూ రోజూ సాయంత్రం సంధ్యవెలుగులో తళతళా మెరిసే రూపాయిబిళ్లె చేతిలో పడేప్పుడు కూడా పొందలేని ఆనందం గడ్డంతాత యీ రెండురోజులూ ఊహించి అనుభవించాడు. బూచీ ఆ ఆనందాన్ని పంచుకున్నాడు.

కాలగతిని గూర్చిన భయం

జి. వి. యస్. రామశర్మ

కాలమనేది పరబ్రహ్మ స్వరూపం.

కాని ఆ కాలం గతిస్తున్న కొలదీ మానవులకు సహజంగా భయం వేయటం కద్దు. ఈ భయం దేనికి?—ఏదో ఒకనాడు తాను కూడా లోకంలో లేకపోవటం తటస్థించ వచ్చునని తలచుకొని.

జీవితానికి మొదలు అనేది యెట్లా అయితే ఉందో ఆ విధంగానే చివర అనేది గూడా ఉంది అనే సంగతి జ్ఞాపకం పెట్టుకుంటే 'మృత్యువు' అంటే ఉన్న భయం తొలగిపోవచ్చు. మన మీ ప్రపంచంలో లేకుండా ఉన్న రోజులు ఉన్నాయ్. మఱి మనం లేకుండా పోయే రోజులూ ఉన్నాయ్. ఇంక ఈ విషయాన్ని గూర్చి భయపడట మెందుకో! అక్బరు మన దేశాన్ని పాలిస్తూ ఉన్నప్పుడు నేను లోకంలో లేను. అట్లాగే నేటికి ఒక వంద యేండ్ల తరువాత ఉండబోను అనే మాట తలుచుకుని భయపడటం దేనికి. కాళిదాసు, భవభూతి మొదలైన పండితులంతా భోజరాజు కాలంలో గొప్ప ఉద్గ్రంథాలు వ్రాసి, తమ పాండిత్యాన్ని వెదజల్లుతున్న రోజుల్లో నేను లేను. రాబర్టు క్లయివు మన దేశానికి వచ్చి తుపాకులు పేల్చి ఈస్టిండియా వారి రాజ్యాన్ని స్థాపించినప్పుడూ నేను లేను. గతించిన శతాబ్దాల్లో మనం లేకపోతే ప్రపంచానికి ఏ కొదువా రాలేదు. బాగా నే నడిచిపోయింది. అటువంటి ప్రపంచాన్నించి మనం మళ్ళీ ఒకసారి లేకుండా పోతాము అనే విషయాన్ని గూర్చి భీతి యెందుకు. మరణించడమంటే మనం పుట్టక పూర్వం ఏ స్థితిలో వున్నామో తిరిగి ఆ స్థితికి పోవడమన్న మాట.

కాని మానవు లీవిషయాన్నంత తేలిగ్గా భావించరు. మనం పుట్టక పూర్వం నిరవధికమైన విశ్రాంతిలో ఉండి యున్నామన్న మాట. అప్పటికి మనం ఈ ప్రపంచంలో మన స్వల్ప పాత్రలను నిర్వహించడానికి అవతరించ లేదన్న మాట. మళ్లీ అదే రకమైన విశ్రాంతి చేకూరే స్థానానికి చేరబోతా మనే మాటలో వింతేమీ లేదు. విరోధుల మీగున్న విరోధం, ప్రేయసి మీదున్న ప్రేమ, మనస్సును క్రుంగదీసే విచారాలూ, శరీరాన్ని బాధించే రోగాలూ, తీర్చ వలసిన అప్పులూ ఇవన్నీ లేకుండా పోతాయి మరణించడం వల్ల. పోయిన వాళ్లంతా తిరిగి వచ్చి మాకు ఈ యీ కోరికలు యింకా తీర లేదని ఏనాడైనా ఎవరితోనైనా చెప్పారా? (సోది అడిగితే చెప్తారనుకోండి!!)

కాబట్టి వాళ్లందఱికి మృత్యువు అనేది తృప్తవదిలించి, తృప్తి చేకూర్చిం దన్నమాట. మనం పుట్టకముందు జరిగిన కలియుగ శతాబ్దాల్లో జరిగిన విషయాల్ని గురించి యెవరైనా బాధపడతారా? పడరు. ఏం?-మనకు దాంతో సంబంధం లేదనే. "ఆ శతాబ్దాల్లో జరిగిన సంగతులకు నాకూ సంబంధం ఉంద"ని ఎవరు ముందుకు వస్తారు?

ఆద్యంతా లెఱుగరాని జీవయాత్ర అనే ఊరేగింపులో మనము పాల్గొంటున్నాం. ఆ వూరేగింపులో ఒకచోటే నుంచోటానికి వీల్లేదు. తన ముందున్న వాడితోపాటు తను కూడా సాగిపోయి వెనకవచ్చే వాడికి ఆ స్థానం యివ్వాలి. మృత్యువునుగూర్చి భయపడటం అంటే-ఈ ఊరేగింపులో ఒకేచోట శాశ్వతంగా నుంచుంటాననటం.

అక్బరు పరిపాలించిన నాటి చరిత్ర, అంతకుపూర్వపు చరిత్ర మనకు తెలుసు. కాని, ఈ క్షణానికి తరువాత జరుగబోయే చరిత్ర ఎవ్వరికీ తెలియదు. అట్లా తెలుసుననటం యెటువంటిదంటే చంద్రాంగారక మండలాలను చూచివచ్చా ననటంలాంటిది. (ఎందుకంటే..భవిష్యత్తును గూర్చి మన కెంత తెలుసో, చంద్రాంగారక మండలాలను గూర్చి కూడా మన కంతే తెలుసు గనుక). జీవితంమీ దుండే ప్రేమాతిశయాలవల్లనే గాని, దచ్చిపోయిన తర్వాత జరిగే సంగతిని గూర్చి మన కనవసరం. మన ఉద్దేశ్యం ఏమంటే ప్రస్తుతక్షణాన్ని శాశ్వతంగా ఉండమంటూ ఉండటం. ఇది జరిగే విషయంగాదుకదా! మనకు ఐహిక సంబంధాలను విచ్ఛేదం చేసుకోటానికి ఇష్టముండదు. జీవితంమీద మానవునికున్న ప్రేమకి హేతు వేమంటే-జీవుడు, తమతో చిరకాలం సాంగత్యంచేసిన వస్తువులమీద ఉండే మమకారాన్ని వదలలేకపోవటమే. నేడు ఉన్న

(30-వ పేజీ చూడండి)

రాత్రి రెండయేసరికి ఇద్దరూ గాఢ సుషుప్తిలో మునిగిపోయారు.

*   *   *

రోజూ ఆలస్యంగా వచ్చే రైలు ఆ వుదయం సరైన టైముకే పెద్దగా అరుచుకుంటూవచ్చి స్టేషన్‌లో ఆగింది. బూచీ మెలుకువ వచ్చి లేచి కూర్చున్నాడు. అప్పటికింకా తెల్లగా తెల్లవారలేదు. లేచి వీధిలోకెళ్ళి ముఖం కడుక్కొని తిరిగివచ్చి "తాతా! తాతా! నీకు నేళ్ళేంది" అంటూ గడ్డంతాతవీపు తట్టాడు.

గడ్డంతాత పలకలేదు!

మళ్లీ పిలిచాడు.

సమాధానం రాలేదు.

చేత్తో పక్కకి తోశాడు. ఆ కదలికలో అచేతనత్వం స్ఫురించింది. ముక్కు మీద వేలువేసి చూచాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు లేవు. గుండెమీద చెయ్యివేసి చూశాడు. గుండెలు కొట్టుకోవటం లేదు.

వప్పలా గడ్డంతాతమీద పడి వుల్లి వుల్లి ఏడ్చాడు బూచీ. గడ్డంతాతిముఖంలో ప్రేతకళ లేదు. నవ్వుతున్నట్టుగా వుంది. ప్రశాంతంగా నిద్రపోతున్నట్టుగా ఉంది. కడుపుమటుకు వెన్నుకంటుకుపోయి వుంది. గుండెలమీద ఎముకలు మెట్లుమెట్లుగా కనిపిస్తున్నాయి.

అలా ఎంతసేపో చనిపోయిన మిత్రుడికోసం కన్నీరు ఖర్చుచేశాడు బూచీ కాని గడ్డంతాతమటుకు నవ్వుతూనే వున్నాడు.

ఉన్నట్టుండి మెరుపు మెరిసినట్టుగా బూచీకి ఒకవూహ తట్టింది. లేచి ఇవతలికి వచ్చి గబగబా వీధిలో జనాన్ని తోసుకుంటూ సిమ్మెంటు ఫ్యాక్టరీ వైపుగా పరుగెత్తాడు. "రోజుకు రూపా యిస్తారుట! ఆ అధికారికి గడ్డంతాత అయితేనేం? తనైతేనేం? అతనికి కావాల్సింది పని."—దూరంగా రాత్రి గడ్డంతాత చెప్పినట్లుగా సైరన్ హోరుమంటూ కూస్తోంది.

మరింత త్వరగా పరుగులుతీశాడు బూచీ!

★



గతవైభవచిహ్నం



ఫొటో: ఎస్. కె. విఠల్—మద్రాసు.

★ కాలగతినిగూర్చిన భయం ★

స్థితిని వదలుకుని ప్రాణత్యాగం జేస్తే, నీకు భవిష్యద్యుగంలో ఉన్నత స్థితిని ప్రసాదిస్తామని వాగ్దానంచేసినా నేటి స్థితిని మనం వదలుకోటాని కిష్టపడం! పరస్పరం జీవితాల్ని మారకం వేసుకోటానికి కూడా అందరూ నిరాకరిస్తారు.

యువకులు, సిద్ధాంతికంగా "జాతస్యమరణం ధ్రువం" అనే సత్యాన్నంగీకరిస్తారే గాని దానిని తమకుమాత్రం అన్వయింపజేసుకోరు. యౌవనం ముసలితనాన్నీ, మరణాన్నీ దూరంగా ఉండమంటుంది. మరణమనేది తమకు బహు యోజనాల దూరంలో ఉందని యువకులు భావిస్తారు. అట్లా అనుకుంటూ ఉండగనే తమకుకూడా ముసలితనం వచ్చిందని హఠాత్తుగా ఒకనాడు తెలుస్తుంది. ఆనాటి నుండీ వాళ్లు జీవితంలో చవిచచ్చినట్లు భావిస్తారు. అరవైయ్యేళ్ళు వచ్చేటప్పటికి మానవుడికి జరిగిందాన్ని తలుచుకున్నప్పుడు విచారము, జరుగబోయే దాన్నిగురించి నిరాశ అనేవి ప్రబలుతాయి. అట్లాంటి నిస్పృహతో జీవితాన్ని గడపేకంటే మాటాములేకుండా సద్దుకుని మృత్యుదేవత తోలుకువచ్చిన కారులో కూర్చుని సంతోషం అనుభవిద్దామని తలుస్తారు.

జీవితపథం అనేది పోను పోను అంధకార బంధురంగా ఉండే ఒకగుహకు పోల్చవచ్చు. మనిషికి మరణము ఆసన్నమైనకొలదీ భయంకూడా అధిక మౌతూంటుంది.

ఆరోగ్యముగల ఒక పసిబిడ్డ ఏదో అల్పరుగ్మతతో మరణించిందనుకుందాం. మరణించినతరువాత ఆ పసిబిడ్డ శరీరం జీవమున్నప్పుడు ఉన్నట్లే ఉంటుంది. ముఖంలో ప్రశాంతత తొణికిసలాడుతూ ఉంటుంది. కాని ఆ నిశ్చేతనమైన ఆ శరీరాన్ని చూస్తే విచారం పుడుతుంది. సరిగ్గా ఆ బిడ్డలాగే ఉండేటట్లు ఒక పాలరాతి విగ్రహాన్ని తయారుచేస్తే... దాన్ని చూచినప్పుడు—(అదీ నిశ్చేతనమైనదే కనుక)- విచారానికి బదులు సంతోషం కలుగుతుంది. అంతే కాని దీనికి జీవం లేదను విచారం కలగదు. కాని పసిబిడ్డ విషయంలో విచారం సంభవిస్తుంది. బ్రతకాలని ఆశఉన్న ఆ పసిబిడ్డను బలవంతాన మృత్యువు పొట్టబెట్టుకున్నందుకు కోపం వస్తుంది. కాని, ఆ జీవి శరీరాన్ని మాత్రం ఇక్కడ వదలింది. మరొక శరీరాన్ని ధరిస్తుంది అని వేదాంత స్ఫురణవల్ల కొంత మనశ్శాంతి కలుగవచ్చు. కాబట్టి, మొదటి నుండీ అచేతనమైన వస్తువును చూచి ఎవ్వరూ విచారించరుగాని కొంతకాలము చైతన్యవంతమైన పదార్థము అచేతనమైనప్పుడు విచారం కలుగుతుంది.

శవాన్ని చూస్తే అనేకమంది భయపడతారు. దానిని తలుచుకుంటేనే భయపడతారు. ఇది అకారణము. ఏమనగా - ఆ శరీరముకూడ చైతన్యవంతమై యుండినంత కాలము వేడిని కలిగియుండి; స్నేహితులతో తిరిగింది. అదే నేడూను. ప్రతిమనిషీ - ఆ భయపడే వాళ్లుకూడా - అంతే గదా. ఇన్ని తెలిసినా దాన్ని చూచేసరికి భయము దానంతటి కదే సంప్రాప్తమగును. ఇది మానవ సహజం. తాను పోయినతర్వాత ఈ ప్రపంచం ఎట్లా ఉంటుందో! ఇల్లు, సంసారం, పిల్లాజల్లా యెట్లా కాపాడబడతారో అనే ఆత్రుత మృత్యువంటే భయపడటానికి హేతువు. మనం పుట్టక పూర్వం మనుషులు ఎట్లా రోడ్డుమీద నడచేవాళ్ళో, మనం గతించిన తరువాతా అట్లాగే నడుస్తారు. మనం పుట్టకముందు అన్నం యెట్లాతిన్నారో మనం గతించిన తర్వాతకూడా అట్లాగే తింటారు. మనకోసం లోకప్రవృత్తి ఆగిపోతుందా? లోకవ్యవహారాలన్నీ మామూలుగానే సాగిపోతాయి. కాని మనం "మనకోసమే ఈ ప్రపంచమంతా యిట్లా నడుస్తోంది" అనుకోవటం సహజం.

సామాన్యంగా మనం బ్రతికివున్నప్పుడే లోకులు (చాలామంది) మనల్ని యెరిగివుండటం అసహజం. మనపేర్లు చైనాలో ఉన్నవాళ్లకో లేకపోతే యింకో దేశంలో ఉన్నవాళ్ళకో తెలుసా? తెలియవు. అంతవఱకెందుకు? మనపేర్లు మన బజార్లోవాళ్లకీ మన ప్రక్క బజార్లోవాళ్ళకీ కూడా తెలిసి ఉండవు! అటువంటప్పుడు మనం పోయిం తరువాత మన సంగతులు ఎవ్వరికీ పట్టవు. సంపన్నుల్నీ, పేరుగలవాళ్ళనీ కూడా వాళ్లు పోయింతరువాత కొద్దిరోజులకే మఱచిపోతారు. ఎవరైనా ఒక మహాత్ముడి పేరు - మహా ఉంటే - ఒక అర్ధసంవత్సరం లేకపోతే సంవత్సరం నిల్చిఉండేను. తరువాత అందఱితోపాటే! చచ్చిపోయినవాళ్లు, తాము ప్రపంచానికి - బ్రతికున్నప్పుడు - ఏఏ నిష్పత్తిలో సేవ, మేలూచేశారో ఆయా నిష్పత్తులలోనే వాళ్లు గతించిన తర్వాత లోకంలో వాళ్లు గుర్తుంటారు.

తన చుట్టూ ఉన్న ప్రపంచంతో తనకు గల సంబంధాన్ని బట్టి మనిషికి జీవితాశ ఎక్కువో, తక్కువో అవటం జరుగుతూ వుంటుంది.

పూర్వకాలంలో యుద్ధరీత్యానో లేక పటిష్ఠమైన ఒక వాంఛ రీత్యానో జనులు మృత్యువును ధీరులై యెదుర్కొనేవాళ్లు. కాని మనమో...ఏదో ఒక స్వల్పకారణం కోసం జీవితాశను పొడిగిస్తూ ఉంటాము. కాని పూర్వ మట్లాకాదు. అప్పటిజనం ప్రేమకోసమో, గౌరవం కోసమో, మతం కోసమో దేహత్యాగం చేయాల్సి వస్తే వెనుదీయని వీరులు. అట్లాంటి ఉదాహరణలు మన చరిత్రలో చాలా ఉన్నాయ్. తాము తల్పెట్టుకున్న కార్యం గొప్పదని తెలిసి, దాని సాధనలో మృత్యుభయం కూడా ఉండవచ్చునని తెలిసినా అవసరం వస్తే జీవితాల్ని తృణప్రాయంగా త్యజించడానికి సిద్ధంగా ఉండే వారు కాని, అట్టాంటి అవసరంపట్ల ఆయుర్దాయాన్ని లెక్కచేసే వారుకారు. ఈ త్యాగవీరుల యొక్క హృదయాలను ఉత్తర జన్మలలో తమకు రాబోయే సుఖాలు సంతృప్తిపఱచేవి గాబోలు!!

కార్యశూరత, ప్రమాదకరమైన కార్యాల్లో ముందుకు దూకడం అనేవి మృత్యువంటే ఉన్న భయాన్ని పోగొట్టవచ్చు. జీవితానికి సరియైన విలువను యివ్వటం ద్వారా కూడా మృత్యువంటే భయం పోతుంది. దేశ సౌభాగ్య రక్షకులు తాము మరణించటానికి అంతగా విచారించరు. దేశద్రోహులు మరణించవలసి వస్తే లోకానికి శాంతి చేకూరుతుంది. మృత్యువంటే ఉన్న భయం తొలగించుకోవటమే మృత్యుంజయత్వం.!!! ★

వనితాలోకం

కొత్త వివాహ నియమాలు

హిందూధర్మశాస్త్రాలలో ఉదహరింపబడిన వివాహాలు ఎనిమిదిరకాలు: బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము, రాక్షసము, ఆసురము, గాంధర్వము, పైశాచము అను పేర్లతో వ్యవహరింపబడేవి. 1. బ్రాహ్మము: సదాచారముగల వరుని నూతనవస్త్రాగులతో అలంకరించి పూజించి చేసే కన్యాదానము. 2 దైవము: జ్యోతిష్టోమాది యజ్ఞ ప్రారంభమున యధావిధిగా ఆ కర్మ నడపిన ఋత్విజుని అలంకరించి చేసే వివాహము. 3 ఆర్షము: ధర్మార్థము వరునివద్దనుండి గోమిధునము తీసుకొని, కన్యనిచ్చి యధాశాస్త్రముగా చేసే వివాహము. 4. ప్రాజాపత్యము: వరునిచేత 'నేను అన్యాశ్రమస్థుడను కాక, గృహస్థాశ్రమములో ఉండి ధర్మమాచరించెదను' అని చెప్పించి కన్యాదానము చేసిన వివాహము. 5. రాక్షసము: బలాత్కారముగా కన్యను తీసుకొనివచ్చి చేసుకున్న వివాహము. 6 ఆసురము: కన్యకూ ఆమె తలిదండ్రులకూ ద్రవ్యమిచ్చి యథేచ్ఛగా చేసుకొన్న వివాహము. 7. గాంధర్వము: వధూవరులు అన్యోన్యప్రేమతో చేసుకొన్న వివాహము. 8. పైశాచము: కన్య తన శీలమును రక్షించుకొనలేని పరిస్థితులలో జరిగిన వివాహము.

ఈ అష్టవిధ వివాహాలలో మొదటనాలుగు బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము బ్రాహ్మణులకు ప్రశస్తములని పూర్వులు నిశ్చయించారు. గాంధర్వ, రాక్షస వివాహాలు క్షత్రియులకు సమంజసమనీ, పైశాచము అన్ని జాతులకూ నింద్యముగా నిర్ణయింపబడ్డది.

ఇల్లిందల సరస్వతీదేవి

మానవుల ధర్మశాస్త్రము సమాజాభ్యుదయాన్ని అనుసరించ వలసినది కనుక యీ కాలపు ప్రజాసమస్యలను దృష్టియందుంచుకొని నూతనముగా క్రోడీకరింపబడి శాసనరూపమున అమలు జరుపబడినవి. హిందూ వివాహము, విడాకులచట్టము, సివిల్ మారేజి అక్టు ఈ సంవత్సరమే పార్లమెంటులో చర్చింపబడి శాసనములైనవి. ఇవి యావద్భారతానికీ అన్వయిస్తున్నాయి. భారతదేశములోవున్న హిందువులు అనగా వైష్ణవులు, స్మార్తులు, లింగాయతులు, బ్రహ్మసమాజీకులు, ప్రార్థనసమాజీకులు అని విపులీకరింపబడ్డది బౌద్ధులు, జైనులు, సిక్కులు కూడా హిందువులుగానే పరిగణింపబడుతారు. ఈ చట్టములు హిందువు లందరికీ కులప్రసక్తి లేకుండా అనుసరించవలసినవి కనుక రెండురకములయిన వివాహాలను మాత్రమే ఆమోదించటానికి నిశ్చయింపబడ్డది. ఈరెండూ అష్టవిధ వివాహాల పట్టికలోవి కావు. ఈ రెండిటిలో మొదటిది ధార్మిక వివాహము, రెండవది సివిల్ మ్యారేజీ.

ధార్మిక వివాహము మత సంస్కారాలను అనుసరించి జరుపబడేది. ఈ వివాహము చట్టసమ్మతము కావటానికి కొన్ని షరతులు ఉన్నాయి. వివాహము జరుగునప్పటికి వధూవరులకు జీవించియున్న భర్తగాని, భార్యగాని ఉండకూడదు. ఈ చట్టము ననుసరించి పురుషునికి జీవించియున్న ఇద్దరు భార్యలుగాని, స్త్రీకి జీవించియున్న యిద్దరు భర్తలుగాని ఉండటానికి వీలులేదు. వివాహకాలము నాటికి వధూవరులిద్దరిలో ఏ ఒక్క

కొత్త వివాహ నియమాలు

లేక మనశ్శాంతిదల్లము గాని, ఉన్మాదము గాని ఉండకూడదు.

వరుని వయసు 18 సంవత్సరాలకూ, వధువు వయసు 14 సంవత్సరాలకూ మించి ఉండవచ్చును గాని అంతకు తక్కువ ఉండకూడదు.

హిందువులలో సోదరీసోదరుల మధ్యగాని ఆ బాటి వరుసలు కలవారి మధ్యగాని వివాహాలు జరగటము ఈనాటిదే కాదు-ఏనాడూ ఆచారము కాదు. అక్క చెల్లెండ్ర సంతానము మధ్యనూ, అన్నదమ్ముల సంతానము మధ్యనూ వివాహాలు జరపటము హైందవ సంప్రదాయ విరుద్ధము. కాని మేనగోడలికి మేనమామకూ మధ్య, వివాహాలు కొన్ని ప్రాంతాలలో ఆచారసమ్మతమైనవి. మేనరికాన్ని దైవము కూర్చిన సంబంధముగా భావించటము హిందువులలో ప్రాచీనకాలము నుండీ వచ్చిన ఆచారము. ఈ చట్టము మేనమామకూ మేనగోడళ్ళ మధ్య వివాహాలను నిషేధించింది. సోదరీసోదరుల మధ్య వివాహాలను, అక్క చెల్లెండ్ర సంతానము మధ్యను, అన్నదమ్ముల సంతానము మధ్యను వివాహాలు కూడవని ఈ చట్టము శాసించింది. తండ్రి వైపు ఐదుతరాల వరకుగల బంధువుల మధ్య వివాహాలు కూడవని ఈ చట్ట నిర్ణయము.

వధూవరులు సపిండులుగా ఉండరాదని ఈ చట్టము శాసించుచున్నది. కాని ఏ కులములో గాని శాఖలో గాని అటువంటి ఆచారము ఉన్నట్లయితే వారు ఆ ఆచారాన్ని పురస్కరించుకొని, ఋజువు చేసుకొని, వివాహాలు జరుపుకొనవచ్చును.

వివాహకాలమునాటికి వధువు 16 సంవత్సరాల వయసుదాటిన సందర్భాలలో, వివాహములో ఆమె యిష్టమే చెల్లుతుంది. కాని అంతకులోపుగా ఉన్నట్లయితే సంరక్షకుడి అనుజ్ఞపొందనిదే ఆ వివాహము చెల్లదు.

ప్రతి కులమూ శాఖా ఆయా సంప్రదాయాల ననుసరించి వివాహ కార్యకలాపము జరిగించుకోవాలి. కాని-వాటిని సంస్కరించుకొనే ఉద్దేశ్యముతో గాని, మరే యితర కారణాలతో గాని ముఖ్యాంశములు కాని వాటిని విడచిపెట్టిన పక్షములో వివాహము చట్టసమ్మతము కాకపోదు ధార్మిక వివాహాలను రిజిస్టరు చేసుకోవచ్చును

[సివిల్ మ్యారేజిని గురించిన వ్యాసము 4 5-55 నాటి ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురింపబడ్డది.]

హిందూ వివాహ శాసనము ననుసరించి కొన్ని వివాహాలను విసర్జించుకోవచ్చు. అనగా రద్దుచేసుకొనే సదుపాయము కల్పించబడినది. ఈ శాసనము అమలులోకి రాకపూర్వము కూడా వివాహమయిన దంపతులలో ఎవరయినా ఉన్మాదులు గాని, చపలచిత్తులు గాని ఉన్నట్లయితే, అటువంటి వివాహాలను ఇప్పుడు రద్దు చేసుకోవచ్చును.

వధూవరులు సగోత్రులు లేక సప్రవరులు గాని అవటము సంభవించినట్లయితే, ఈ శాసనము అమలులోకి వచ్చిన తరువాత, ఆ వివాహాలను రద్దు చేయటానికి వీలు లేదు. అవి అంతకుపూర్వము న్యాయసమ్మతమయినప్పుడు, ఈ చట్టము వచ్చినతరువాత కూడా, న్యాయసమ్మతములుగానే పరిగణింపబడతాయి.

ఈ చట్టము అమలులోకి రాకమునుపు - అప్పటి న్యాయశాస్త్రము ప్రకారము— భార్య జీవించి ఉండగా పురుషుడు తిరిగి వివాహము చేసుకొన్నట్లయితే, మొదటి భార్య విడాకులు తీసుకొనే అవకాశమీయబడినది.

నిషిద్ధ బంధువులు అప్పటి చట్టానికి వ్యతిరేకముగా వివాహము చేసుకొన్న పక్షములో ఆ వివాహము చట్టవిరుద్ధమైనదే అవుతుంది.

వివాహకాలమునాటికి వధువు 18 సంవత్సరముల వయసులోపున ఉన్న పక్షంలో పోషణకర్తల ఆమోదము పడయనిదే ఆ వివాహము చట్టసమ్మతము కాదు పోషణకర్తలకు ఈ క్రింది వరుసక్రమము ననుసరించి అధికారము ఏర్పడుతుంది (1) తండ్రి (2) తల్లి, (3) తండ్రి తండ్రి, (4) సోదరుడు, (సోదరులలో ఏకోదరుడైన సోదరుడికి సవతితల్లికి పుట్టిన సోదరులకంటె అధికారము ఎక్కువ.) (5) తండ్రి సోదరుడు (తండ్రి సోదరులలో కూడా ముందు ఎవరి అధికారము అనేది పైవిధముగానే నిర్ణయింపబడుతుంది.) (6) తల్లి తండ్రి, (7) మేనమామ, (8) బంధువులు (వీరిలో ఎవరు సన్నిహితులో వారికి అధికారము ముందు లభిస్తుంది.)

బంధువుల అధికారనిర్ణయము వారసత్వాధికారములో ఉన్న వరుసక్రమము ననుసరించి ఉంటుంది. పోషణకర్తకు 21 సంవత్సరము దాటి ఉంటేనే గాని వివాహానికి అనుమతియిచ్చే అధికారము రాదు. వధూవరుల క్షేమము కోరి న్యాయస్థానము పోషణకర్తల అధికారము తొలగించవచ్చు. ఇన్‌జన్‌క్షను ద్వారా సివిల్ కోర్టువారు వివాహాన్ని అవసరమనిపించగానే ఆపు చేయవచ్చు.

హిందూవివాహ శాసనములో వైవాహిక సంబంధమైన మార్పులూ చేర్పులూ కొన్ని సంప్రదాయ విరుద్ధాలుగా కనబడుతున్నాయి. వివాహ కార్యములో మతపు జోక్యము కలిగించుకొనరాదని సనాతనులు వాదిస్తూనే ఉన్నారు. మన మొకసారి క్రీస్తుకు పూర్వము నాలుగవ శతాబ్దము నాటి స్త్రీల అధికారాలూ, వివాహాలు ఏవిధంగా ఉన్నాయో గమనించినట్లయితే, ఆ కాలపు నాగరికత బోధపడుతుంది. వివాహాది కార్యాలలో ఆనాడు కూడా సమాజోన్నతిని దృష్టియందుంచుకొని ఋషులు ధర్మాలను ఏవిధముగా నెలకొల్పినదీ మనకు స్పష్టమవుతుంది.


కౌటిల్యుడు క్రీస్తుకు పూర్వము 4-వ శతాబ్దము నాటివాడు. చంద్రగుప్తుని మంత్రివర్గములోనివాడు. ఇతడే చాణక్యుడని శాస్త్రకారులు ప్రమాణపూర్వకముగా నిరూపించారు. కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రములో మూడవ అధ్యాయములో స్త్రీలకు సంబంధించిన అంశాలు వివరింపబడి చర్చింపబడ్డాయి.

అష్టవిధములయిన వివాహాలలో పై నాల్గు రకాలు ((బ్రాహ్మము, ప్రాజాపత్యము ఆర్షము, దైవము) తండ్రి సమ్మతించినట్లయితే న్యాయసమ్మతమయినవని కౌటిల్యుడు సిద్ధాంతీకరించాడు. తక్కిన వివాహాలకు తలిదండ్రుల (ఇద్దరిది) సమ్మతి కావలసి ఉంటుందని నిర్ణయించాడు. వరుడు వివాహకాలమందు వధువుకు ఇచ్చిన శుల్కము ఆమె తలిదండ్రులకు చెందుతుంది. వారిద్దరిలో ఒకరు చనిపోయినట్లయితే ఆ శుల్కము రెండవవారికి చెందుతుంది ఆ యిద్దరూ లేనిపక్షములో వధువుకు చెందుతుంది.

కౌటిల్యుని శాస్త్రము ననుసరించి ఆ కాలపు వధువు వయసు 12 సంవత్సరాలనీ వరుని వయసు 16 సంవత్సరాలనీ నిర్ణయింపబడ్డది. ఈ శాస్త్రము ననుసరించి వివాహకాలమునాటికి వధువు వయసు తక్కువ ఉన్నట్లయితే చెల్లుతుందిగాని వయసు మీరినట్లయితే శాసనోల్లంఘనము చేసినందుకు శిక్షార్హులుగా పరిగణింపబడేవారు.

ధర్మశాస్త్రము లన్నిటిలో అగ్నిసాక్షిగా జరిగిన వివాహాలకు వధూవరులు జన్మాంతము బద్ధులనే నిర్ణయింపబడ్డది. కాని కౌటిల్యుడు కొన్ని సందర్భాలలో వివాహము రద్దుచేసుకోవటానికి అనుమతించాడు. ఈ అనుమతి కూడా గాంధర్వ, ఆసుర, రాక్షస, పైశాచ వివాహాలకు మాత్రమే లభించింది. బ్రాహ్మణులకు తప్ప మిగతా జాతులకు లభించినదని బోధపడుతున్నది.

మీ చర్మమును సొగసుగ మరియు మనోహరముగ ఉంచుటకు సులభమైన. ఈ రాత్రి పగలు చర్మ రక్షణ సాధన మీకు అవసరము



పాండ్స్ కోల్డ్ క్రీమ్ మరియు
పాండ్స్ వ్యానిషింగ్ క్రీములను
రెండిటినీ వాడుతూంటే అవి మీ సహజ
సౌందర్యమును బయలు పరచును

చర్మమును మృదువుగను, నిర్మలముగ చేయుటకు రాత్రి వాడే క్రీమ్: మీరు పడుకునే ముందు విశేషమైన పాండ్స్ కోల్డ్ క్రీమ్ వాడండి. అది కొన్ని సెకండ్లలోనే మీ చర్మమునకు కావలసిన సహజమైన నూనెలు మరియు తేమ లోపములను పూర్తిచేసి యధాస్థితికి తెచ్చుటయేకాక దానిని లేతగా మరియు మనోహరముగ ఉంచుటలో మీకు సహకరించును.

పాండ్స్ కోల్డ్ క్రీమ్ అద్భుతముగ చర్మమును శుభ్రపరచును —రోమరంధ్రములు పెద్దవి కాకుండా రక్షణ నిచ్చి. మీ చర్మమును బహునిర్మలముగ. నిష్కళంకముగ ఉంచును.

చర్మమును కాపాడుటకు మరియు సుందరముగ చేయుటకు పగలు వాడే క్రీమ్: తేలికగ మరియు మంచువలెనున్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ పైపైన ముఖమునకు రాసుకుంటే పగటివేళ మీ అందమును అధికము చేస్తుంది. మనోహరము, నిష్కళంకమైన చర్మమును పాడుచేయు దుమ్ము. సూర్యరశ్మి మరియు వడగాడ్పుల నుండి యిది మీ చర్మమునకు సౌమ్య రక్షణ నిచ్చును. మరియు పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ మరీ దిద్దుగా ఉంటే చర్మమునకు ఒక అద్భుతమైన సాధనము — దీనితో రోమరంధ్రములను అద్ది కళంకము కలిగించే అధికమైన నూనెలు లేకుండా చేయవచ్చును.

పాండ్స్

కోల్డ్ క్రీమ్

వ్యానిషింగ్ క్రీమ్



ప్రతి చోట అందమైన స్త్రీలు వారి సౌందర్య రక్షణకు యీ సులభమైన రెండు క్రీములనే వాడుతున్నారు. మీరూ వారివలె పాండ్స్ కోల్డ్ క్రీమ్ రాత్రి మరియు పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ పగలు వాడండి. త్వరలోనే నవవికసిత పుష్పమువలెనున్న మీ ముఖమును చూచుకొని మీరు చకితులౌతారు.

P 1633

★ కొత్త వివాహ నియమాలు ★

దంపతు లిద్దరిలో ఏ ఒక్కరైనా రెండవ వారిని కేవలము ద్వేషించినంతమాత్రాన ఆ వివాహము రద్దుచేసుకోవటానికి వీలు లేదు. వివాహము రద్దు చేసుకోవటానికి భార్యాభర్తలకు ఒండొరుల సమ్మతి కావలసి ఉంటుంది. పురుషుడు తన ప్రాణరక్షణ కొరకు విడాకులను కోరినట్లయితే, ఆ వివాహమువల్ల ఆమెద్వారా తనకు లభించిన ధన కనక వస్తువాహనాలను తిరిగి ఆమెకు ఇవ్వవలసిఉంటుంది. స్త్రీ తన ప్రాణ సంరక్షణార్థము విడాకులను కోరినట్లయితే అతని ఆస్తిలో తనకు సంక్రమించినదానిని వదులుకోవలసి ఉంటుంది. మొదటి నాలుగు విధములు అగ్నిసాక్షిగా జరుపబడినవి కనుక వాటిని రద్దుచేయటానికి వీలులేదని ఆయన వాదము.

కౌటిల్యుని శాస్త్రము ననుసరించి భర్తచేత విడువబడిన స్త్రీ, పెనిమిటివద్దనుండి మనోవర్తిని పొందే అధికారము కలిగి ఉన్నది. ఈ మనోవర్తి భర్త ఆదాయాన్ననుసరించి నిర్ణయింపబడుతుంది. ఆమె అతడి బంధువర్గపు సంరక్షణలో ఉన్నట్లయితే అతడు మనోవర్తి ఇవ్వవలసిన అవసరములేదు.

కొన్ని పరిస్థితులలో స్త్రీలకు పునర్వివాహము చేయవచ్చునని కౌటిల్యుడు నిర్ణయించాడు. బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్ర కులాలలో సంతానములేని స్త్రీలకు, భర్తలు దేశాంతరగతులయిన పరిస్థితులలో తిరిగి వివాహము చేసుకునే అధికారము వున్నది.

వరుడు బ్రాహ్మణకులజుడైవుండి, విద్యాభ్యాసముకొరకు స్వదేశము విడిచి వెళ్ళినట్లయితే 10 సంవత్సరముల కాలము అతని కొరకు ఎదురుమాసి, రానిపక్షమున, తిరిగి స్త్రీ వివాహము చేసుకొనవచ్చు. అతడు రాజానుచరుడై ఇతరదేశము వెళ్ళినట్లయితే, అతడు సజీవుడు కాడనువార్త చేరు వరకూ ఆస్త్రీ తిరిగి వివాహము చేసుకొనరాదు.

రసాయన్ బిళ్ళలు



(GOLD & PEARL)
మీకు ఆకలిని కలిగించి, ఆరోగ్యాన్ని, బలాన్ని వయస్సు లింగభేదంతో నిమిత్తం లేకుండా యిస్తుంది. ట్యూబ్ వెల రు 4 (వి పి అదనం)
రసాయన ఆయిల్ (With-Musk) ప్రాచీన మహర్షులు.
అన్ని రకాల బలహీనతలను పోగొట్టటంలో మేటి అన్నారు సీసా వెల రు. 6/- (వి. పి. అదనం)
Mrs. P. Devee. F. D. S. (A.P.) Calcatta-40.
స్టాకిస్టు: ఇండో మెడికల్ సప్లయిన్,
29, వైద్యనాథ్ మొదలి వీధి; మద్రాసు - 1.

మొదట నాలుగురకములలో ఏ ఒక విధానము ననుసరించిగాని వివాహమయిన స్త్రీ, పెనిమిటిచేత విడువబడినట్లయితే, తిరిగి వివాహము చేసుకోవటానికి 7 నెలల కాలము ఎదురుచూడవలసి వుంటుంది. భర్త భార్యకు చెప్పి వెళ్లినపక్షములో 1 సంవత్సర కాలము ఎదురుచూడవలసి వుంటుంది. వివాహకాలములో శుల్కము వధువుకు పూర్తిగా కాక, ఒక భాగము మాత్రమే లభించినట్లయితే, మూడు నెలలకాలము పెనిమిటిరాకకై వేచి వుండాలి. పూర్తిగా శుల్కమును పొందిన స్త్రీ అయిదు నెలల కాలము ఎదురుచూడవలసి వుంటుంది. నిర్ణీతమైన కాలము గడచిన తరువాత ఆమె తనకు యిష్టమువచ్చిన వ్యక్తిని న్యాయాధీశుని అనుమతితో వివాహమాడవచ్చును.

కౌటిల్యుడు స్త్రీపునర్వివాహాన్ని నియోగమునూ ఆమోదించాడు. భర్త దేశాంతరగతుడైనా, సాధువులలో కలసినా, లేక మృతిచెందినా అతడి భార్య సంతానవతి కానట్లయితే ఏడుమాసముల కాలము అతడి కొరకు ఎదురుచూడవలసివుంటుంది. ఆ నిర్ణీత కాలము గడచినతరువాత ఆమె తన పెనిమిటి సోదరులను వివాహమాడవచ్చునని కౌటిల్యుడు నిర్ణయించాడు. పెనిమిటి సోదరులు లేనట్లయితే పెనిమిటి గోత్రజుని వివాహమాడవచ్చునని ఆయన నిర్ణయము.

స్త్రీలకు పునర్వివాహాధికారము యిస్తూ కౌటిల్యుడు కొన్ని నియమాలేర్పరచాడు. స్త్రీ చనిపోయిన తన పెనిమిటి రక్తసంబంధీకునితప్ప ఇతరులను వివాహము చేసుకోటానికి వీలులేదు. ఈ నిబంధనను యే స్త్రీ అయినా ఉల్లంఘించినట్లయితే ఆ స్త్రీయే కాకుండా, ఆ వివాహానికి ఆమోదించినవారూ, వివాహము చేసినవారూ శిక్షార్హులు.


స్త్రీ పునర్వివాహానికి సమ్మతించిన కౌటిల్యుడు స్త్రీ పెనిమిటి చనిపోయినతరువాత మనోనిగ్రహము కలిగి, బ్రహ్మచర్య దీక్షనవలంబించి పరమపవిత్రముగా జీవితము గడపటము ఉత్తమమని భావించాడు. కాని వివాహము చేసుకొనదలచిన స్త్రీలకు తగిన అవకాశాలను కల్పించాడు. స్త్రీ పునర్వివాహములో వరనిర్ణయాధికారము ఆమె మొదటిమామగారి కర్తవ్యమూ బాధ్యత అని నిర్ణయించాడు.

భార్య జీవించిఉండగా పునర్వివాహము చేసుకోదలచిన పురుషుడికి స్త్రీలకంటె నిబంధనలు అధికముగా అనుసరించవలెనని కౌటిల్యుడు శాసించాడు. వేచిఉండవలసిన నిర్ణీతకాలము స్త్రీలకంటె అధికముచేశాడు. ఈ క్రింది సందర్భాలలోమాత్రమే పురుషుడు తిరిగి వివాహము చేసుకోవటానికి కౌటిల్యుడు అనుమతించాడు. భార్య సంతానవతి కానట్లయితే, సంతానములో అందరూ మృతిచెందినట్లయితే పురుషుడు పునర్వివాహము చేసుకోవటానికి 8 సంవత్సరాల కాలము వేచిఉండవలసి ఉంటుంది. ప్రథమ భార్య మృతశిశువులను ప్రసవించునదైనట్లయితే 10 సంవత్సరములకాలము ఆగవలసి ఉంటుంది; స్త్రీ శిశువులనుమాత్రమే ప్రసవించునదయితే 12 సంవత్సరముల కాలము ఆగవలసి ఉంటుంది. భర్త పురుష సంతానము నపేక్షించినట్లయితే ఈ పై పరిస్థితులలో ఆయా నిబంధనల ననుసరించి తిరిగి వివాహము చేసుకోవలసి ఉంటుంది.

ఈ నియమాలను ఉల్లంఘించిన పురుషుడు శిక్షాపాత్రుడు. మొదటి భార్యకు శుల్కమే కాకుండా, కొంత ఆస్తినీ, పరిహారముగా కొంత పైకమును చెల్లించవలసి ఉంటుంది. ఇదిగాక 24 పణములు ప్రభుత్వానికి జరిమానాగా చెల్లించుకోవలసి ఉంటుంది. వివాహకాలమందు, వరుడు వధువు తలిదండ్రులకు చెల్లించవలసిన శుల్కాన్ని ఏ కారణముచేతనయినా చెల్లించకపోయినట్లయితే, పునర్వివాహ కాలమందు ప్రథమ కళత్రానికి విధిగా చెల్లించవలసి ఉంటుంది. ఈమెకు చెల్లించవలసినవి చెల్లించిన తరువాతనే, పురుషుడు తిరిగి వివాహము చేసుకొనగలుగుతాడు. ఈ చెల్లించటములో అతడు ఏ విధమయిన నిర్లక్ష్యము చూపినా న్యాయస్థానము విధించిన 96 పణముల జరిమానాను ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది.

కౌటిల్యుడి న్యాయసూత్రాలు స్త్రీలకు పురుషులకంటె అనుకూలముగా రచింపబడ్డాయి పురుషుడు దుశ్శీలుడైనప్పుడు, దేశాంతరగతుడైనప్పుడు, రాజద్రోహిఅయినప్పుడు, అతడివద్ద ఆమెకు ప్రాణరక్షణ లేనప్పుడు, అతడు కులభ్రష్టుడైనప్పుడు, అతడిభార్య తిరిగి వివాహము చేసుకోవటానికి కౌటిల్యుని శాస్త్రము అంగీకరిస్తున్నది. రజస్వలానంతరము మూడు సంవత్సరముల కాలము దాటినా స్త్రీ వివాహము చేసుకోకపోవటము నింద్యమని కౌటిల్యుడి శాస్త్రము పేర్కొన్నది.

ధర్మశాస్త్రాలు ప్రాచీన కాలములో కూడా ఒక విధముగా లేవు. ఆయా కాలాలలోని సమాజ పరిస్థితుల ననుసరించి ధర్మము నిర్వచింపబడి శాసనము చేయబడ్డది. కనుకనే కౌటిల్యుడువ్రాసిన ధర్మశాస్త్రానికీ, పరాశరుడు వ్రాసినదానికి, మనువు వ్రాసినదానికీ వ్యత్యాసాలు కనబడుతాయి. ఆ విధముగానే సమాజావసరాలను అభ్యుదయాన్ని దృష్టియందుంచుకొని హిందూ న్యాయశాస్త్రము క్రోడీకరింపబడ్డది. ★



మధురకీర్తి

★

వజ్రపాణి

మిథిలాపురి నృపతి పేరు
మధురకీర్తి మహారాజు.
అతని ధైర్యసాహసములు
స్తుతించెదరు కవులెల్లరు.

మధురకీర్తి సుందరుడు.
వ్యధ లెట్టివో యెఱుగడు.
అతనికిగల రాజ్యాశకు
అంత మనసదే లేదు.

చిట్టిపొట్టి రాజ్యములను
పొట్టబెట్టుకొనిన పిదప,
మగధరాజ్య మాక్రమింప
మధురకీర్తి తలపోసెను.

మిథిలాపుర రాజువలె మ
గధ రాజును ధైర్యశాలి!—
ఆ యిరుపురి సైన్యములు మ
హా యుద్ధము జరిపినవి.

మగధరాజు యుద్ధములో
మరణించెను! వాని సైన్య
ములు చెల్లాచెదురైనవి,
ముదమందెను మధురకీర్తి.

మగధరాజు కూతురైన
మంజులాంగి సౌందర్యము
వినిన మధురకీర్తికి ఆ
మెను పెండ్లాడగ మనసై—

ఆమె యుండు అంతఃపుర
సీమ జేరె నా నరపతి.
తన వాంఛను విన్నవించె—
తన్వంగి యిటుల పలికెను:

"నిను పెండ్లాడుట యన నా
కును సంతోషమె రాజా!
చిన్న కోర్కె తీర్పుము, నీ
కనొక్కటి కావలెను."

మధురకీర్తి వెనుకాడగ
మంజులాంగి నవ్వినది—
"ఇది రాక్షస వాంఛ!" యనెను
హృదయము మండిన నరపతి.

"కారణరహితముగ మగధ
వీరుల జంపుట పుణ్యమె?
ఒక్క కంటికై యేడ్పెద,
వక్కటా! నీ రాక్షసమున

స్త్రీలును, వృద్ధులు, శిశువులు
వేలకొలది మరణించిరి!"
అని పలికిన మంజులాంగి
యడుగులపై వ్రాలె నృపతి

బాలసాహితి సీరియల్ . . . . . .

మార్టిన్ రాట్లర్

మూలం: [illegible]

"బ్రెజిల్ దేశం పోర్చుగల్ రాజు స్వాధీనమైన తర్వాత, ఇక్కడికివచ్చి స్థిరపడిపోయిన మొదటి తరం వారిలో మా పూర్వీకులు కూడా ఉన్నారు," అని సన్యాసి మొదలుపెట్టాడు "1500 సంవత్సరంలో కొలంబస్ స్నేహితుడైన విన్సెంట్ యానెజ్ పింజన్ అనే అతడు బ్రెజిల్ దేశం కనిపెట్టాడు. మరుసటి సంవత్సరం పోర్చుగీసు సేనాధిపతి పెడ్రో ఆల్వారెజ్ కబ్రాల్ పోర్చుగీసురాజు పేరిట ఈ దేశాన్ని స్వాధీనం చేసుకున్నాడు. 1503 లో అమెరికస్ వెస్పూసియస్ 'బే ఆఫ్ ఆల్ సెయింట్స్' అనే అఖాతాన్ని కనిపెట్టి బ్రెజిల్ నుండి కలప, కోతులు, చిలకలు స్వదేశానికి తీసుకుపోయాడు. ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకోడానికి ఎవరూ సిద్ధపడలేదు. ఈ విశాల దేశంలోని సహజ సంపద చాలా సంవత్సరాలవరకూ మానవుడికి కొరగాకుండానే ఉండిపోయింది. ఇక్కడఉండే ఇండియన్లకు దాని విలువ తెలియనందువల్ల ఆ సంపద వృథా అయిపోతుండేది.

1510 సంవత్సరంలో తుపానుపట్టిన చీకటి రాత్రివేళ, బ్రెజిల్ తూర్పుతీరాన ఒక అడవిలో బలిష్ఠులు, దిగంబరులు అయిన ఆటవికులు కొందరు చలిమంట వేసుకుని కూర్చున్నారు. వారు కూర్చున్న చోటనే ఈనాడు పెద్దనగరాల్లో ఒకటైన బాహియా ఉన్నది ఆరోజుల్లో అదంతా అరణ్యం. వారు కూర్చున్నచోటికి దగ్గరగాఉన్న సముద్రశాఖనే 'ఆల్ సెయింట్స్ బే' అంటారు.

ఆటవికులు తీరాన నుంచుని ఆతృతగా చూస్తూ, గబగబ మాట్లాడుకుంటున్నారు. ఆ తుపాను రాత్రి వారికి సముద్రంలో దూరంగా ఒక నౌక కనిపించింది. అంతకు కొన్నేళ్ళముందు కొన్ని పెద్ద నౌకలు, వాటిలో శ్వేతజాతివారు ఆ తీరానికి రావడం వారికి తెలుసు. వారికి కనబడినది చిన్న నౌక. తుపాను తాకిడికి అది ధ్వంసమైపోతున్నది. అందులోని మనుష్యులు అట్లాంటిక్ సముద్ర తరంగాలతో హోరాహోరి పోట్లాడుతున్నారు. వారి ధైర్యసాహసాలు వర్ణనాతీతం. కాని తుపాను ఎక్కువౌతున్నదే తప్ప తగ్గడంలేదు. తెరచాప కొయ్యలు విరిగిపోయాయి; తెరచాపలు చిరిగిపోయాయి. ఇంతలో, నేల కనిపించగానే అందరికీ సంతోషం కలగడం, అంతలోనే, ఒక పెద్ద తరంగం తాకిడికి చుక్కాని కాస్తా విరిగి కొట్టుకుపోవడం జరిగింది.

ఎలాగైతేనేం ఆ ఓడ ఒడ్డుకు కొట్టుకువస్తోంది. ఒడ్డున దిగంబరులైన ఆటవికులు నుంచుని సంభ్రమాశ్చర్యాలతో దాన్నే చూస్తున్నారు. వారిలో కొందరు అమెరికస్ వెస్పూసియస్, కబ్రాల్ ప్రయాణంచేసిన నౌకలను చూసిఉన్నారు. తెల్లవాళ్ళనుగూర్చి, వారు

అనువాదం: నండూరి రామమోహనరావు

ప్రయాణంచేసే సముద్రపు కోటలనుగూర్చి బ్రెజిల్ దేశ మంతటా మారుమ్రోగిపోయింది. ఎక్కువమంది సముద్రపు కోటలవంటి నౌకలనుగూర్చి వినడమేకాని చూడలేదు. అందుచేత తమకు అభిముఖంగావచ్చే ఆ నౌకను అమిత కుతూహలంతో చూస్తున్నారు.

నౌక అతివేగంగా కొట్టుకువస్తోంది దానివేగం చూస్తే అది ఒడ్డు చేరడంతో ఆగక నేలమీద కూడా అదే వేగంతో పోతుందేమోననిపించింది. అది దగ్గరకి వస్తున్నకొద్దీ ఆటవికులు భయంతో వెనుక వెనుకకు తగ్గారు. ఇంతలో ఏదో పెద్ద దెబ్బ తగిలినట్లు ఓడ ఊగిసలాడింది. ఓడలో వారందరూ గొల్లుమన్నారు. ఆ గోల ఒడ్డునఉన్న వారికి కూడా వినబడింది. తెర చాప కొయ్యలు నీటిలోపడి కొట్టుకుపోయాయి. ఒక పెద్ద అల వచ్చి ఓడను అమాంతంగా తీరానికి గిరవాటేసింది. అక్కణ్ణించి ఓడ ఇక కదలలేకపోయింది. అలల దెబ్బలు సుత్తిదెబ్బలవలె తగిలి ఓడ పగిలిపోసాగింది. ఓడలో వారు ఒక పెద్ద తాడు ఒడ్డుకు విసిరేశారు. ఆటవికులు ఆ తాడు పట్టుకుని ఒక రాతికి కట్టివేశారు. ఆ తాడు ఆధారంచేసుకుని నావికులందరూ సురక్షితంగా ఒడ్డుకు వచ్చారు. అయితే సముద్రంలో మృతి తప్పించుకున్న ఆ పోర్చుగీసు నావికులు ఒడ్డుకు రాగానే ఆటవికులచేత వధించబడ్డారు.



అందరూ చనిపోయారు, నౌక కెప్టెన్ డీగో ఆల్వారెజ్ కారిమో అనే ఆయన మాత్రం మిగిలాడు. తాడు సహాయంతో ఒడ్డుకు వచ్చేటప్పుడు ఓడలో నుంచి తూటాలు నింపిన ఒక తుపాకిని, కొన్ని తూటాలను వెంట తీసుకొచ్చాడు. తుపాకి తడిసిపోకుండా గుడ్డలు చుట్టాడు. ఒడ్డుకు రాగానే అతన్ని కూడా ఆటవికులు చుట్టుముట్టి వధించబోయారు. కాని మంచి బలశాలి కావడంవల్ల వారినుండి తప్పించుకుని అడవి లోకి పరుగెత్తాడు. కాని ఆటవికులు అవలీలగా అతన్ని పట్టుకున్నారు. ఇంతలో ఒక ఇండియన్ యువతి అడ్డం వచ్చింది. ఆమె ఆటవికుల నాయకుని కూతురు. ఆమెను చూసి ఆటవికులు కొంచెం జంకారు. కాని మరునిమిషంలో కెప్టెన్‌ను మళ్ళీ పట్టుకున్నారు. ఈ గందరగోళంలో అతని చేతులో ఉన్న తుపాకి పేలింది. కాని అదృష్టవశాత్తు ఎవరికీ తగలలేదు. ఆ ధ్వనికి భయపడి ఆటవికులు చెల్లాచెదరైపోయారు.

కెప్టెన్ కారిమో తెలివైనవాడు. వందలకొలది ఆటవికుల మధ్య తానొక్కడే నిలబడి దెబ్బలాడడం గాని, పారిపోవ ప్రయత్నించడం గాని వృథా అని గ్రహించాడు. తుపాకి అంటే వారికి భయమని కూడా గ్రహించాడు. అందుచేత ధైర్యం తెచ్చుకుని, ఆటవికులను దగ్గిరికి రమ్మని సైగ చేశాడు. భయపడుతూ, తుపాకిని బెదురుగా చూస్తూ ఆటవికులు మెల్లిమెల్లిగా దగ్గిరికి వచ్చారు. వారిలో వేషాన్ని బట్టి, భూషణాలని బట్టి నాయకుడులాగా కనిపించిన ఒకడిదగ్గిరికి పోతూ కెప్టెన్ కారిమో తన చేతిలోని తుపాకిని కిందపడవేసి దాన్ని తొక్కుతూ వెళ్లాడు. నాయకునికేసి తన చెయ్యి జాపాడు. నాయకుడు తెల్లబోయి చూశాడు. తను కూడా చెయ్యి జాపాడు. కెప్టెన్ అతని చెయ్యి పట్టుకుని స్నేహపూర్వకంగా బుజంమీద తట్టాడు. నాయకుడు కెప్టెన్ దుస్తులను వింతగా పరీక్షించాడు. మిగతా ఆటవికులు తమ నాయకుని స్నేహధోరణి చూసి మెత్తబడ్డారు. తెల్లవాడిని తమ నెగడువద్దకు తీసుకుపోయారు. అక్కడ అతడు తడిబట్టలు విప్పివేసి వారు పెట్టిన ఆహారం తిన్నాడు. ఈవిధంగా డీగో కారిమో బ్రతికాడు.

మర్నాడు పొద్దున ఇండియన్లు సముద్రంఒడ్డుకు పోయి రాత్రి విరిగి కొట్టుకువచ్చిన నౌకలోని సామగ్రి అంతా సేకరించి తెచ్చుకున్నారు. వారు ఆ పనిచేస్తుండగా కారిమో ఒక నీటికొంగను తుపాకితో చంపి పడవేశాడు. దీంతో అతనంటే ఆటవికులలో భయం, భక్తి హెచ్చిపోయాయి. ఓడలోనుంచి చాలా తుపాకి మందును, తూటాలను అతడు మళ్ళీ వెళ్ళి తీసుకువచ్చాడు. ఈ కారణంచేత కూడా అతని ఆధిక్యం నిలిచింది. అజ్ఞానులైన ఆటవికుల మధ్య అతడు చాలా గొప్పవాడైపోయాడు. కాలక్రమాన అతడు నాయకుని కూతురును వివాహం చేసుకున్నాడు. బాహియా నగరాన్ని అతడే స్థాపించాడు. అతనికి ఆటవికులు 'కారామూరూ' (నిప్పుమనిషి) అని పేరుపెట్టారు.

ఆతరవాత క్రమంగా పోర్చుగీసువారనేకులు బ్రెజిల్ తీరాన దిగి స్థిరనివాసాలు ఏర్పరచుకున్నారు. అయితే పోర్చుగీసువారితో స్పెయిన్ దేశస్థులు పోటీ పడ్డారు. డచ్చివారు, ఇంగ్లీషువారు కూడా వచ్చారు. అయినా దేశంలో అధికారం పోర్చుగీసుల చేతులోనే ఉన్నది. ఈలోగా డీగో కారామూరూకు ఒక కొడుకు పుట్టాడు. అతడు పెద్దవాడై చాలా భూమి సంపాదించాడు. అతని కొడుకులు కూడా వ్యవసాయదారులై విలువైన పంటలు అనేకం పండించారు. వీరు తమ తాత, తండ్రులు నివసించిన చోటికి దూరంగా భూమి సంపాదించి అక్కడ సేద్యం మొదలుపెట్టారు. వారి సంతతివారు అక్కడే అనేక తరాలపాటు నివసిస్తూ వచ్చారు.

1808 వ సంవత్సరంలో పోర్చుగల్ మీదికి నెపోలియన్ దండెత్తిపోయి ఆక్రమించుకున్నాడు. పోర్చుగల్ రాజు ఆరవ జాన్ బ్రెజిల్ దేశానికి పారిపోయి వచ్చాడు. బ్రెజిలియన్లు తమ రాజును సంతోషపూర్వకంగా ఆహ్వానించారు. జాన్ రాజు దేశాన్ని అభివృద్ధి చేయడానికి అనేక పథకాలు తలపెట్టాడు. రేవులలోకి ఏ దేశపు నౌకలైనా రావచ్చునని అనుమతించాడు. బ్రెజిల్‌కు వలసదేశపు స్థాయి తొలగించి స్వాతంత్ర్యం ఇచ్చాడు. వార్తాపత్రికలు నెలకొల్పి వాటికి స్వేచ్ఛ ఇచ్చాడు. విద్యాభివృద్ధికి, పరిశ్రమల అభివృద్ధికి దోహదంచేశాడు.

'నిప్పు మనిషి' సంతతివారిలో ఆఖరివాని పేరు పాడర్ కారామూరూ. అతడు బ్రెజిల్ రాజధాని యైన 'రయోడి జనీరో'లో ఒక ఇంగ్లీషు వర్తకునివద్ద కొంతకాలం ఉన్నాడు. జాన్ రాజు తిరిగి పోర్చుగల్ వెళ్ళిపోయిన తర్వాత, అతని కుమారుడు మొదటి డామ్ పెడ్రో చక్రవర్తి కావడానికిముందు బ్రెజిల్ దేశంలో జరిగిన అల్లర్లలో పాడర్ కారామూరూ తమ్ముడు ఒకడు చనిపోయాడు. అప్పటినుంచీ పాడర్ కారామూరూకు రాజకీయాలన్నా, చర్చి వ్యవహారాలన్నా అసహ్యం పుట్టింది. తమ్ముని దుర్మరణం అతన్ని కుంగదీసింది. అన్నిటిమీదా విరక్తిపుట్టి ప్రజలకు దూరంగా నివసిస్తూ ప్రకృతి సౌందర్యాన్ని పరిశోధిస్తూ కాలం గడిపాడు. అయినా అతనికి మనశ్శాంతి లభించలేదు. అప్పుడు అతడు దైవచింతనలో పడ్డాడు. బైబిల్‌లో విషయాలను అవగతం చేసుకున్నాడు. దాంతో అతనికి కొంత వేడిపుట్టింది. సోమరిగా కాలం గడపడం తప్పని తోచింది. ఏది చెయ్యడానికి తోచక, ఊరికే ఉండలేక, దేశంలోని దూరప్రదేశాలతో వర్తకం చేయసాగాడు. అతడు నివసించే కుటీరం చుట్టూఉన్న పొలాలను పండించాడు. తుపాకితో వేటాడిఆహారం సేకరించాడు. అలాగే కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

"ఇదీ, నా దేశం కథ, నా కథ!" అని సన్యాసి ముగించాడు.

"మీ కథా?" అని మార్టిన్ అడిగాడు.

"అవును. నాపేరే పాడర్ కారామూరూ."

"ఒహో. సరి సరి. మరి మీ దేశంలో ఏంవర్తకం జరుగుతుందో చెప్పలేదు," అడిగాడు మార్టిన్.

"ఇదిగో, ఇంకో చుట్ట ముట్టించి చెబుతాను. ఈ చుట్ట బాగా కాలటంలేదు. మీ పైపులో పొగాకు ఉందా?" అని సన్యాసి షార్కీని అడిగాడు.

"అయిపోయిందండి మిస్టర్ కారీమూరూ! మరికొంచెం పొగాకు ఇప్పించండి" అని షార్కీ తన పైప్‌లో బూడిద దులిపాడు.

మరికొన్ని నిమిషాలలో పొడుగాటి చుట్ట, పొట్టి పైపూ గుప్పుగుప్పున పొగ వదలసాగాయి. సన్యాసి మళ్ళీ అందుకున్నాడు:

ఈ దేశం చాలా పెద్దది. భాగ్యవంతమైనది. కాని ఏం లాభం. ప్రజలు సోమరులు. ఏం చెయ్యడానికీ ఉత్సాహంలేదు. పని చాలా జరుగుతోందనుకోండి. కాని ఇంకా ఎంతైనాజరగడానికి అవకాశంఉంది.

బ్రెజిల్ దేశం దక్షిణ అమెరికా ఖండంలో దాదాపు సగం ఉంది. 2600 మైళ్లు పొడుగు, 2500 మైళ్ళు వెడల్పు ఉంది. అంటే యూరప్ ఖండంకంటె పెద్దదన్నమాట. పెద్ద పెద్ద పర్వతాలేం లేకపోయినా ఉన్నవాటిమీదే గొప్ప అరణ్యాలున్నాయి. అయితే అరణ్యాలకంటె ఎక్కువగా పచ్చిక మైదానాలు విశాలమైనవి ఉన్నాయి. అమజాన్ నది ఒడ్డునఉన్న పచ్చిక మైదానాలు ఫ్రాన్సుకు 6 రెట్లు పెద్దవి. ఒక మైదానం 600 మైళ్ల పొడుగు, 400 మైళ్ళ వెడల్పు ఉంది. సరస్సులు ఎక్కువ లేవు. ఒక్కటే పెద్ద సరస్సు ఉంది. అది 150 మైళ్లు పొడుగు ఉంది. కాని చెబితే నదుల సంగతి

చెప్పాలి. అబ్బ ఏం నదులనుకున్నారు? బ్రెజిలియన్ నదులంత గొప్ప నదులు ప్రపంచంలో ఎక్కడా లేవు. పొడవులోను, వెడల్పులోను, లోతులోనూ కూడా గొప్పవి. ఎక్కడా జలపాతాలు లేకుండా హాయిగా ఉంటాయి. ప్రయాణాలకు అద్భుతంగా ఉంటాయి. కాని ఈ నదులమీద ప్రయాణం చేసే పడవలు మాత్రం వేళ్ళమీద లెక్కపెట్టవచ్చును. నౌకాప్రయాణాలు ఇంకా వృద్ధి కాలేదు. ఉత్తర బ్రెజిల్‌లో నదులు గజిబిజిగా అల్లుకుపోయిఉంటాయి. అద్భుతమైన నదులు, ఆహా!

సరే. ఇక మా పంటలు. మేము పంచదార, కాఫీ ఎగుమతి చేస్తాము. ఖనిజాల్లో బంగారం, వెండి, సీసం, తగరం, పాదరసం, వజ్రాలు, రత్నాలు అన్నీ ఉన్నాయి.

"వజ్రాలా?" అని అదిరిపడ్డాడు బార్నీ. "అరె. వజ్రాలే? చూడాలనుందండి మిస్టర్ కారీమూరో! ఎంత బావుంటాయో తళతళ మెరుస్తూ. వజ్రపుగనులు ఇక్కడికి ఎంత దూరం?"

"అబ్బో, చాలాదూరంలో ఉన్నాయి. ఆతరవాత మేము రకరకాల కలప ఎగుమతి చేస్తాము. మందులు, చర్మాలు కూడా ఎగుమతి చేస్తాము. మా మైదానాల్లో అడవి పశువులు చాలా ఉంటాయి. గుర్రాలమీద ఎక్కి వాటిని వేటాడుతారు. 'లాసో' అనబడే ఒక రకమైన ఉచ్చుతాడుతో వాటిని పట్టుకుంటారు."

"ఆహా, ఆ మైదానాల్లో స్వారీచేయాలని ఉంది నాకు" అన్నాడు మార్టిన్.

"ఇంకా రకరకాల పళ్లు, ధాన్యాలు, కూరలు పండుతాయి. అనేకరకాల జంతువులు ఉంటాయి. వీటిలో చాలామటుకు మీరు చూశారు. ఇంకా చూడవలసిన వింత వృక్షాలు, వింత జంతువులు లేకపోలేదు. నెమ్మదిగా వాటిని మీకు చూపిస్తాను.

ఈ దేశంలో పోర్చుగీసుల సంతతివారు, స్వదేశీయులైన రెడ్ ఇండియన్లు, నీగ్రోలు నివసిస్తున్నారు. నీగ్రోలు కొందరు స్వతంత్రులు, కొందరు బానిసలు. ఇండియన్లు దాదాపు దిగంబరంగానే తిరుగుతారు. దేహాలకు రంగులు పూసుకుంటారు. వెర్రిగా ఆభరణాలు ధరిస్తారు. దేశంలో రోమన్ కాథలిక్ మతం ప్రబలంగా ఉంది. కాని అన్ని మతాలవారూ స్వేచ్ఛగా ఉండవచ్చును. బ్రెజిల్ దేశం ఏనాటికైనా గొప్ప అభివృద్ధి పొందుతుందని నా నమ్మకం," అన్నాడు సన్యాసి.

"వజ్రపు గనుల మూలాన బాగా లాభాలు వస్తాయా?" బార్నీ మనస్సంతా వాటిమీదే లగ్నమై ఉంది.

"ఆ, వస్తాయి. ప్రతి ఏడాది చాలా వజ్రాలు దొరుకుతాయి. దేశంలో దొరికిన బంగారం, వజ్రాల విలువలో అయిదోవంతు ప్రభుత్వానికి పోతుంది. ఈమధ్య ఒక వజ్రం దొరికింది. దాని వెల 40 వేల పౌనులు."

ఒక పెద్ద ధూమశరంగాన్ని వదులుతూ బార్నీ "అయ్యబాబో 40 వేలే" అని గుండెలు బాదుకున్నాడు. "మరి అయితే అందరూ వజ్రాల గనులు తవ్వక వెధవ వ్యవసాయం చేస్తారేం?"

"ఎందుకంటే, మనుషులు వజ్రాలుతిని బతకలేరు కనక."

"అవును నిజమే సుమీ" అన్నాడు బార్నీ.

మార్టిన్ ఉయ్యాలలో పడుకుని తన మిత్రుడికి వజ్రాలమీదగల ప్రేమకు పగలబడి నవ్వాడు.

"అంతేకాదు. వజ్రాల వ్యాపారం ఏమంత లాభసాటికాదు" అన్నాడు సన్యాసి. "పొలం దున్నుకుని బతికేవాడు అందరికంటె ఎక్కువ సుఖపడతాడు. రెండేళ్ళలో కాఫీ, పంచదార ఎగుమతులమీద వచ్చినంత డబ్బు 80 ఏళ్ళలో దొరికిన వజ్రాలమీద కూడా రాదు. ఏమైనా బ్రెజిల్‌లో మనుషులు సుఖంగాలేరు. గొప్పదేశం కావడానికి తగినఅవకాశాలన్నీ ఉన్నాయి. అయినా బ్రెజిల్ గొప్పదేశం కాలేకుండా ఉన్నది."

"ఎందుచేత?" అని మార్టిన్ అడిగాడు. "ప్రజలలో ఉత్సాహం లేకనా?"

"ఉత్సాహం లేకేం, కావలసినంత ఉంది. అజ్ఞానం, మూఢవిశ్వాసాలు, అవినీతి—వీటివల్ల ఈ దేశం చెడిపోతోంది. ముఖ్యమైనది దైవభీతి. అదే లేదు ఇక్కడ," అన్నాడు సన్యాసి.

(ఇంకావుంది)

కాలపురుషుని కేళీవినోదం

మూలం!
థామస్ కెయిన్

★

అనుసరణం!
మధురాంతకం రాజారాం

ఆ ఫ్యాక్టరీ పని చేయడంమాని కొది నెలలయినా యింకా 'భవానీ ఆయిల్ ఫ్యాక్టరీ, ప్రొప్రయిటరు భుజంగరావు' అన్న బోర్డుమాత్రం కాంపౌండు గోడకు వ్రేలాడుతోంది. ఎత్తయిన ఆ ప్రాకారపు గోడ పాతది కావడంమూలాన నెర్రలు పడి, ఇటుకరాళ్ళు అక్కడక్కడా జారి ప్రక్కనే ప్రవహిస్తున్న మురికికాల్వలో పడి వున్నాయి.

మిట్టమధ్యాహ్నం. ఫ్యాక్టరీ పనిచేసే రోజుల్లోనైతే ఆ పాటికి కూలీలందరూ మామిడిచెట్లక్రింద బంతులుతీరి అన్నాలు తినేవారు. ఫ్యాక్టరీ తాలూకు ముఖ్య కార్యాలయంముందు వరండాలో భుజంగరావుగారి బంట్రోతు రంగన్న మాత్రం బెంచీపైన కూర్చుని గోడ కానుకుని కునికిపాట్లు పడుతున్నాడు.

“యంత్రాలు త్రుప్పుపట్టిపోయాయి. కూలీలెప్పుడో పనిమానుకున్నారు. నువ్వుమాత్రం యింకా యిక్కడెందుకు అఘోరించాలి రంగన్నా!” అని ఎవరైనా అడిగితే “ఇది అయ్యగారి ఉప్పుతిని బ్రతుకు నేర్చిన కట్టె బాబూ! ఇక్కడే రాలిపోని” అంటాడు రంగన్న.

రంగన్న కించుమించు అరవయ్యేళ్ళుంటాయి. భుజంగరావు తండ్రి నరసింగప్పయ్యారావుగారి గుర్రానికి మాలీసు చేయడానికి కుదిరిన రోజుల్లో అతడికి యిరవయ్యేళ్ళ ప్రాయం. పేరుకుతగ్గట్టు నరసింగప్పయ్యారావుగారిదొక చిన్న జమీందారీ కుటుంబం. సాలీనా నలభైవేల రూపాయల రాబడితో, మూడంతస్థుల పెద్ద మేడలో దాసదాసీలు అడుగుకు మడుగు లొత్తుతుండగా ఆయన జీవితం హాయిగా గడచిపోయింది.

భుజంగరావు కాలేజి చదువులో, రెండో సంవత్సరం జరుగుతూండగా నరసింగప్పయ్యారావుగారు చనిపోయారు.

తండ్రిగారి మరణంతో భుజంగరావు తన నామమాత్రపు చదువుకు ఒక నమస్కారంపెట్టి, యావత్కాలాన్నీ గుర్రప్పందేలకూ, పేకాటకూ పూర్తిగా వినియోగించాడు. కూర్చుని తింటే కరిగిపోయే ఆస్తి కాదు భుజంగరావుది. కాని అతడు రూపాయి నోట్ల చిల్లపెంకులా చూడ్డంచేత ఆస్తి నానాటికి తీసికట్టయి, పదేళ్ళకు బ్యాంకుల్లోని మూలధనం, బంగారం పోగులెగిరే మాగాణి పొలం హారించుకుపోయి కడకు ఒకటి రెండు మేడలు, తండ్రి హయాంనాటి భవానీ ఆయిల్ ఫ్యాక్టరీ మాత్రం మిగిలాయి.

అప్పటికి భుజంగరావు కొంచెం తెలివి తెచ్చుకుని దుర్వ్యసనాలకు తాత్కాలికంగా స్వస్తి చెప్పి, ఫ్యాక్టరీ కార్యాలయంలో స్థిరంగా కూర్చుని, వ్యాపారంపైన దృష్టి మళ్ళించాడు. ఐనా అతడికి పుట్టుకతో వచ్చిన అవకతవక పనులు చేసే అలవాటు అక్కడ కూడా త్వరగానే బయటపడింది. నానా వ్యాపారంలో సిద్ధహస్తుడూ, విశ్వాసపాత్రుడూ అయిన తల నెరసిన మానేజరు భుజంగరావు కళ్ళకు మోసగాడుగా కనిపించాడు. భుజంగరావు ఆఫీసువ్యవహారాల్లో జోక్యం కలిగించుకున్న మరునాడే అతడి వుద్యోగం వూడి ఆ వుద్యోగం భుజంగరావు చిన్ననాటి స్నేహితుడి కొకడికి లభించింది. ఆ స్నేహితుడి పూర్తి పేరు భుజంగరావుకి సైతం తెలియదు. సంతోషంగా

డి. వి. మూర్తి అని అతడు నడిచిన ఏడెనిమిదేళ్ళలో యంత్రాల్ని అమరించి, కడకు లోకుల్లో వ్యవహరింపబడేవాడు. అతడు మంచి యంత్రాలు మటు ఆఫీసుడబ్బులో సగానికి సగం ఫ్యాక్టరీ అతడి పర్యవేక్షణక్రింద మాయంచేసి, వాటిస్థానే పనికిరాని స్వంత ఖర్చుకు వాడుకుని హాశా

స్తుగా ఏ సుదూరసీమకో వుడా యించిన తర్వాత "డి. కె. మూర్తి అంటే దగాకోరు మూర్తయ్యా భుజంగరావూ" అని చాలామంది భుజంగరావుని ఓదార్చారు.

డి. కె. మూర్తి పలాయనం తర్వాత భుజంగరావు పెద్ద ఎత్తున ఫ్యాక్టరీ మరమ్మత్తులు ప్రారంభించి, అందుకోసం ఎక్కడబడితే అక్కడ అప్పులు చేయసాగేడు. అప్పుల కోసం వేట ప్రారంభించిన రోజుల్లో అతడి ఆస్తి వివరాలనిగురించి యింకా పాతకాలపు అంచనాలతోనే వున్న వడ్డీ వ్యాపారస్థులు తీరా అప్పులిచ్చిన తర్వాత అవి తిరిగివచ్చే అవకాశంలేదని గ్రహించి ఒక్కొక్కరుగా కొంతకాలం, మూకవుమ్మడిగా కొంతకాలం భుజంగరావుపైకి దండయాత్రకు రాసాగేరు. అదీ మన కథా ప్రారంభ దినంనాటి పరిస్థితి.

ఏ రోజు మధ్యాహ్నమయితే రంగన్న వరండాలో బెంచీపైన కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడో సరిగా అదే వేళప్పుడు, ఆ కట్టడంలోని మారుమూల గదిలో పాత కుర్చీలో కూలబడి భుజంగరావు గోడగడియారాన్ని చూస్తున్నాడు!

గంట రెండుకొట్టడానికి యింక అయిదు నిమిషాల వ్యవధిమాత్రమే వుంది.

ఆ వ్యవధి పూర్తయి, గంట రెండుసార్లు టంగుటంగున మ్రోగితే భుజంగరావు అప్పటి తన నిర్ణయం ప్రకారం, తన ఎదుట బల్లపైన చిన్న సీసాలోవున్న ఎర్రటి ద్రవాన్ని నోట్లోపోసుకుని గుటుక్కున మ్రింగేస్తాడు!

ఒకటి, రెండు, మూడు...పెద్ద ముల్లు నాలుగో గడినికూడా సమీపిస్తోంది!

భుజంగరావు కుడిచేయి పైకి లేచి మెల్లగా సీసాపైన వ్రాలింది. ఇక గంట మ్రోగడమే తరువాయి!

"భుజంగరావ్! భుజంగరావ్!" ఎవరో పిలిచారు.

భుజంగరావు త్రుళ్ళిపడ్డాడు. గడియవేసిన తలుపు వేసినట్టేవుంది. కిటికీలు సైతం తెరచిలేవు. పిలుపు మాత్రం చాలా దగ్గిరనుంచే వస్తోంది. భుజంగరావు అది తన భ్రమేమో ననుకుని బిరడా తీయబోయాడు.

"ఇదిగో భుజంగరావ్! నువ్వు అసాలోచితంగా ప్రవర్తిస్తున్నావ్."

భుజంగరావు ఆశ్చర్యంతో లేచి నిల్చున్నాడు.

"నీ జీవితాన్ని తుదముట్టించుకునే హక్కు నీ కెవ రిచ్చారు?" మళ్ళీ ప్రశ్న!

"ఇదేమిటో చాలా విడ్డూరంగా వుంది. నువ్వెవరివో, నాముందు నిలబడి మాట్లాడగూడదటయ్యా" అన్నాడు భుజంగరావు చిరాగ్గా.

"ఉన్నట్టుండి నేను నీకు కనబడితే నువ్వు భయపడిపోవూ!"

"భయపడ్డమా! చిన్నప్పటినుంచీ నాకు చావంటే చెప్పరానంత భయం. అలాటి చావుతోనే ముఖాముఖి ఢీకొనబోతున్నాను. చావుకే తెగించినవాడిని, నా కిప్పు డెవర్ని చూచినా భయంలేదు" అన్నాడు భుజంగరావు.

పైకప్పు చీలినట్టు శబ్దమయింది. మెరుపుమెరిసినట్టు ఒక దివ్యపురుషు డక్కడ అవతరించాడు. అతడు ఆజానుబాహుడు. మందహాస వదనుడు. నవయావనుడు. రెక్కల్ని అల్లలనాడించుకుంటూ ఆ సుందర పురుషుడు క్రిందికి దిగాడు.

"నాకళ్ళని నేనే నమ్మలేకపోతున్నాను. ఎవరయ్యా స్వామీ నువ్వు! అన్ని ఆశలూ వుడిగిన నన్ను కాపాడ్డానికి వచ్చిన ఆపద్బాంధవుడివి కావుగదా!" అన్నాడు భుజంగరావు.

"అబ్బే, ఆపద్బాంధవు డన్న బిరుదం నాకెందుకు భుజంగరావ్! ఆత్మహత్య మహాపాతకమని హెచ్చరించడానికి మాత్రం వచ్చాను నేను."

భుజంగరావు దఢేలున కుర్చీలో కూలబడి "ఐతే నువ్వు వెళ్ళిపోవచ్చు" అన్నాడు.

"చాలా విచిత్రమైనవాడివి భుజంగరావ్! నే నెవరినో తెలుసుకోవాలన్న ఆసక్తి సైతం లేదే నీకు!" సుందర పురుషుడు ఆశ్చర్యం ప్రకటించాడు.

"ఆసక్తిలేకేం స్వామీ! పుష్కలంగా వుంది. ఐనా నా తొందర నాది. పోనీ నువ్వెవరో సెలవియ్యి అలాగైతే!"

"నే నెవరో నీకు తెలుసు."

"నాకా! మీరు తెలుసా!" భుజంగరావు తెల్లబోయాడు.

"అవును. తెలుసును గానీ నువ్వింతవరకూ నన్ను చూడలేదు. నువ్వుమాత్ర మేమిటి! ఈ ప్రపం

అందర్నీ చూస్తుంటాను."

"ఐతే ఏదో ఇంద్రజాలం తెలిసిన మహానీయులన్నమాట!"

"అవు ననుకో. లౌకికాలయిన ఇంద్రజాల, మహేంద్రజాలాలన్నిటినీ తలదన్నే గారడీ విద్య నాది. కోటికి పడగెత్తిన కోటీశ్వరుణ్ణి తిండికి ఠికాణాలేని బికారిగా మార్చి వేయడం, భిక్షాందేహి అని తిరిగే వాడిని మహాదైశ్వర్యంలో ముంచి వేయడం, ఆనంద పారావారంలో తేలిపోయేవాడిపైన పిడుగుల్లాంటి కష్టాలవాన కురిపించడం, ఇలాటివి నా క్రీడలు. చక్రవర్తులు నశిస్తారు. సామ్రాజ్యాలు నామ మాత్రంగా మిగిలిపోతాయ్. సముద్రమున్న చోట భూమి ఏర్పడుతుంది. భూమి సముద్రంగా మారిపోతుంది. నేను మాత్రం నిశ్చలంగా ఈ పరిణామాలన్నిటినీ చూస్తుంటాను."

"ఒక్క నిట్టూర్పయినా విడవరూ!"

"ఊఁహూ. నే నెందరు చక్రవర్తుల్ని కబళించానో, ఎన్ని సామ్రాజ్యాల్ని మింగేశానో, ఎంత ప్రపంచ చరిత్ర నాలో అణిగి మణిగిపోయిందో తెలుసుకోవాలని మానవులు చాలా వుబలాటపడుతారు. కాని వాళ్ళు అల్పజ్ఞులు. ఎంత ప్రయత్నించినా నన్ను పూర్తిగా తెలుసుకోలేరు."

"తమ ప్రభావాన్ని గురించి విన్నది చాలు! తమ పేరేమిటో సెలవిస్తే, ఆ నామధేయాన్ని జపించి మీ దయకు పాత్రుణ్ణవుతాను" అన్నాడు భుజంగరావు దిక్కుతోచక.

"కానీ నాకూ దయకూ చాలా దూరమే భుజంగరావ్!"

కాలికి వేస్తే తలకు, తలకు వేస్తే కాలికీ వేసే ఆ దివ్యపురుషుడి ధోరణి భుజంగరావు కేమాత్రం నచ్చలేదు. అతడు విసుగ్గా "తమ రొక రాగాన నన్ను వదిలిపెట్టేవారిలా లేరు. ఆపదలోనుంచీ నన్ను రక్షిస్తానన్నారు. మాటల్తో కాలహరణం చేసేస్తున్నారు." అన్నాడు

"నువ్వసాధ్యుడివి భుజంగరావ్! నిన్ను రక్షించగలనని నే నెప్పుడు మాటయిచ్చాను?" మళ్ళీ మొదటికే వచ్చాడు దివ్యమంగళ విగ్రహుడు

"పోనీలెండి! ఎవరికర్మ వారిది. నన్నెవరూ రక్షించవలసిన అవసరం లేదు. దయచేసి మీరు సెలవు తీసుకుంటే అదే నాకు పదివేలు."

దివ్యపురుషు డీసారి కొంచెం మెత్తబడి "పోనీ, నీకు వచ్చిన ఆపదేమిటో చెప్పు భుజంగరావ్" అన్నాడు

"అంతగా మీకు నా నోటినుంచే వినాలనివుంటే చెప్పక తప్పుతుందా స్వామీ! కారణాంతరాలవల్ల ఓపి నన్ని అప్పులు చేసేశాను. తమలాటి ఐంద్రజాలికు డెవడైనా సహాయపడితే చెప్పలేను. లేకుంటే ఆ బాకీలు తీరడానికి మార్గమంటూ ఒకటి లేనేలేదు. ఈ అప్పులవాళ్లు నన్ను నక్షత్రకుల్లా పీడిస్తున్నారు. ఆ పీడించే నాటకంలో యిప్పుడు చివరి అంకం జరుగుతోంది. నా అంతట నేనే మంగళం పాడేద్దా మనుకున్నాను. ఇంతలో తమరెవరో. ." అర్ధోక్తిలో ఆగాడు భుజంగరావు.

"మళ్ళీ పొరబడుతున్నావు భుజంగరావ్! ఆ మంగళగీతం పాడవలసినవాడివి నువ్వుకాదు. నేను."

"తమరా మహాప్రభో! ఐతే తాము యమధర్మరాజులన్నమాట!"

"కాదు. ఆ యమధర్మరాజుకు సైతం రాజుని! భుజంగరావ్! నేను కాలాన్ని, అర్థంకాకపోతే కాలపురుషుడి ననుకో"

"అలాగా స్వామీ! ఐతే ఒక మాట చెబుతారూ!" కుతూహలంతో అడిగాడు భుజంగరావు

"ఏమిటది!"

"నే నెప్పుడు చనిపోతాను?"

"అదా! ఆ ఒక్క విషయం తప్ప మరేదైనా అడుగు చెబుతాను."

"పోనీలెండి. ఇప్పుడు నా అప్పుల సమస్య?"

"దానికేం! అది పరిష్కారం కావడానికైతే మార్గం చూపించగలను ఇదిగో, యిదేమిటో తెలుసా?"

"అదే తెలియకపోతే ఈ ప్రపంచంలో నాకు తెలిసేదేమిటండీ!"

"దీన్ని నీకు నేను వరప్రసాదంగా యిస్తున్నాను"

"కన్నుపోయి ఏడుస్తున్న నెమలితో వేటగాడు పరాచికాలాడినట్టుంది స్వామీ యిదంతా! పొల్లాలు

కట్టుకోడానికి వుపయోగించే న్యూసు పేపరు తప్ప మరేదీ దొరకలేదా ఈ దీనుణ్ణి కటాక్షించడానికి?" భుజంగరావు కోపాన్నంతా లోపలే దాచుకుని పైకి వినయంగానే మాట్లాడ్డానికి ప్రయత్నించాడు.

"సమయంవస్తే పూచికపుల్లయినా బ్రహ్మాస్త్రంలా వుపయోగపడుతుంది భుజంగరావ్!" దివ్యపురుషుడు వార్తాపత్రికను టేబిల్ పైకి విసిరాడు.

భుజంగరావు పేపరు చేతికి తీసుకుని పేజీలు తిరగవేస్తూ 'దీన్నెక్కడ సంపాదించారో తమరు! ఇంకా నలగనేలేదు. ఈ వేళ దేనేమిటి!"అంటూ తేదీ పరకాయించి చూచి విస్మయంతో ఉక్కిరిబిక్కిరైపోతూ "అరరే, ఇదేం చోద్యమండీ! ఇది రేపటి న్యూసు పేపరు! రేపు సాయంత్రం ఆరు గంటలకు లోకంలోకి రావలసిన ఈ న్యూసుపేపర్ని దాదాపు యిరవై నాలుగ్గంటలకు ముందే ఎలా సంగ్రహించగలిగారు తమరు? ఈపాటికి అచ్చాఫీసులో అక్షరాల కూర్పయినా ప్రారంభమై వుండదే" అన్నాడు.

"అదే భుజంగరావ్ నా ప్రభావమంటే!" దివ్యపురుషుడి మాటల్లో తీవి తొణికిసలాడుతోంది.

"ఏం ప్రభావమో మరి! ఐనా దీనివల్ల నా అప్పుల సమస్య ఎలా పరిష్కారమౌతుంది?" అంటూ భుజంగరావు కళ్లుమూసుకుని ఆలోచనలో పడ్డాడు.

అతడలా రెండు నిమిషాలు ఆలోచించి వుంటాడు. అంతలో మళ్ళీ పైకప్పు కిర్ కిర్ అని చీలిన శబ్దం వినవచ్చింది. భుజంగరావు ఉలికిపడి కళ్లు తెరిచాడు. ఆశ్చర్యం! దివ్యపురుషుడుమాయమైపోయాడు.

కానీ అతడింకా అక్కడే ఎక్కడో వున్నట్టు భ్రమిస్తున్న భుజంగరావు "అప్పుడే ఏమైపోయారు స్వామీ! ఎక్కడ దాగొన్నారు" అని, బదులు రాకపోవడం చేత "రంగన్నా, ఏమోయ్ రంగన్నా" అని బిగ్గరగా పిలిచాడు.

రంగన్న బయటినుంచే "తలుపు తీయండి బాబూ!" అన్నాడు.

భుజంగరావు ద్వారం దగ్గరికి వెళ్ళి తలుపు తీస్తూ "ఐనా తలుపు మూసింది మూసినట్టుండగానే ఎలా వెళ్ళిపోయాడో?" అని స్వగతం పలుక్కున్నాడు.

రంగన్న ఆశ్చర్యంగా "ఎవరు బాబూ!" అన్నాడు.

భుజంగరావు తన ధోరణే తనదిగా "పోనీ, పోయేవాడు అంత అర్జెంట్‌గా వెళ్ళకపోతే ఒకమాట చెప్పి వెళ్ళగూడదా రంగన్నా" అన్నాడు.

"అలా వెళ్ళిపోవడం మర్యాదస్తుల లక్షణం కాదు బాబూ!" అని రంగన్న లోకసహజమైన మర్యాదని వెల్లడించాడు.

ఈసారి భుజంగరావుకు కోపం వచ్చింది. "వాడికి మర్యాదెక్కడుండి ఏడ్చింది రంగన్నా! ఎవడో వట్టి..."

"పోనీలెండి బాబూ! ఎవడి పాపాన వాడే పోతాడు. ఇంతకీ అతడెలా లోపలికి వచ్చాడంటారు బాబూ?" అని ప్రశ్నించాడు రంగన్న.

"ఎలా వచ్చాడో, ఎలా పోయాడో తెలిస్తే మళ్ళీ వాడినిక్కడికి లాక్కు-రాకపోదునా రంగన్నా! అనవసరంగా నా పనికి అడ్డుతగిలి..."

"ఏమిటి బాబూ తమ పని?"

"అది నీకీపాటికి తెలిసివుండేది వాడు రాకపోయివుంటే?"

"ఇప్పుడైనా మించిపోయిందేముంది బాబూ!"

భుజంగరావు షాకు తిన్నట్టు త్రుళ్ళిపడి "అలాగైతే నన్ను చచ్చిపోమంటావా రంగన్నా" అని అరిచాడు.

రంగన్న ఏడుపుముఖంపెట్టి "బాబ్బాబూ! అలాంటి మాట అనగలనా! కళ్లు పోవూ!" అన్నాడు.

భుజంగరావు గోడగడియారం వైపు చూచాడు - గంట మూడుంపావయింది. టేబిల్‌పైన సీసాకోసం చూచాడు. అదెప్పుడో క్రిందపడి ద్రవం ఒలికిపోయింది. మృత్యుముఖంనుంచి బయటపడ్డట్టు భుజంగరావుకొక ఉత్సాహం కలిగింది. తను చనిపోయివుంటే రెండు గంటలకే చనిపోవలసింది. ఇంక తనకు చావులేదు. ఆమాటకొస్తే తనెందుకు చావాలి?

ఈ మొండిధైర్యంతో భుజంగరావు "చూడు రంగన్నా! నువ్వే కాదు, ఈప్రపంచంలోవున్న కోట్లకొలది మానవులందరూ ఒక్కుమ్మడిగా గొంతెత్తి నన్ను చచ్చిపొమ్మన్నా సరే, నేను చావను. ఆ అప్పులవాళ్లు మాత్రం ఏం చేస్తారో చూస్తాను. ఆ వెధవలు నన్ను కొంచెం పట్టిచూద్దా మనుకుంటున్నారు. నేను నిండా మునిగాను. ఇంక నాకు చలిభయం లేదు." అన్నాడు.

★ కాలపురుషుని కేళీవినోదం ★

"అదేమిటి బాబూ! విచిత్రంగా మాట్లాడేస్తున్నారు! తమ కేమిటి, అప్పలేమిటి!" అనివిస్తుపోయాడు రంగన్న.

"ఆ సంగతి నీ కెందుకులే, ఊరుకో. కడుపులో కాక్కులు తన్నేస్తున్నాయ్. ఏదైనా నరే తినడానికి తగిందైతే చాలు తీసుకురా యిక్కడికి."

రంగన్న లోపలికి వెళ్ళి, నాలుగరటి పళ్ళూ, అరడజను కమలా పళ్ళు తెచ్చి టేబిల్ పైన వుంచాడు.

"నువ్వు వీటిని కాస్త ఒలిచిపెట్టు రంగన్నా, ఆలోపల నే నిదేమిటో చూస్తాను." అన్నాడు భుజంగరావు న్యూసుపేపరు చేతికి తీసుకుంటూ.

"పేపరు చూచుకోడాని కిప్పుడేం తొందర బాబూ! ముందు ఈ పని చూడండి. నిన్నెప్పుడు తిన్నారో ఏమో, ఈ రోజంతా పస్తు వుండిపోయారు." అని బ్రతిమాలుకున్నాడు రంగన్న.

భుజంగరావు కళ్ళు నులుముకుంటూ "రాత్రి నిద్ర లేనందువల్లనేమో కళ్లు మండుతున్నాయి రంగన్నా! నువ్వు కాస్త ఈ పేపరు చదువ లేవూ!" అన్నాడు.

"ఎప్పటి చదువు బాబూ నాది! అక్షరాలు గుర్తున్నాయో లేవో! ఐనా యివ్వండి. తెలిసినంతవరకూ కూడి కూడి చదువుతాను" అంటూ రంగన్న పేపరు చేతికి తీసుకుని తన కిష్టమైనచోట ప్రారంభించాడు. "కమ్మని తావిని వెదజల్లే కామినీ ఊదువత్తులనే వుపయోగించుడు. ఇవి..."

"అది అడ్వర్టయిజుమెంటు రంగన్నా" తీవ్రంగా మందలించాడు భుజంగరావు.

రంగన్న పేజీ త్రిప్పి మళ్లీ చదువు కొనసాగించాడు. "రామసముద్రం దగ్గర రైలు ప్రమాదం. గూడ్సు బండీతో ప్యాసెంజరు ఢీకొనగా నలభైఆరుమంది హఠాన్మరణం" అక్కడ ఆగి రంగన్న "ఇదేమిటి బాబూ! ఈసంగతి యింతవరకూ ఎవరూ చెప్పుకోలేదే! ఎప్పుడు జరిగిందిది" అన్నాడు.

"ఎప్పుడు జరిగిందో చూడు. అక్కడే వుంటుంది" అన్నాడు భుజంగరావు అరటిపండు ఒలిచి నోట్లో వేసుకుంటూ.

"బుధవారంనాటి రాత్రట బాబూ!"

"ఇప్పుడు నేను తలుచుకొంటే ఆ ప్రమాదాన్ని తప్పించగలను."

"అంతకంటేనా బాబూ! మీరు వెయ్యేళ్లు బ్రతకాలి."

"నువ్వో పిచ్చి వుల్లయ్యవి రంగన్నా! ఆ ప్రమాదాన్ని తప్పిస్తే మన కేం లాభ మొస్తుంది?"

"ఇలాటివాటిల్లోగూడా లాభనష్టాలు బేరీజు వేసుకుంటే ఎలా బాబూ!"

"నువ్వు నాకు సలహాలు చెప్పక్కర్లేదు. ఇంకొక వార్త చదువు."

"గుమ్మడితీగ ఒకటి సర్పాకారంతో..."

"అది మనకనవసరం. మరొకటి చూడు."

"రేవతీ క్రాస్‌వర్డ్సు..."

"ఏమైం దది? నిషేధించారా?"

"కాదండీ! ఏదో విన్నింగు లైనట."

"ఏమిటీ! విన్నింగు లైనే!" భుజంగరావు తటాలున లేచి నిలబడి రంగన్న చేతిలోనుంచీ పేపరు లాక్కుని "ఇది పేపరు కాదురా, రంగన్నా! అదృష్టదేవత నా మెడలో వేయడానికి తెచ్చిన పుష్పహారం! నువ్వన్నట్టు యిది విన్నింగు లైనే! ఆ అలమారా తెరచి రేవతీ క్రాస్‌వర్డ్సు ఫారాలున్నాయి, ఇలా పట్టుకురా. రేపీపాటికి మనం ఫస్టు ప్రయిజు కొట్టేస్తాం. ఫస్టు ప్రయిజంటే ఎంతో తెలుసా రంగన్నా? ఒక్క లక్ష రూపాయలు. పైగా ఒక మోటారుకారు."

రంగన్న అలమారా తెరచి క్రాసువర్డ్సు ఫారాలను బయటికి తీస్తూ "నాకు చాలా అయోమయంగా వుంది బాబూ! మీమాటలు వింటుంటే నాకు మతిపోయిందేమో ననిపిస్తోంది" అన్నాడు.

"ఏమిటీ! బుధవారంరాత్రా! ఐతే ఈ ప్రమాదం యికపైన జరగబోతుందన్నమాట! రంగన్నా! ఇప్పుడు తెలుస్తోందిరా బాబూ ఈ పేపరుయొక్క విలువ ఏమిటో!

"ఇప్పుడు నీకు విడమరచి చెబుతూ కూచోడానికి నాకు తీరిక లేదు. నువ్వు నేను చెప్పినట్టు చెయ్. ఐదు కాలాలు పూర్తి చేసేశాను.

తీసుకెళ్ళి ఈ రోడ్డుచివర ఏజెంటున్నాడు. అతడిదగ్గిరిచ్చి రసీదు తీసుకురా. ఆ కోటు జేబులో ఐదు రూపాయలున్నాయి, తీసుకెళ్లు."

రంగన్న కాగితాలు భద్రంగా జేబులో వుంచుకుని నాలుగడుగులు వేయకముందే మళ్ళీ భుజంగరావు త్రుళ్ళిపడి లేచాడు.

"ఉండు రంగన్నా! ఆనందాలుగానీ, ఆపదలుగానీ ఒంటరిగా రావు గదా! ఈ రోజుతో నా జీవితం పూర్తిగా మారిపోబోతోందనుకో. భేవతీ క్రాసువర్డ్సువాళ్లు ఒక లక్ష రూపాయలివ్వబోతున్నారా! ఇంతలో యింకొకటి కనబడుతోంది."

"అదేమిటి బాబూ?" అంటూ రంగన్న నోరు తెరచుకున్నాడు. అతడి నోరు తెరిచింది తెరిచినట్టే వుండిపోయింది.

"ఇదిగో, ఈ పది రూపాయలు కూడా తీసుకెళ్ళి నారాయణదాసు రోడ్డులో గుఱ్ఱప్పందేల తాలూకు ఆఫీసుంది చూడు, అక్కడికి వెళ్ళి 'ఫ్లయింగు స్టార్' అనే గుర్రంపైన కట్టు. అది రేపు పందెంలో గెలువబోతోంది. ప్రయిజెంతో తెలుసా రంగన్నా! ఒకటి కాదు, రెండు కాదు, మూడు లక్షలు! అబ్బబ్బ, అంత డబ్బు ఎలా ఖర్చు చేయాలో నాకు తెలియకుండావుంది రంగన్నా! ఆనందాతిరేకంవల్ల నా మనసు స్వాధీనం తప్పుతోంది. నువ్విలా నిర్ఘాంతపడి నిలుచోవడానికి యిది సమయంకాదు. పరుగెత్తు. పది నిమిషాల్లో తిరిగి రావాలి."

రంగన్న డబ్బుతీసుకుని వెనక్కి తిరిగి భుజంగరావుని చూస్తూ, అక్కడినుంచీ వెళ్ళిపోయాడు.

భుజంగరావు కుర్చీనుంచి లేచి గదిలో పచారుచేయసాగేడు. కాళ్ళు నేలపైనే నడయాడుతున్నప్పటికీ, గాలిలో తేలిపోతున్నట్టు అతడికి మహోత్సాహం కలిగింది. గొంతెత్తి హాయిగా ఒక జావళీ పాడేయాలని గూడా అతడనుకున్నాడు కాని అప్పటికి జ్ఞాపకం వచ్చిన పాత సినిమాపాట ఒకటి పాడుకుంటూ మళ్ళీ అతడు పేపరు చేతికి తీసుకున్నాడు. కొంతసేపటికి పాట ఆపి యింకా ఏమైనా ముఖ్యవార్తలు తన కళ్ళబడలేదేమో ననుకుని మళ్ళీ చదువసాగేడు. "అసెంబ్లీలో విడాకులచట్టం గురించి చర్చ ... సంపాదకీయ వ్యాఖ్య ... తుంగభద్రా ప్రాజెక్టు ... రాకపోకలు ... వాతావరణం... ఆకాశవాణి...మదరాసులో ఒక వణిక్ప్రముఖుని దుర్మరణం."

"పూర్ ఫెలో, ఎవడు వాడు" అనుకుంటూ భుజంగరావు వార్తని చదువసాగేడు. "నిన్న సాయంత్రం నాలుగ్గంటలకు సరిగ్గా..." ('అంటే యిప్పుడే నన్నమాట' అనుకున్నాడు భుజంగరావు) "భవాని ఆయిల్ ఫ్యాక్టరీ యజమాని..." (ఏమిటీ, ఏమిటీ అని అరిచాడు భుజంగరావు) 'భుజంగరావుగారు.' ('అయ్యో, అయ్యో, చచ్చాన్రా బాబూ!' అంటూ భుజంగరావు ఆక్రోశించాడు) "హృద్రోగం చేత..."

"హృద్రోగమే! నా...నా... నాకే!" అంటూ భుజంగరావు మొదలు నరకిన అరటిచెట్టులా దభాలున క్రింద పడి ప్రాణాలు వదిలాడు. ★

అబల

(11 వ పేజీ తరువాయి)

తనను ఇప్పటి మిడిసిపడే యువతులకు చెందని సత్యకాలపు పిల్లల క్రింద చేర్చుకొని మాట్లాడుతోంది. తాను నిజమైన అభిప్రాయం వెలువరిస్తే తానేదో ఆమెను మోసం చేసినట్లుగా భావించగలదు. ఆమెతో వాదించాలనిపిస్తోంది. అయినా ఇటువంటి అవిటితో వాదించి సాధించేదిగూడా ఏమీ లేదు.

పిల్లలతల్లి కమలను గురించి పాతకాలపు భావాలేకల పిల్లలా భావించడానికి కారణాలున్నాయి అవి కమల వేషభాషలు. ఏ ఫాషన్ సిల్కు చీరో కట్టుకోక మామూలు నేతచీర కట్టుకుంది. మొగానికి స్నో గాని లిప్ స్టిక్ గాని పూసుకోలేదు. ప్రయాణం హడావుడిలో మొగానికి కొంచెం పౌడరైనా అద్దుకోలేకపోయింది. పైగా ఆమె మాటలలో ఇంగ్లీషుమాటలైనా కనబడటం లేదు. అందువల్ల ఆ గృహిణి కమల పెద్ద చదువు చదివివుండదని, పూర్వకాలపు సంప్రదాయాలుకల కుటుంబంలోనే పెరిగి ఉంటుందని భావించి నేటికాలపు పడుచుల మీద దాడి సాగించింది నిజానికి కమలకు నేటికాలపు పద్ధతులు చాలా ఇష్టమే — నేటికాలపు పిల్లే కాబట్టి. కమల సామాన్య వేషంలో కనిపించింది కాబట్టి ఆవిడ అంత ఆప్యాయత వెళ్ళబుచ్చుతోంది కాని కమలే కొంచెం టక్కుగా తయారయివుంటే ఆమెనే ఆక్షేపించేది గృహిణి అభిప్రాయాలకు కమల లోలోపల బాధపడింది కాని పైకిమాత్రం ఏమీ అనకుండా ఊరుకుంది. పిల్లలతల్లి మళ్లీ అంది: "అన్నట్లమ్మాయి, నీవు బెజవాడే వస్తున్నావు కాదూ, మాయింటికి ఒకసారి వచ్చిపో. రామానగరం చివర సీతారామయ్యగారిల్లంటే ఎవరేనా చెపుతారు. వస్తావు కదూ." ఆమె తనమీద వెళ్ళబోస్తున్న ప్రేమ తాను నిజంగా బెజవాడ ఎందుకు వస్తున్నది తెలిస్తే ఎలా మారిపోతుందో! కమల "అలాగేనండి" అంది బెంగుళూరు వచ్చింది. పడుచు దంపతులు ఒకరితో ఒకరు

మాట్లాడుకోకుండానే దిగిపోయారు. కమల కేసి అదేపనిగా చూస్తున్న ఒకబ్రహ్మచారి పెద్దమనిషి, మరొక గుడ్లగూబకళ్ళ పడుచువాడూకూడా దిగిపోయారు. సీతారామయ్యగారు పెట్టెలోకి తిరిగివచ్చారు. భార్య వెంటనే నిలదీసింది: "ఏపనిచేసినా ఇంతే. అంత ఆలస్యం చేయడమేమిటి? ఇంకా నయం బండి దాటబెట్టారు కాదు. కాస్త త్వరగా కదలలేరూ" అని. ఆయనమాత్రం ఏమీ కంగారుపడక అదే చిరునవ్వుతో అన్నారు: "నేను నాలుగుసార్లు నీళ్ళకోసం, ఒకసారి పాలకోసం, రెండుసార్లు చిరుతిండ్లకోసం వెళ్ళవలసి వచ్చిందన్నమాట మరిచిపోయావేమిటి? తడవకు ఐదునిమిషాలు చొప్పున ఏడుసార్లకు ముప్పై అయిదు నిమిషాలు పడుతుంది. బండి స్టేషనులో ఆగేదికూడా ముప్పైఅయిదు నిమిషాలే. మరి రెండువందల పౌనుల శరీరాన్ని ఇరవై అయిదు గజాలదూరం చేరవేయడానికి టైమేదీ? అందువల్ల దగ్గరున్న పెట్టెలోనే ఒక పాతస్నేహితుడు కనిపిస్తే అందులోకి ఎక్కాను. ఇంతకీ జరిగిన ప్రమాదమేమీ లేదుకదా! ఏడుగురు పిల్లలూ కులాసాగానే ఉన్నారుగదా! పైగా ఈ విగ్రహాన్ని ఎదుట లేకుంటే నీ మనస్సుకు కాసేపు విశ్రాంతి లభిస్తుందేమో ననుకున్నానుకూడా." ఆయన తనస్థానంలో చతికిలబడి పిల్లలకేసి స్నేహంగా చూస్తూ భార్యకేసి చిరునవ్వుతో చూశారు. భార్య మరికాస్త మండిపడుతూ "పీకమీదకు వస్తున్నా మీ హాస్యం మానరు" అని గుంజుకుంది.

—ఆధునిక యువతుల విశృంఖలత్వాన్ని నిరసించే ఆ సాధ్వీమణి పోకడలనుగమనిస్తూ కమల ఏమీమాట్లాడకుండా ఉంది. పిల్లలు కమలదగ్గర బాగా చనువైపోయారు. చంటి పిల్లవాడు మరీని. ఆమె చేతుల్లో ఉన్నంతసేపే సరదాగా ఆడుకుంటున్నాడు. సీతారామయ్యగారి భార్య కమలపట్ల ప్రత్యేక ప్రేమ చూపిస్తూనే ఉంది. తన పిల్లలతోపాటు కమలకుకూడా తనుచేసి తీసుకువచ్చిన ఫలహారాలు పెట్టింది. కమలకు లోలోపల మళ్లీ ఆందోళన హెచ్చసాగింది. బెజవాడలో మకాముమాట ఏమిటి? ఉద్యోగం దొరకకపోతే ఎక్కడవుండాలి? సీతారామయ్యగారి భార్య ఇంకా నేటి యువతులమీద సాగిస్తూనే వుంది ఉపన్యాసం. ముఖ్యంగా ఆమె అక్కసంతా తన పెద్దబావగారి వితంతుకూతురిమీదే ఉన్నట్లుంది. ఆమె నెన్నోవిధాల నిందిస్తోంది. ఆమె నావిడ ఎన్నివిధాల నిందించినా ఆమె ఆవిడ పెద్దబావగారి కూతురి) నడతలో ప్రత్యేకంగా గర్హనీయమైందేమీ కనిపించడం లేదు—ఒక్క ఉద్యోగం చేయడమనేదే తప్ప! దానినిబట్టి తనుకూడా ఉద్యోగంచేస్తే ఆవిడ ఏమనుకుంటుందో, ఆవిడలాంటివాళ్లు ఎలా గుసగుసలాడుకుంటారో కమలకు సులభంగానే బోధపడింది.

రైలు వేగంగా వెళ్లిపోతోంది. అప్పుడే బెజవాడ కొండలు కనిపిస్తున్నాయి. ఇళ్లుకూడా కనిపిస్తున్నాయి. కాని కమలకు ఆలోచన తెగలేదు బసవిషయమై. చివరికి తోచింది. ఏదో హాస్టలు చేరుకుంటే చాలు. వీలైతే తాత్కాలికంగా అక్కడే బసయేర్పాట్లు చేసుకోవచ్చు. లేకపోతే అక్కడ ఉండేవాళ్ళ సహాయం పొంది మరెక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. బండి స్టేషనులో ఆగింది. జనంఅంతా త్రోసుకుంటూ దిగుతున్నారు. ఎక్కేవాళ్లు త్రోసుకుంటున్నారు. కొందరు కిటికీలలోనుంచి సామాను గిరవాటు వేసి తాముకూడా కిటికీలలోనుంచి లోపలకు దూరుతున్నారు సీతారామయ్యగారూ లేచారు. కానిఆయన భార్య నానాకంగారు చేయడం మొదలు పెట్టింది. "త్వరగా దిగండి అలానిలబడతారేం బెల్లంకొట్టిన రాయిలా. త్వరగాకూలీని పిలవండి. ఒసే పెద్దమ్మాయీ నువ్వు టిఫన్ కారియర్ పుచ్చుకో. తమ్ముడికి గొడుగు ఇయ్యి, రెండోదానికి మరచెంబు ఇయ్యి, మూడోదానికి బుట్ట ఇయ్యి—" అంటూ తను కంగారు పడుతోంది అందరినీకంగారు పెడుతోంది. సీతారామయ్యగారు ఏమీ తొందరపడకుండా "కంగారేమీ లేదు అవతల దాటిపోయే రైలేం లేదు కదా బండి ఈ స్టేషనులో గంటసేపు ఆగుతుంది. జనం అంతా దిగనీ, తీరికగా దిగవచ్చు. ఆ చంటివాడిని ఆ అమ్మాయి తీసుకువస్తుంది. నువ్వూ ఆరుగురు పిల్లలూ వరుసగా కంగారు లేకుండా దిగండి" అన్నారు. కమల చంటిపిల్లవాడిని తీసుకుంది. సీతారామయ్యగారి భార్యా పిల్లలూ గుమ్మంవైపుకు నడవసాగారు. సీతారామయ్యగారు కూలీని మాట్లాడారు. అర్ధరూపాయికి కుదిర్చారు. కాని భార్య ఒప్పుకోలేదు "ఇట్లానే దుబారాగా తగలేస్తారు మీరు అర్ధరూపాయి యెందుకు అరణాలు చాలు" నని కేకలు వేయడం మొదలుపెట్టింది. కూలీవాడు వెళ్ళిపోతానన్నాడు. సీతారామయ్యగారెలాగో బ్రతిమాలి సామాను వాడిచేత పట్టించుకొని స్టేషను అవతలకు నడిచాడు. కమల తనసామాను కూడా ఆయనచేతే కూలీని మాట్లాడించి వారితోపాటు సీతారామయ్యగారి పిల్లవాడిని ఎత్తుకునే స్టేషను అవతలకు నడచింది. సీతారామయ్యగారు బండికుదిర్చారు. భార్యా పిల్లలూ అంతా ఎక్కారు. కమల చంటిపిల్లవాడిని కూడా అందిచ్చింది. "వెళ్ళొస్తామమ్మా. మాఇంటికి తప్పకరా" అన్నారు సీతారామయ్యగారూ, భార్యా. బండి కదిలింది. సీతారామయ్యగారి భార్య భర్తను అప్పుడే ఎందుకో సాధించడం మొదలు పెట్టింది. గుర్రబ్బండి రేటునుగురించి కాబోలు. అలా వాదించుకుంటూనే వారు వెళ్ళిపోయారు.

బండ్లవాళ్లు కమలను చుట్టివేశారు. 'హాస్టలుకు కడతారా?' అని అడిగింది. ఏ హాస్టలుకో చెబితే కట్టామన్నారు వాళ్లు. ఏ హాస్టలో ఎక్కడుందో ఏమి చెప్పగలదు? ఒకరిద్దరిని అడిగింది ఎవరూ చెప్పలేదు. ఆఖరికి ఒకావిడ వచ్చింది. చేతిలోగొడుగూ, పుస్తకాలూ అవీ చూస్తే ఆమె స్కూలులో పనిచేసేదానిలా కనిపించింది. ఆమె నడిగింది కమల. "మేరీ హాస్టలా?" అని అడిగిందావిడ. అవునంది కమల ఏదోహాస్టలు చేరుకుంటే చాలునని. ఆవిడ దారి చెప్పింది. కమల జట్కా చేయించుకుని ఆ హాస్టలు చేరుకుంది. హాస్టలువార్డన్ అప్పుడు హాస్టలులోనే వుంది. కమల ఆమెదగ్గరకు వెళ్ళి తన కొకటిరెండు రోజులు హాస్టలులో ఉండడానికి అనుమతి ఈయమని వేడింది వార్డన్ కొంతసేపాలోచించి ఒకటి రెండు రోజులైతేనే వీలుంటుందని చెప్పి అప్పటికి ఇంకా ఒకరికి ఖాళీగావున్న గదిలో ఉండడానికి అనుమతినిచ్చింది. కమల ఆవిడకి చాలా 'థాంక్స్' చెప్పి, ఇంటర్వ్యూకు సమయం దాటిపోతుందని త్వరగా ఆవిడనుంచే కంపెనీకి దారి తెలుసుకుని రిక్షామీద అక్కడకు బయలుదేరింది.

ఇంటర్వ్యూకు చాలామందే ఉన్నారు. వాళ్లని చూచేసరికి కమలకు ఆశ్చర్యం వేసింది మరి నిరుద్యోగపు తీవ్రత! అయితే తన కీవుద్యోగం దొరకడం కష్టమే. చాలామంది మగవాళ్లే. ఇద్దరు మాత్రం ఆడవాళ్లున్నారు. వాళ్లందరూ కమల అటువస్తూండడం గమనించి కుతూహలంతో చూడసాగారు తీరా ఆమెకూడావచ్చి తమ వరుసలో 'కూర్చు'నేసరికి వాళ్ళ మొగాల్లోవున్న కుతూహలమల్లా ఒక్కసారిగా అసూయగా మారిపోయింది. వెంటనే మొగాలు తిప్పివేసుకున్నారు. ఎవరూ ఒకరితో ఒకరు మాట్లాడడం లేదు. ఒకరినిచూస్తే ఒకరికి అసూయా అనుమానమూ. రెండోవాడు కొట్టివేస్తాడేమో ఉద్యోగం తనకు కాకుండానని. వాళ్ల మౌనం చూసి కమల

బాధపడింది. ఆ ఆడవాళ్ళతో మాట్లాడబోయింది. కాని వాళ్ళామెవంక చురచురా చూసి ఒకటిరెండు ముక్కజవాబులిచ్చి మళ్ళీ మొగాలు తిప్పివేసుకున్నారు. ఒక్కొక్కళ్ళే లోపలికిపోతున్నారు. మరి కొన్ని నిమిషాలకు బయటికివచ్చి ఒక్కసారి అందరికేసీ కోపంగాచూసి తలవంచుకొని విసవిసా నడచిపోతున్నారు. వాళ్ళ మొగాలవైఖరిచూస్తే కమలకు గుండె దడ పట్టుకుంది. అంతవరకూ ఇంటర్వ్యూ అంటే చాలా సరదాఅయిన విషయంగా కనిపించేది. కాని ఇప్పుడుచూస్తే అవతలవాళ్ళేం ప్రశ్నలడుగుతారో, వాళ్ళకేం సమాధానాలు చెప్పాలో, చెప్పగలుగుతుందో లేదో తాను అన్న సందేహం బయలుదేరింది. పరీక్ష ముంగున్నట్లుగా ఉంది. చివరికి కమలకు పిలుపువచ్చింది. కమల లోపలికి నడచింది. కూర్చోమన్నాడు మేనేజరు. థాంక్స్ చెప్పి కూర్చుంది కమల. మేనేజరు కొన్ని క్షణాలు ఆమెకేసి మౌనంగాచూసి 'మీరేం చదివారు' అని అడిగాడు. చెప్పింది. 'సర్టిఫికేటు' అన్నాడు. ఇంకా సర్టిఫికేటు రాలేదని చెప్పి. ఇతర ఆధారాలుచూపి, ఎస్. ఎస్. ఎల్. సి. పుస్తకంకూడా చూపించింది. "మీరు కాలేజీలో ప్రత్యేకమైన 'ఆక్టివిటీస్'లో వేటిలో నైనా పాల్గొన్నారా" అని అడిగాడు. తమ కాలేజీలో 'సోషల్ సర్వీస్ లీగ్'లో మెంబరుగా ఉండేదాన్ని అని చెప్పి కాలేజీ వారిచ్చిన యోగ్యతాపత్రం చూపించింది. మేనేజరు ప్రపంచ విషయాలమీద, దేశ విషయాల మీద కొన్ని ప్రశ్నలువేశాడు. అన్నిటికీ సరిగానే చెప్పింది కమల. మేనేజరు కొంతసేపు కాగితంమీద ఏదో రాసుకొని, మళ్ళీ ఆమె వైపుకు తిరిగి "సరేనండీ, మా ఆఫీసులో ఇప్పుడున్న స్టాఫ్ అంతా మగవారే. అందరిమధ్యా మీ రొక్కరే పనిచేయడానికి ఒప్పుకుంటారా" అని అడిగాడు. అయ్యో! ఇంతేనా ఇంటర్వ్యూ! మగవాళ్ళందరూ మగవాళ్ళయితే మాత్రమేం, తనపని తాను చూసుకుంటూ జాగ్రత్తగా ఉండేటట్లయితే. చేయగలనంది ధైర్యంగా కమల. "ఎల్లుండి ఫస్టుతారీఖు కాదూ. ఎల్లుండినుంచి పనిచేయగలరా?" అని అడిగాడు మేనేజరు. కమల సంతోషంతో పొంగిపోతోంది. తనకే ఉద్యోగంవస్తోంది! ఆ వేళనుంచే పనిచేయాలన్నంతటి ఉత్సాహంతో "అలాగే చేరగలనండి" అంది. "మంచిది. అట్లాచేయండి. ఇప్పుడే మీకు అపాయింట్‌మెంట్ ఆర్డరు వ్రాసియిచ్చేస్తాను. ఎల్లుండి పొద్దునవచ్చి డ్యూటీలో జాయినవండి" అని ఒక క్లర్కుని పిలిపించి ఆర్డరు టైపు చేయించి, దానిమీద సంతకంపెట్టి ఆమెకిచ్చాడు. కమల నమస్కారంచెప్పి బయటికి నడచింది.

కమల అప్పుడు గాలిలో తేలిపోతున్నట్లనిపించింది. ప్రపంచమంతా చాలా మంచిదిగా కనిపించింది. తాననుకున్నదంతా నెరవేరుతుందన్న మహోత్సాహంతో రిక్షాను పిలవడం మరచిపోయి చకచకా నడవసాగింది. ఒక బిచ్చగాడు "ముష్టిఅమ్మా, ధర్మం అమ్మా" అంటూ వెంటబడ్డాడు. కమల వెంటనే ఒకఅర్ధరూపాయితీసి వాడిజోలెలో వేసి నవ్వుకుంటూ ముందుకునడచిపోయింది. ముష్టివాడు అర్ధరూపాయిచూసి ఆశ్చర్యముతో కొంతసేపు తెల్లబోయి, ఆమె పొరబాటున వేసివుంటుందనీ, పొరబాటు తెలుసుకొని మళ్ళీతిరిగి వస్తుందేమోనన్న భయంతో ఆమెకు కనబడకుండా వుండేందుకు ప్రక్కసందులోకిదూరి హాయిగా నిద్రపోతున్న కుక్కలనూ పందులనూ చెదరగొట్టుతూ పరుగెత్తడం మొదలుపెట్టాడు.

కమల హాస్టలుకుతిరిగివచ్చి అక్కడనుంచి ఇల్లుచూసుకుందుకు బయలుదేరింది. మొదట ఒకయిల్లు చూసింది. గదులూ అన్నీ బాగానే వున్నాయి. ఇంటావిడ అద్దె చెప్పింది. వెంటనే ఒప్పుకుంది కమల. "అయితే మీ ఆయనకూడా వచ్చి చూడరూ. ఆయనకు మాత్రం నచ్చవద్దూ" అని అడిగింది ఇంటావిడ. "నేను ఒంటరిదానినేనండి, నాకింకా పెళ్ళికాలేదు," అని చెప్పింది కమల. ఇంటావిడ కొంచెంసేపు మాట్లాడకుండా కమలకేసి అనుమానంగా చూసింది. "మరి ఒంటరిగావుండి ఏమిచేదామని యిక్కడ వుండామనుకుంటున్నావమ్మా? చదువుకో సమా?" అని ప్రశ్నించింది ఆవిడ. "కాదండీ ఉద్యోగం చేసుకుందుకు వచ్చాను. ఈ వేళే ఒక కంపెనీలో పని దొరికిందండి" అంది కమల. "అయితే మీ పెద్దవాళ్ళెవరూ లేరూ?" అని మళ్ళీ ప్రశ్న. అన్నగారొక్కడే ఉన్నాడని చెప్పింది కమల. "అయ్యో నీకు ఉద్యోగంచేసే కర్మ ఏమిటమ్మా? చక్కగా పెళ్ళిచేసుకుని సుఖపడక ఈతిప్పలేమిటమ్మా? నీలాంటిపిల్లను చూస్తే ఎవళ్ళైనా కళ్ళకద్దుకుని చేసుకుంటారు - అలాంటిది నీకీ ఉద్యోగమెందుకమ్మా" అంది ఇంటావిడ విడ్డూరంగా చూస్తూ. "ఊరికేనండి, సరదాకోసం కొన్నాళ్లుద్యోగం చేయాలని చేరాను — అయితే, ఈ వేళే చేరవచ్చునా అండి వాటాలోకి?" అని అడిగింది కమల. అంతకు ముందుకమలను ఏదోవిధంగా ఇంట్లో ప్రవేశపెట్టేందుకు ఆతురత చూపుతున్నదల్లా ఇప్పుడు తటపటాయిస్తూ, "అప్పుడే ఎలా చెప్పనమ్మా? మావారు వచ్చిన తరువాత ఆయనతో చెప్పి ఆయన ఒప్పుకుంటే ప్రవేశిద్దువుగాని. నాకు తెలియకుండా నే ఆయన ఎవరికేనా మాటఇచ్చారేమో! ఇచ్చేవుండవచ్చు కూడా. తరువాత వచ్చి కనపడమ్మా" అంది ఆవిడ. ఇక్కడ లాభం లేదని కమల ఇంకోయిల్లు చూడడానికి వెళ్ళింది. ఆ ఇంటావిడ మొదట్లోనే మొదలు పెట్టింది. 'ఇన్వెస్టిగేషన్' పైగా ఇల్లూ నచ్చలేదు కమలకు. అందువల్ల ఇంటావిడ ప్రశ్నల పరంపర ఆపివేసేందుకు కమల "కాసిని మంచినీళ్ళిస్తారా" అని అడిగింది. "అయ్యో దానికేమమ్మా" అంటూ లోపలికిపోయి మంచినీళ్లు తెచ్చియిచ్చింది ఆవిడ. "చాలునా అమ్మా, ఇంకాసినిపట్టుకురానా" అని అడిగింది. "చాలండి. మరి నేను వెళ్ళొస్తానండి" అని గ్లాసు అక్కడ పెట్టివేసి వచ్చివేసింది కమల. ఈ పద్ధతిని చూస్తే తనకెక్కడా ఇల్లు దొరికేటట్లు లేదు. నిరాశతో హాస్టలు చేరుకుంది.

హాస్టలులో ఉన్నవాళ్ళలోనే ఒకరిద్దరితో తన పరిస్థితి చెప్పుకొని యెక్కడేనా మంచివాటాలు దొరుకుతాయేమో చెప్పమని అడిగింది. అందులో ఒకరు 'నేను చూపిస్తానులెండి' అని మర్నాడు ప్రొద్దున కమలను తీసుకువెళ్ళింది ఒకయింటికి. ఇంటావిడ విధవ. ఇంటి అద్దెమీదే బ్రతుకుతోంది. అందువల్ల ఆమెకు ఎవరెలాంటి వారయినా ఫరవాలేదు. ఇంటి వాటాకూడా కమలకు బాగా నచ్చింది. ముందు ఒక పెద్దగది, వెనకాల వంటచేసుకుందుకు ఒక చిన్న గదీ వున్నాయి. స్నానాలకు వంటగదిలోనే వొకప్రక్కన అడ్డగోడ కట్టివుంది. కమల ఇక ఆలోచించక ఇంటావిడకు చేరుతానని చెప్పి హాస్టలుకు తిరిగివచ్చి, తనపెట్టే, బెడ్డింగూ తీసుకొని బండిమీదవచ్చి కొత్త వాటాలో చేరింది. పెట్టెలోని గుడ్డలుతప్ప మిగిలినసామాను గది అలమారులో పెట్టి, బెడ్డింగు పరచుకొని కూర్చొని ఒకసారి అంతవరకూ గడచినగాథ తలచుకుంది. కానీ నాడు స్వతంత్రజీవితం గడపబోతున్నానని గర్వంపొందేబదులు ఆమె హృదయంలో నుంచిఏదో అర్థంలేని ఏడుపుపొంగివచ్చింది. అలాగే మోకాళ్లమీద తలఆన్చుకొని, యేడుస్తూ వుండిపోయింది.

[ఇంకా వుంది]



“తెనాలి రామకృష్ణ”లో రామకృష్ణుని భార్య కమలగా - జమున.

బొంబాయి సినిమా లేఖ

గడచిన దీపావళినుండి ఈదీపావళి దాకా చూస్తే, హిందీ చిత్రరంగం ఆశాజనకంగా ఉన్నది. ఐదుచిత్రాలు (నాస్తిక్, నాగిన్, జాగృతి, అజాద్, వచన్) వివిధ కేంద్రాలలో రజతోత్సవాలు చేసుకున్నాయి. కుందన్, ఝనక్ ఝనక్ పాయల్ బాజే, ఉరన్‌ఖటోలా, మునీంజీ చిత్రాలుకూడా రజతోత్సవాలు చేసుకునేటట్లే కనబడుతున్నాయి మిర్జాగాలిబ్, అధికార్, మిస్టర్ ఎండ్ మిసెస్ 55, మస్తానా, వామన్ అవతార్, శిక్షత్, బహుత్ దిన్‌హువే చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచివిజయం పొందాయి. నటులు చక్కని నటనాప్రావీణ్యం ప్రదర్శించారు. మునీంజీలో దేవ్‌ఆనంద్, ఆజాద్ లో దిలీప్‌కుమార్, శ్రీ 420లో రాజ్‌కపూర్, మిర్జాగాలిబ్‌లో భారత్‌భూషణ్, కుందన్‌లో సొహ్రాబ్‌మోడీ, తమ నటనాచాతుర్యంఅంతా వెల్లడించారు. ఝనక్ ఝనక్‌లో సంధ్య, మిస్టర్ ఎండ్ మిసెస్ 55లో మధుబాల, శ్రీ 420 లో నర్గీస్ కూడా గొప్ప నటీమణు లనిపించుకున్నారు.



తార నర్గీస్

ఉపపాత్రధారులలో జానీవాకర్ 'రైల్వే ప్లాట్‌ఫార్మ్' లోను, ఎస్. కె. ప్రేమ్ 'వచన్' లోను, గీతాబాలి 'కవి' లోను అద్భుతనటన ప్రదర్శించారు. అయితే అవసరైన అభివృద్ధి ఫొటోగ్రఫీ, సెట్స్ మొదలయినవాటిలోను, ముఖ్యంగా చలనచిత్ర నిర్మాణపు టెక్నిక్‌లోను కనిపించింది. ఝనక్ ఝనక్, నాగిన్ చిత్రాలో మన టెక్నీషియను ఇతరదేశాల టెక్నీషియన్‌లతో సమానమైన సామర్థ్యం చూపించారు. ఇతరదేశాలనుండి టెక్నీషియన్‌లను దిగుమతి చేసుకుని డాలర్ నిల్వలను ఖర్చు చేసుకోవలసిన అగత్యంలేదని దీనివల్ల ఋజువైంది.

*   *   *

*   *   *   *

చలనచిత్రాలను విమర్శనాదృష్టితో చూసి, బాగోగులు నిర్ణయించుకునే అలవాటును పెంపొందించడంకోసం 'ఫిల్మ్ సొసైటీ' లను ఏర్పాటుచేయాలని ఈ పత్రికలో ఇదివరలో హెచ్చరించబడింది. శబ్దదృశ్య విద్యాబోధన జాతీయసంఘంవారు పాఠశాలల్లో 'చలనచిత్ర పరిశీలన'ను ఒక సబ్జక్టుగా పెట్టాలని భారతప్రభుత్వానికిసూచించారు, భారతప్రభుత్వం ఈ సూచనను ఆమోదించినట్లు తెలుస్తోంది. త్వరలో దీనిని అమలు చేయడం మంచిది. విద్యార్థులపై చలనచిత్ర ప్రభావం అవాంఛనీయధోరణిలో ఉంటోందని చాలకాలంగా సనాతనవాదులు ఆరోపిస్తున్నారు. చలనచిత్రాలలో కళకు, సాంఘిక ప్రయోజనానికి సంబంధించిన విలువలను అవగాహన చేసుకోవడంలో విద్యార్థులను తర్ఫీదుచేసినట్లయితే ఈ ఆరోపణకు ఆస్కారం ఉండదు. ప్రయోజనయుక్తమైన విశిష్టచిత్రాలను నిర్మించే నిర్మాతలుకూడా తమ చిత్రాలకు ఈ విధంగా సంస్కారవంతులైన ప్రేక్షకులు తగినంతమందివచ్చి, తమ మాత్రపు విజయం చేకూరుస్తారనే ధైర్యం కలిగి విశిష్టచిత్రాల నిర్మాణానికి పూనుకుంటారు.

*   *   *   *

నళినీజయవంత్, అజిత్, జానీవాకర్, కొత్తనటి నిమ్మీ నటిస్తున్న "జనవరి 26" చిత్రం సంగీతంతో, విచిత్రకల్పనతో కూడి ఉండి, భారత స్వాతంత్ర్య సమరాన్ని

బొంబాయి సినిమాలేఖ

చిత్రిస్తుంది. దీని నిర్మాత రమేష్ సైగల్.

బొంబాయిలో ఇంకా జనాన్ని బాగా ఆకర్షిస్తున్న "కుందన్" చిత్ర నిర్మాత సొహ్రాబ్ మోడీ "ఘర్ ఘర్ మే దివాలీ" అనే సంగీతచిత్రం దాదాపు పూర్తిచేశారు. దర్శకుడు కె. జాగీర్దార్ కూడా ఈ చిత్రంలో నటిస్తున్నారు. సజ్జన్, శ్యామ ప్రధాన పాత్రలు ధరిస్తున్నారు.

"పరిణీత"లో ప్రేక్షకుల ప్రశంసలు చూరగొన్న జంట మీనాకుమారి, అశోక్ కుమార్ మళ్ళీ బి. ఆర్. చోప్రా నిర్మిస్తున్న "ఏక్ హీ రాస్తా"లో నటిస్తున్నారు. దీనికథ పండిట్ ముఖ్ రంశర్మ వ్రాశారు.

నదీరా, ఆగా, కృష్ణకుమార్, అన్వర్, రజని, గోప్, ఓంప్రకాష్, సుందర్, మీర్జాముషారఫ్, మారుతి మున్నగువారు నటిస్తున్న హాస్య చిత్రం "గర్మాగరమ్" చిత్రంలో ఈ హాస్యతారాగణంలో రెండు సింహాలు, ఒక పులి, ఒక గాడిదకూడా ఈమధ్య చేరాయి. ఈ చిత్రం నిర్మాత పి. యల్. సంతోషి. ★

"ఇన్సానియత్"

జెమినీవారి హిందీ చిత్రం "ఇన్సానియత్" గత మాసం 28 నుంచి మద్రాసు, వెలింగ్టన్‌లో నడుస్తున్నది. దర్శకత్వం ఎస్. ఎస్. వాసన్, సంగీత దర్శకత్వం సి. రామచంద్ర నిర్వహించారు. దేవ్ ఆనంద్, దిలీప్‌కుమార్, బీనా రాయ్, ఆగా, విజయలక్ష్మి, శోభనసమర్థ్, జైరాజ్, జయంత్, మోహన, బద్రీప్రసాద్ మొదలైన హిందీ ప్రముఖతారలు, నటీనటులు ఈ చిత్రంలో పాల్గొన్నారు.

తను ప్రేమించినయువతి మరొకణ్ని ప్రేమిస్తోందని తెలిసి ఆ యువతి సౌఖ్యం కోసం తన ప్రేమను, ప్రాణాలను త్యాగం చేసిన ఒక వీరుడు, దుష్టుడైన రాజును ప్రజలసహాయంతో తొలగించిన మరొక వీరుడు ఈ కథలో ప్రధాన పాత్రలు. మొదటి వీరుడుగా దిలీప్ కుమార్, రెండవ వీరుడుగా దేవ్ ఆనంద్, వారి ప్రేమకు పాత్రమైన యువతిగా బీనారాయ్ నటించారు.

ప్రముఖతారలు, పెద్ద సెటింగులు కాక ఈ చిత్రంలో ప్రధానాకర్షణ హాలీవుడ్ నుంచివచ్చి నటించిన జిప్పీ. ఈ కోతి చేసే సాహసకృత్యాలు, వింతలు సామాన్య ప్రేక్షకులకు వినోదకరంగా ఉండేటట్లు చిత్రించారు.

ప్రేక్షకులు సినిమాలనుండి ఆశించేది, నిర్మాతలు వారికి ఇవ్వవలసినది వినోదమే నని పదేపదే చెబుతూవచ్చిన శ్రీ వాసన్ తమ అభిప్రాయాలకు అనుగుణంగా నే ఈ చిత్రం నిర్మించారు. సాధారణ ప్రేక్షకులకు



"గర్మాగరమ్" హిందీచిత్రంలో సితార్ వాయిస్తున్న ఓంప్రకాష్

ఈ చిత్రం వినోదకరంగానే ఉంటుంది.

మద్రాసులో 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే', 'శ్రీ 420' చిత్రాలు రెండేసి థియేటర్లలోను, 'ఇన్సానియత్' ఒక థియేటర్ లోను వారంరోజుల వ్యవధిలో విడుదలయి పోటీ పడ్డాయి. అయినా అన్నిటికీ ప్రేక్షకులు బహుళసంఖ్యలో వెడుతూనే ఉన్నారు.

సెన్సార్ సమస్యలు

విదేశీ చిత్రాలకు, స్వదేశీ చిత్రాలకు ఒకే సెన్సార్‌షిప్ విధానం అవలంబించడం కష్టసాధ్యమని కేంద్ర సెన్సార్ సంఘాధ్యక్షుడు ఎమ్. డి. భట్ మద్రాసులో ఈ మధ్య వెల్లడించారు.

కేంద్ర సెన్సార్ సంఘసభ్యులను ద. భా. చలనచిత్ర పత్రికా రచయితల సంఘ కార్యవర్గం గతమాసం 30 వ తేదీన ప్రాంతీయ సెన్సార్ కార్యాలయంలో కలుసుకున్న సందర్భంలో శ్రీ భట్ పై విధంగా వెల్లడించారు. చుంబనాది శృంగార చేష్టల విషయంలో స్వదేశీ, విదేశీ చిత్రాల మధ్య భిన్నవిధానం అవలంబింపబడుతున్నదని నిర్మాతలు చేస్తున్న ఆరోపణను ఆయన దృష్టికి తేగా "ఆ శృంగారచేష్టలు పాశ్చాత్య జీవిత విధానానికి సరిపోతాయి కనుక పాశ్చాత్య చిత్రాల్లో అవి ఉండక తప్పవు. బహిరంగంగా స్త్రీపురుషులు చుంబించుకునే అలవాటులేని మనదేశపు చిత్రాల్లో అవి అసభ్యంగా ఉంటాయి. అందుచేత రెండురకాల సెన్సార్ విధానం మనకు తప్పదు. కాదు కూడదంటే, చుంబనాది దృశ్యాలున్న పాశ్చాత్య చిత్రాలను మన దేశంలో పూర్తిగా నిషేధించాలి. అలా నిషేధిస్తే మనదేశంలో ప్రదర్శనార్హమైన పాశ్చాత్య చిత్రం ఒక్కటైనా మిగలదు. కనుక ఇది ఇప్పట్లో తేలని సమస్య," అని భట్ అన్నారు.

సంభాషణల్లోను, పాటల్లోనూ మామూలు అర్థాలతోపాటు అశ్లీలార్థాలు కూడా స్ఫురించే మాటలను ఆ సన్నివేశాన్ని, సందర్భాన్ని దృష్టిలో పెట్టుకుని తాము తొలగిస్తూనే ఉన్నామని ఆయన తెలిపారు.

బాలచిత్ర సంఘంలో సభ్యులైన శ్రీ కె. సుబ్రహ్మణ్యం పత్రికావిలేఖరులతో మాట్లాడుతూ, పిల్లల చిత్రాలు నిర్మించడానికి ఏర్పడిన ఆ సంఘం అచిరకాలంలో కొన్ని చిత్రాలు విడుదల చేయనున్నదని తెలిపారు. 'బాలరామాయణం' అనే చిత్రం నెలా, రెండునెలల్లో విడుదల అవుతుందన్నారు. బాలచిత్రాలకు తగిన కథలు పంపవలసిందని తమ

సంఘం చేసిన విజ్ఞప్తి ఫలితంగా కొన్ని కథలు వచ్చాయని, వాటిలో భారతీయులు వ్రాసిన ఏ ఒక్క కథా చిత్రానికి అనుకూలంగా లేదని, అందుచేత భారతీయ వాతావరణంతో, భారతీయులకు సంబంధించిన కథను ఒక ఇంగ్లీషురచయిత వ్రాయగా దానిని స్వీకరించామనీ, దానిని మొదటగా నిర్మించబోతున్నామని తెలిపారు. ఈ చిత్రాన్ని బి. ఎన్. సర్కార్ తయారుచేసి ఇస్తారట. తగినకథలను తమకు పంపవలసిందిగా ఆయన ప్రముఖరచయితలకు విజ్ఞప్తి చేశారు. బాల చిత్రాలు మొదట హిందీలో నిర్మించబడి, తరవాత ప్రధాన దేశభాషల్లోకి 'డబ్' చేయబడతాయని కూడా తెలిపారు.

పంచతంత్రం కథలను కార్టూన్ చిత్రాలుగా నిర్మించే ఆలోచనకూడా ప్రభుత్వానికున్నట్లు శ్రీ ఎమ్. డి. భట్ వెల్లడించారు.


ఉత్తమ చిత్రాలకు ప్రభుత్వ బహుమతులు

1954 వ సంవత్సరపు ఉత్తమ చిత్రాల నిర్ణయం ఈ డిసెంబరులో జరుగబోతోంది. భారతీయ చిత్రాలన్నిటిలోనూ ఉత్తమమని నిర్ణయించినదానికి స్వర్ణపదకాన్ని, వివిధ భాషా చిత్రాల్లో ఉత్తమములని నిర్ణయించినవానికి రజతపదకాల్ని, రాష్ట్రపతి బహూకరిస్తారు. ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రానికి రాష్ట్రపతి స్వర్ణపదకం, ఉత్తమ బాల చిత్రానికి భారతప్రధాని స్వర్ణపదకం బహూకరిస్తారు.


ప్రతిభాషలోను ఉత్తమచిత్రాలను మూడింటిని నిర్ణయించి మొదటిదానికి రజతపదకాన్ని, మిగతా రెండింటికి యోగ్యతాపత్రాలను బహూకరిస్తారు. వీటిని నిర్ణయించడానికి బొంబాయి, మద్రాసు, కలకత్తాలలో ప్రాంతీయ సంఘాలను నియమిస్తారు. ఈ సంఘాల అధ్యక్షులను భారత ప్రభుత్వం నియమిస్తుంది. ఒక్కొక్క భాషకు ఇద్దరేసి చొప్పున మేధావంతులైన సభ్యులు, సినిమా పరిశ్రమవారు సూచించిన ముగ్గురు సభ్యులు ఒక్కొక్క సంఘంలో ఉంటారు.

ఉత్తమ భారతీయ చిత్రాన్ని నిర్ణయించడానికి ఏర్పడే కేంద్రసంఘంలో ప్రాంతీయ సంఘాల అధ్యక్షులు సభ్యులుగా ఉంటారు. పరిశ్రమవారు సూచించిన మరో ముగ్గురు ప్రతినిధులు, కేంద్రసెన్సార్ బోర్డులోని ఒక సభ్యుడుకూడా అందులో సభ్యులుగా ఉంటారు. కేంద్రనిర్ణయసంఘం అధ్యక్షుణ్ణి ప్రభుత్వమే నియమిస్తుంది.


బొంబాయి ప్రాంతీయసంఘం హిందీ, గుజరాతీ, కన్నడ, పంజాబీ చిత్రాల్ని, మద్రాసుసంఘం తెలుగు, తమిళ్, మలయాళీ చిత్రాల్ని, కలకత్తాసంఘం బెంగాలీ, ఒరియా, అస్సామీస్ చిత్రాల్ని పరిశీలించి ఉత్తమ చిత్రాల్ని నిర్ణయిస్తాయి. ఇలా నిర్ణయించిన వివిధభాషల్లోని ఉత్తమ చిత్రా




ప్రకాశ్ మోడి నిర్మిస్తున్న "ఘర్ ఘర్ మె దివాలీ"లో శ్యామ, సజ్జన్ మొదలగువారు



"శ్రీ కృష్ణతులాభారం"లో తులాభార సన్నివేశం



ఇటీవల ఉత్సవాలలో ప్రదర్శించబడిన సత్యహరిశ్చంద్ర నాటకంలో అత్తిగా జి. వి. సుబ్రహ్మణ్యం, కౌశికుడిగా డా|| ఎమ్. బి. రావు, సత్యహరిశ్చంద్రగా శ్రీమతి కె. ఆర్. శివకం



... ఢిల్లీ స్టేట్‌లో, ఉద్యోగం చేస్తున్నారు.

తెలుగులో ఇది అఖిలభారత ఉత్తమ చిత్రాన్ని కేంద్రసంఘం నిర్ణయిస్తుంది.

ఈ తతంగమంతా భారతప్రభుత్వ సమాచార, బ్రాడ్‌కాస్టింగ్ శాఖ ఆధ్వర్యాన జరుగుతుంది.

రాజశ్రీ ప్రొడక్షన్స్

రాజశ్రీ ప్రొడక్షన్స్‌వారు ఒక క్రొత్త చిత్రం ప్రారంభించారు. నిర్మాత సుందరలాల్ నహతా. అంజలీదేవి, ఎన్. టి. రామారావు, రేలంగి, జానకి, సి. ఎస్. ఆర్., సున్నపుడి వెంకటేశ్వరరావు, ఆర్. నాగేశ్వరరావు ఈ చిత్రంలో నటిస్తున్నారు. దర్శకుడు రాతినేని ప్రకాశరావు, సంగీత దర్శకుడు ఘంటసాల. ఈ చిత్రంలో నృత్యాలను రంగులలో తీస్తారట.

ఈ కంపెనీవారు త్వరలో ఒక తమిళ చిత్రంకూడా ప్రారంభించనున్నారు. —స్వా

గ్రంథ స్వీకారం

ఏది సత్యం?: నవల; రచయిత శారద; ప్రకాశకులు, సుశీలా ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్, 21, ముత్తు కాపు చెట్టిస్ట్రీట్, మదరాసు-1. వెల 1-4-0.

పలికిన వెండి గ్లాసు: డిటెక్టివ్ నవల; రచయిత ఆరుద్ర; ప్రకాశకులు సుశీలా ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్; వెల 1.4.0.

అగ్ని పర్వతం: నవల; రచయిత చింతపెంట సత్యనారాయణరావు; ఎడిటర్స్ పబ్లికేషన్స్, తెనాలి; వెల 0-8-0. ప్రతులకు దేశి కవితా మండలి, విజయవాడ-2.

కవిత్రయమహిమ: నన్నయ, తిక్కన, ఎఱ్ఱనల కావ్యాలను గురించి; కర్త: బందారు అప్పలాచార్యులు; వెల 2-8-0; ప్రతులకు గ్రంథకర్త, 'కవితా ప్రభాస,' భీమవరము.

యాజ్ఞ్యవల్క్య చరిత్రము: కర్త: ఘట్టు ప్రభువు; ప్రచురణ కర్త లింగంగుంట వెంకట సుబ్బయ్య; వెల 1-8-0. ప్రతులకు ప్రచురణ కర్త, కొత్తపేట, 17 వ క్రాస్ రోడ్, బ్రాడీపేట, గుంటూరు.

నిరాశ: నవల; రచన: శేక్ మహబూబ్; వెల 0-8-0; ప్రతులకు శేక్ మహబూబ్, పిఠాపురం, ఆంధ్ర.

కాంగ్రెసులో సభ్యులుగా ఎందుకు చేరాలి?: రచన ... వెల 0-3-0; ... నిర్మాణ పరిషత్తు, తాడేపల్లిగూడెం.



హైదరాబాదులో ఆంధ్రమహాసభ కళాపరిషత్తు జరిపిన నాటకపోటీలలో ఉత్తమ నటి ('అర్ధాంగి')కు బహుమతి పొందిన కుమారి ... (గుంటూరు, నాట్యకళాసమితి).


శాస్త్రీయ సిద్ధాంత ...: ప్రచురణ ... శ్రీమతి ... ప్రచురణ, ఆంధ్ర. వెల 0-4-0. ప్రతులకు ... నాగేశ్వర్, ...

ఇండస్ట్రియల్ & కమర్షియల్ కో ఆపరేటివ్స్: రచయిత ...; వెల 1-8-0; ప్రతులకు, గ్రంథకర్త, ...

మహేంద్రోదయం: పద్యకావ్యం; కర్త: ...; వెల 1-8-0; ప్రతులకు తెలంగాణా రచయితల సంఘం, ..., రోడ్, హైదరాబాదు. ★



"బారాదరీ" హిందీచిత్రంలో
అజిత్, గీతాబాలి



హాస్యనటుడ్ నాగి, [illegible]
చిత్రం "[illegible]" లో
కనిపిస్తారు

Printed and Published for
Nageswara Rao Estates Ltd., by
S. Radha krishna at The
Andhra Patrika Press,
ఽ&), Thambu Chetty St., Madras
Editor: S. Sambhu Prasad-1.

ఆంధ్రగ్రంథమాల ప్రచురణలు

శ్రీమద్భగవద్గీత—కా. నాగేశ్వరరావు	...	రు. 4 00
భారతము (ఉద్యోగపర్వము)	...	1 00
బసవపురాణము	...	4 00
ఆంధ్రవచన వాఙ్మయము —ఎన్. వెంకట్రావు	...	2 00
కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో 2-వ భాగము	...	3 80
రెండు మహానగరాలు	...	3 00
ఘంటారావం	...	1 80
టామ్‌సాయర్ (పిల్లల నవల)	...	2 00
రాజు - వేద ,,	...	2 00
కాంచనద్వీపం ,,	...	1 80
హకల్‌బెరీఫిన్ ,,	...	2 00
డాన్‌క్విక్‌సెట్ ,,	...	2 00
విచిత్ర వ్యక్తి ,,	...	1 80
అల్లీబిల్లీలోకంలో అమ్మాయి కథ	...	1 00
మనిషిలో మనిషి	...	1 40
పంచతంత్రం: (మిత్రభేదం-మిత్రలాభం-బొమ్మలలో)		1 80
మంచీ - చెడూ	...	2 00
టామ్‌సాయర్ ప్రపంచయాత్ర	...	1 80
అపస్వరాలు	...	2 00

ప్యాకింగు, పోస్టేజి ప్రత్యేకం.

రైల్వే పార్సిలుగా పంపవలసినచో దగ్గర రైల్వే స్టేషను తెలుపవలెను.

మేనేజరు, ఆంధ్రగ్రంథమాల,

7, తంబుచెట్టి వీధి, — మద్రాసు - 1.

